తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

నవంబరు 2020. వెల రూ.5/-




## తిరుచానూరు
## శ్రీ పద్మావతీ అమ్మవారి
## కార్తిక బ్రహ్మోత్సవం

2020 నవంబరు 11 నుండి 19 వరకు

తిరుచానూరు
శ్రీ పద్మావతీ అమ్మవారి
కార్తిక బ్రహ్మోత్సవ
ప్రత్యేకసంచిక


తిరుమల తిరుపతి దేవస్థానములు
16-10-2020
నుండి
24-10-2020
వరకు
జరిగిన
శ్రీవారి నవరాత్రి
బ్రహ్మోత్సవ
దృశ్యమాలిక !













# గీతాశ్లోకార్థసారం



**శ్లో : అనంత విజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః ।**
**నకులః సహదేవశ్చ సుఘోషమణి పుష్పకౌ ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-16వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** కుంతీపుత్రః= కుంతీదేవీ కుమారుడును; రాజా= రాజూ అయిన; యుధిష్ఠిరః = ధర్మరాజు; అనంతవిజయమ్= అనంతవిజయమనే శంఖాన్నీ; నకులః= నకులుడు; సహదేవః చ= సహదేవుడూ; సుఘోషమణిపుష్పకౌ= సుఘోషం, మణి పుష్పకం అనే శంఖాలను; (దధ్ముః= క్రమంగా పూరించారు.

**భావం:** కుంతీపుత్రుడైన ధర్మరాజు అనంతవిజయమనే శంఖాన్నీ, నకులుడు సుఘోషమనే శంఖాన్నీ, సహదేవుడు మణిపుష్పకమనే శంఖాన్నీ పూరించారు.

# పాలజలధి కన్యవు పద్మాసనివి నీవు

పరమాత్మునిఁడైన హరి పట్టపురాణివి నీవు
ధర మమ్ము విచారించఁదగు నీకు నమ్మా ॥


కమలజుఁ గన్న తల్లి కామునిఁ గన్నతల్లి
అమరులఁ గన్న తల్లి ఆదిమలక్ష్మి
విమలపు నీ పతికి విన్నపము సేసి మమ్ము
నెమకి యేలితి దయ నీకే తగునమ్మా ॥


కామధేను తోఁబుట్టుగ కల్పకము తోఁబుట్టుగ
దోమటి చల్లని చంద్రు తోఁబుట్టుగ
నీ మగని పంపునను నిజసిరు లిచ్చితివి
నేమపు వితరణము నీకే తగునమ్మా ॥

పాలజలధి కన్యవు పద్మాసనివి నీవు
పాల పండే శ్రీవేంకటపతి దేవివి
యేలిన యితనిబంట్లకు ఇహపరాలిచ్చి మా-
పాలఁగలిగితివి సంబంధము మేలమ్మా ॥

(సం.20, సం.కీ.36)

పరమాత్ముడైన శ్రీహరికి పట్టపు రాణివి. నీవు! బ్రహ్మకు, మన్మథునికి కన్న తల్లివి! మా బాగోగులు, మంచి చెడ్డలు చూడవమ్మా! ఓ ఆదిలక్ష్మి! నీ పతికి విన్నవించి మమ్మల్ని దయతో పాలించవమ్మా! ఓ పద్మాసనీ! వేంకటపతిరాణీ!! స్వామివారి బంటులమైన మాకు ఇహపరసౌఖ్యాలు అనుగ్రహించావు! ఈ అనుబంధం చాలా బాగున్నదమ్మా! స్వామి, నీవు మమ్మల్ని చక్కగా పాలిస్తున్నారమ్మా! మాకు చాలా ఆనందంగా ఉందమ్మా అని అన్నమయ్య ఈ కీర్తనలో అమ్మవారిని స్తుతించాడు.






పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....

# దీపావళి శుభాకాంక్షలు!

దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై
అనవరతం ప్రసరించాలనీ మరియు
ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ స్వామివారిని ప్రార్థిస్తూ.....

మీ... ప్రధానసంపాదకుడు



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు లక్ష్యాలు

**01)** అనాథలైన బాలబాలికలు, వృద్ధులు, నిరాశ్రయులు, అభాగ్యులు, నిరుపేద బలహీనవర్గాలవారి అభివృద్ధి, సంరక్షణ, సంక్షేమాలకోసం ధర్మశాలలు, వసతిగృహాల ఏర్పాటు.

అనాథలకు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినీవిద్యార్థులకు ఆర్థికంగా చేయూతనివ్వడం;

**02)** దివ్యాంగులకు, మానసికరోగులకు తగు వైద్యసదుపాయాలు కల్పించి వారి జీవితప్రమాణాలను మెరుగుపరచడం. ఈ లక్ష్యంలో కుల, మత, జాతి, వర్గ, వర్ణ భేదాలను పాటించక అందరినీ సమానంగా స్వీకరించడం.

**03)** వరదలు, కరవువంటి ప్రకృతివిపత్తులసమయాల్లో అగ్నిప్రమాదాలవంటి అవాంఛనీయసంఘటనలు జరిగినపుడు సత్వరసహాయచర్యలు గావించడం.

**04)** వినికిడిలోపం, మాటలురాని శిశువులకు, ఈ లోపాలతో ఎదిగిన పిల్లలకు పునరావాసకేంద్రాల్ని ఏర్పాటుచేయడం.

**05)** గ్రామాలలో పై లోపాలతో ఉన్న బాలబాలికలకు అవసరమైన పరికరాలను అందజేయడంతోపాటు వారిని విద్యావంతుల్ని చేయడం.

**06)** సమాజంలో కనీస అవసరమైన త్రాగునీటిని నిత్యం అందుబాటులో ఉంచడం. తిరుమల పంచాయతి, తిరుపతి కార్పొరేషన్‌కు అవసరమైన నీటివనరులఏర్పాటుకై ఆనకట్టలు, తొట్టెలను ఏర్పాటుచేయడం. నీటిపొదుపుకు అవసరమైన చర్యలు తీసుకోవడం.

**07)** శ్రేయస్కరమైన వివాహకార్యక్రమాలద్వారా వధూవరులు గౌరవాభిమానాలతో, ఉన్నతకుటుంబజీవితంతో గడిపేలా చేయడం.

**08)** పుస్తకాలతోపాటు, ఇంటర్‌నెట్‌వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలతో మనదేశ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను భవిష్యత్తరాలకు అందజేయడం.

**09)** సామాజిక క్రమశిక్షణ, నైతికవిలువల్ని పెంపొందిస్తూ యువతరంలో ఆత్మవిశ్వాసం కలిగించటం.

**10)** పై ఆశయాలసాధనకు కృషిచేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సహకారమందించడం.

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టుకు విరాళాలు ఇలా....

**01)** ఈ పథకంకోసం కనీస విరాళం రూ.1000/- గా నిర్ణయించబడింది.

**02)** రూ.1000/- కంటే తక్కువవిరాళం శ్రీవారి హుండీఖాతాలో జమ చేయబడుతుంది. ఈ విరాళాలన్నీ కూడా ఒకే జాతీయబ్యాంకులో డిపాజిట్ చేయబడతాయి, వాటిమీదవచ్చే వడ్డీ ఈ పథకంకోసం వినియోగింపబడుతుంది. దాతలు తమ విరాళాలను 'ది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు, తి.తి.దే.,తిరుపతి' వారి పేరిట ఏదైన షెడ్యూల్‌బ్యాంకుమీద తీసిన చెక్కు/ డిమాండ్‌డ్రాఫ్ట్‌ద్వారా 'చీఫ్ అకౌంట్స్ ఆఫీసరు, తి.తి.దే., తిరుపతి-517501' వారికి పంపవచ్చు.

ఇతర వివరాలకు 0877-2264258ను సంప్రదించగలరు.

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 నవంబరు, 2020 సంచిక : 06



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| లోకాలనేలే చల్లని తల్లి!! | విద్వాన్, డా॥పమిడికాల్వ చెంచుసుబ్బయ్య | 07 |
| అమావాస్యలో పున్నమి! | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ | 09 |
| మాతృత్వ సిద్ధికి... | శ్రీ కె.జానకిరామావధాని | 14 |
| ఆనందాలకు ఆహ్వానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 16 |
| నాదేముంది తల్లీ.. అంతానీదే! | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 18 |
| పొట్టనిండా.. పాలు పోసేము తండ్రీ! | సారస్వతకళానిధి డా॥వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 21 |
| పుష్కరతుంగభద్ర | శ్రీ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 24 |
| ఇలలోనే కాదు.. కలలో కూడా... | శ్రీమతి దరూరి శ్రీఆండాళ్ నాగ్ | 26 |
| శ్రీకేదారేశ్వర వ్రతకథ | శ్రీమతి పి.విజయలక్ష్మి | 51 |
| ఈ దేవుని దయ ఉంటే... | శ్రీ మల్లాది హనుమంతరావు | 54 |
| గానకైంకర్యం | డా॥ ముదివేడు ప్రభాకరరావు | 56 |
| బాలకమలాలకు ఆధ్యాత్మికతే ఆదిత్యుడు | డా॥ కలువగుంట రామమూర్తి | 58 |
| తిరుపతి యాత్ర పూర్తి కావాలంటే... | డా॥ ఈమని శివనాగిరెడ్డి | 60 |
| ఇంట్లో... ఇక కనకవర్షమే! | డా॥ మేడికుర్తి ఓబులేసు | 62 |
| వెలుగెందుకు కావాలి? | బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు | 64 |
| సామాజికవనంలో కార్తికజనభోజనాలు | శ్రీమతి పూర్ణిమాస్వాతి గోపరాజు | 66 |
| పరమపావనం | శ్రీ ఆముదాల మురళి | 68 |
| యోగ్యుడైన భర్త, ఫలప్రదమైన సంసారం కావాలంటే... | శ్రీ డి.వి.ఆర్. భాస్కర్ | 70 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 73 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 74 |

ముఖచిత్రం : మాతల్లి అలమేలుమంగ!
వెనుక చిత్రం : పుడమినేలే తల్లికి పుష్పయాగం

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333



వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# శ్రీవారికెంతో... దేవేరికీ అంతే...

శ్రీ పద్మావతిఅమ్మవారు సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి. విష్ణుదేవునివక్షఃస్థలనివాసిని. విష్ణుశక్తియే లక్ష్మి. లక్ష్మి లేకుంటే ఈ విశ్వమంతా లేమితో అతలాకుతలమౌతుంది. ఏ జీవి అయినా సుఖశాంతులతో వర్ధిల్లాలంటే లక్ష్మీకృపాకటాక్షం అవసరం. అందుకే ఆమెకు 'శ్రీ', అనీ'లక్ష్మి' అనీ పేర్లున్నాయి. 'శ్రీ' అంటే అందరిచేతా ఆశ్రయింపబడేది. 'లక్ష్మి' అంటే అందరికీ లక్ష్యస్థానమైందని అర్థాలు. ఈ ప్రపంచంలోని వస్తువులన్నీ లక్ష్మీస్వరూపాలే. పరమాణువునుండి పరబ్రహ్మవరకూ ఉండే అన్నింటిలోనూ వాటి వాటి శక్తిరూపంలో ఆదిలక్ష్మే ఉంటుంది. ఏ దేవతలకైనా వారి వారి శక్తులే వాళ్లఅర్ధాంగులు. పద్మావతి ఒక కారణంగా తిరుచానూరు, పద్మసరోవరంలో ఆవిర్భవించినా- ఆమె ఆవిర్భవించడానికి గల కారణాలు పరామర్శించినప్పుడు ఆమె సాక్షాత్తు వైకుంఠవాసిని అయిన లక్ష్మి అనేసంగతి ప్రసిద్ధం.

శ్రీవారికి బ్రహ్మ స్వయంగా తాను ముందుండి ఉత్సవాలు జరిపించినా- అవి శ్రీవారికొక్కరికే గాక-స్వామి వక్షఃస్థలంలోని స్వామినికీ చెందుతాయి. భక్తజనోద్ధరణకోసం అమ్మవారు కొండక్రింద ఉన్నా-కొండలరాయనికి జరిగే బ్రహ్మోత్సవ సంరంభాలన్నీ అమ్మకూ జరుగుతాయి. సాధారణంగా బ్రహ్మోత్సవాలు ఆయా దేవతల ప్రతిష్ఠ జరిగిన సందర్భాన్నిబట్టిగానీ, వారు అవతరించిన నక్షత్రాన్నిబట్టి గానీ జరపడం సంప్రదాయం. అమ్మవారు కార్తికమాసంలో ఆవిర్భవించిన కారణంగా శ్రీవారికి జరిగినట్లే తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలు అమ్మకు నిర్వహించడం ఆనవాయితీ. ఒకప్పుడు శ్రీవారిబ్రహ్మోత్సవాలుకూడా తిరుచానూరులోనే జరిగేవి. కనుక స్వామికీ, స్వామినికీ భేదం లేదు. క్రమక్రమంగా తిరుమలక్షేత్రం విస్తరించిన తర్వాత అక్కడే శ్రీవారిబ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఎవరిక్షేత్రంలో వారిఉత్సవాలు జరగడం సముచితం.

అమ్మవారిఉత్సవాలను బ్రహ్మోత్సవాలు అనడంలో బ్రహ్మ ఉండి, జరిపించేవి కావు. బ్రహ్మశబ్దానికి పెద్దదనే అర్థమూ, పరబ్రహ్మం అనే అర్థమూ ఉన్నాయి. ఈ రెండర్థాల్లో అమ్మవారిబ్రహ్మోత్సవాలు సార్థకమౌతాయి.

అమ్మవారు సిరులతల్లి. ఆ కలిమి ఎంత ఉండాలంటే 'ఆగజాంతం ఐశ్వర్యం' అని పెద్దలంటారు. తన ఇంటిముందు ఏనుగులుండి, వాటిఘీంకారప్రణవనాదంతో మేల్కోవడం మహైశ్వర్యం. అట్టి ఐశ్వర్యప్రదాయిని, మహారాజ్ఞి అమ్మవారు. స్వామికి గరుత్మంతుడు ప్రధానవాహనమైతే, అమ్మకు ఏనుగు ప్రధానవాహనం. ఇతరవాహనాలున్నా గజమనేది విశ్వానికి సంకేతం. 'గ' అంటే 'గచ్ఛతి' (పోయేది) 'జ' అంటే 'జాయతే' (పుట్టేది), ఇది విశ్వలక్షణం గనుక అందుకు చిహ్నంగా, ఐశ్వర్యానికి సంకేతంగా అమ్మవారిగజవాహనోత్సవం విశిష్టమైంది. చక్రవర్తులుకూడా ఎన్నో జీవులున్నా పట్టపుటేనుగునే చక్రవర్తిలక్షణాల్లో ప్రధానంగా స్వీకరిస్తారు. సృష్టిస్థితిలయాలు భగవంతుడే చేస్తున్నా-ఆదిశక్తి అయిన ఆదిలక్ష్మిసహకారంతోనే ఇదంతా జరుగుతూ ఉంది. ధనమొక్కటే లక్ష్మి కాదు. "ధన మగ్నిః, ధనం వాయుః, ధనం సూర్యో, ధనం వసుః...." అంటూ శ్రీసూక్తం అగ్ని, వాయువు, సూర్యుడు, ఇంద్రుడు మొదలగు వాళ్లందరూ ధనస్వరూపులేనని పేర్కొంది. వ్యక్తిని ధన్యుణ్ణి చేసేది ధనం. ఆ ధనమే లక్ష్మి. ప్రకృతిలోని అష్టశక్తులే అష్టలక్ష్మీరూపంతో ఈ విశ్వాన్ని పోషిస్తున్నాయి. అందుకే లక్ష్మికి 'జగత్పోషిణి' అని పేరు. పద్మావతీఅమ్మవారు పద్మంలో ఆవిర్భవించడమనేది భౌతికార్థం. ఆ కమలం యోగశాస్త్రంలోని 'సహస్రారపద్మం' అందులోనుండి ఆవిర్భవించిన శక్తి 'జ్ఞానలక్ష్మి'. జ్ఞానం లేని సంపదలు బూడిదలో పోసినపన్నీరే! కనుక విద్యాలక్ష్మి, జ్ఞానలక్ష్మి, మోక్షలక్ష్మికూడా అమ్మవారే!! ఈ నవాహ్నికఉత్సవాలు జీవి నవావరణాలు దాటి, ఆత్మతత్త్వాన్ని గ్రహించి, ఆనందించడమే పరమార్థం. పంచభూతాలు తనవశంలోనే ఉంటాయని చెప్పడం పంచమీసంఖ్య విశేషం. సిరులతల్లి గిరులలో కాక, భక్తహృదయపురాల్లో నివసించడం మనఅదృష్టం! భాగ్యవిశేషం!

ఇక్కడ దేవేరివాహనసేవలన్నీ దాదాపు తిరుమలదేవుణ్ణి అనుసరించే ఉంటాయి.

పంచమిరోజున స్వామివారినుండి సారెగా మంగళద్రవ్యాలన్నీ తిరుచానూరు చేర్తాయి. మంగళదేవతకు స్వామి పంపే మంగళద్రవ్యాలు భక్తకోటికి మహాప్రసాదమై సర్వమంగళాలకు కారణమౌతాయి. కనుక ఈ అమ్మవారిబ్రహ్మోత్సవాలు విశ్వాంతర్గత ఆదిశక్తిరూపిణి అయిన ఆదిలక్ష్మికి జరిగేవి. ఈ శుభపర్వదినాలలో భక్తకోటి పై తిరుచానూరు పద్మావతీఅమ్మవారి కృపావర్షం కురియుగాక!


# లోకాలనేలే చల్లని తల్లి!!

- విద్వాన్,
డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య
9848111794

దేవతలందరూ సహజంగా శాంతి, ఆనంద స్వరూపులే! ఆయా పరిస్థితుల్నిబట్టి త్రిగుణాలు వారిలో ప్రవేశిస్తాయి. సాకారంనుండే నిరాకారస్థితికి చేరాలన్నాయి ఉపనిషత్తులు. నిరాకారోపాసన చాలాకష్టతరమనింది భగవద్గీత. కనుక, జీవులు సులువుగా తరించడానికి భక్తిమార్గాన్ని పోషించే విగ్రహారాధనే ముఖ్యం! దేవత ఆలయంలో సర్వత్ర సూక్ష్మరూపంలో ఉన్నా స్థూలంగా మనకు గోచరించేది గర్భాలయంలోనే! ఆయా దేవతలగుణప్రభావాల్నిబట్టి పెద్దలు సముచితమైన, సార్థకమైన పేరుతో గర్భాలయాల్ని స్మరించడం, పిలవడం జరుగుతుంది.

శాంతి, దాంతి అనే పదాలు తరచుగా అందరూ వినేవే! అంతరింద్రియాలను దృఢంగా నిగ్రహించి ఉండడం శాంతి. దీన్నే 'శమం' అనీ అంటారు. బహిరింద్రియాల్ని నిగ్రహించి ఉండడం దాంతి. దీన్ని 'దమం' అనీ అంటారు. శాంతి శుద్ధసత్త్వస్థితి. దాంతి కాస్త తక్కువస్థితిలో ఉండేది. అంటే సామాన్యసత్త్వస్థితి. లక్ష్మీదేవినిగూర్చి దేవేంద్రుడు గావించిన శ్రీస్తోత్రంలో "శుద్ధసత్త్వస్వరూపా, క్రోధహింసావర్జితా" అన్నాడు. అమ్మవారు కామక్రోధాదులైన అంతశ్శత్రువుల్ని జయించి, వాటిల్ని శాసిస్తుంటుంది. ఈ స్థితినే శుద్ధసత్త్వస్వరూపమంటారు.

మొదట బ్రహ్మచర్యాదిక్లేశాల్ని సహించేదాంతిని స్థిరంగా సాధిస్తే- ఆపై అంతశ్శత్రువుల్ని నిర్మూలించే శాంతి ఏర్పడుతుంది. "శాంతము లేక సౌఖ్యము లేదు" అన్నారు-త్యాగరాజు. అశాంతి సర్వానర్థాలకూ మూలం. అమ్మవారిని ఆశ్రయించి, నిర్మలభక్తితో అర్చించేవాళ్లకు- జగన్మాత కనుక ఆమె మానసిక శాంతిధనాన్ని ప్రసాదిస్తుంది. ధనం అంటే 'సంతోషపెట్టేది' అని వ్యుత్పత్తి. నిజమైన సంతోషం శాంతిధనమే! ఎన్నిభౌతికభోగభాగ్యాలున్నా అశాంతులుగా ఉండేవాళ్లూ, ఏమిలేకున్నా ప్రశాంతులుగా ఉండేవాళ్లూ ఉన్నారు. కారణం వస్తువులుండడం, లేకపోవడం కాదు. తృప్తి లేకపోవడమే అశాంతికి కారణం. కనుక శ్రీపద్మావతీఅమ్మవారు ప్రపూర్ణఆనందనిలయునిహృదయేశ్వరి కనుక 'శాంతికి నిలయ'మై విరాజిల్లుతూంది. శాంతి తర్వాతిదశ నిత్యానందస్థితి. కనుక అమ్మవారిని మొదట నిష్కామభక్తితో, నిర్మలహృదయంతో సేవించి, శాంతమనస్కులై పిదప సప్తావరణాలుగా ఉండే సప్తగిరులు దాటి, శ్రీనివాసుణ్ణి ఆనందనిలయంలో దర్శిస్తే జన్మధన్యమై జన్మరాహిత్యస్థితి సిద్ధిస్తుంది. కనుక పారమార్థికంగా మొదట శాంతి కావాలి. పిదప ఆనందం కావాలి. శాంతం లేకుండా ఆనందం శూన్యం! ఈ తత్త్వరహస్యాన్ని గుర్తించడానికే అమ్మవారినివాసం, '**శాంతినిలయం**' కాగా, అయ్యవారినివాసం' '**ఆనందనిలయం**' అయింది. శాంతి సర్వత్రలీనమైంది శాంతినిలయం. ఆనందం సర్వత్రలీనమైంది ఆనందనిలయం.



**తిరుమల శ్రీవారు ఉండే గర్భాలయం పేరు "ఆనందనిలయం". కారణం-ఆనందస్వరూపుడూ, ఆనందదాయకుడూ, అయిన శ్రీవారు అందులో స్థిరంగా విగ్రహరూపంలో ఉండి, భక్తుల్ని సర్వదా సంరక్షిస్తుండమే!**

**ఇట్లే శ్రీవారిప్రాణేశ్వరి శ్రీపద్మావతీదేవి ఉండే తిరుచానూరులోని ఆలయంలో గర్భాలయం పేరు "శాంతినిలయం". అమ్మవారు శాంతినిలయ.**

లక్ష్మీఅష్టోత్తరశతనామావళిలో 'శాంతాయైనమః' (74 వనామం) అని ఉంది. అమ్మవారు శాంతమే తనరూప మైనతల్లి. భగవంతునియొక్కక్షమా గుణాన్ని వృద్ధిచేసే శక్తిమతి. 'తత్క్షాంతి సంవర్ధినీమ్' కదా! ఎట్టి శత్రువునైనా, ద్రోహినైనా క్షమించేగుణం ఒక్క శాంతికే ఉంది. కనుక క్షమాగుణం శాంతికి తల్లివేరులాంటిది.

కావ్యవాఙ్మయంలో 'శాంతం' ప్రకృతిరసమనీ, తక్కినవి అందులో నుంచి వికృతి చెందినవనీ (వికృతి రసాలు) చెప్పారు- శాంతరసవాదులు. నిజమైన పరమశాంతమైనస్థితిలో నుంచే ఈ సృష్టిసర్వమూ (వికృతి) రూపొందింది. కనుకనే లక్ష్మీఅష్టోత్తరశత నామావళిలో మొదటినామం 'ప్రకృతి', రెండవది 'వికృతి' అని ఉన్నాయి. కల్లోలవికృతిస్థితినుండి సృష్టి ఏర్పడదు. కనుక 'శాంతినిలయ' అంటే సృష్టికి పూర్వ మున్న ప్రశాంతిస్థితి. ఆ స్థితిలో అంతర్గతంగా ఉన్న అమ్మవారిచైతన్యశక్తివల్ల పరమాత్మ ఆకారుడై చలించి, సృష్టిస్థితిలయాదిపంచకృత్యాలు చేస్తున్నాడు. సృష్టికి పూర్వం ఉండేదీ శాంతే! సృష్టిలయం అయ్యాక ఉండేదీ శాంతే! ఈ ఆద్యంతశాంతులమధ్య ఊగిస లాటలాడుతుండేది సంసారం. విశ్వభ్రమణం. శాంతస్థితిమాత్రం అచలం. నిర్వికారం. కేవలం ఆనందమయం. ఆ స్థితిని "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ" (తైత్తిరీయోపనిషత్-2 అధ్యా-4వ అనువాకం) అనింది ఉపనిషత్తు. అంటే ఆ ఆనందమూ, శాంతీవాక్కులకు, మనస్సుకు అందనిదీ కేవలం అను భూతిపరమైంది.

సౌభాగ్యలక్ష్మీఉపనిషత్తు అమ్మవారిమంత్రానుష్ఠానవిధానాన్ని వివరిస్తూ "శ మితి బీజశక్తిః" అనింది.

**శం-శమించడం అంటే అన్నిఇంద్రియాలు వాటివాటిచేష్టలు మాని, ప్రశాంతంగా ఉండడం. ఇదే శాంతి. కనుక ఈ శాంతియే అమ్మవారి మంత్రబీజశక్తి. బీజంలో వృక్షశక్తీ, వ్యాప్తీ, ఫలత్వం- మున్నగునవి ఉన్నట్లే 'శమ్-శాంతి' అనే బీజంలో విశ్వశక్తి అంతా సూక్ష్మీకరింపబడిఉంది. ఇలా అమ్మవారి 'శాంతి నిలయం' పారమార్థికంగానూ, విశ్వనిర్మాణశక్తిబీజం గానూ విరాజిల్లే ఆలయం. 'శమ్' అనేది సర్వఫలప్రదమూ, సుఖదాయక మైన బీజాక్షరం. ఇదే శ్రేయస్సు! శాంతిలోనే పరమశ్రేయస్సు ఇమిడి ఉంది.**

శ్రీపతికి-'శాంతోదితదశ', 'నిత్యోదితదశ' అనే రెండు స్థితులున్నాయి. తరంగాలు లేని జలాశయంవలె మిక్కిలి శాంతంగా ఉండే స్థితి- శాంతోదితదశ. తన విశ్వాత్మకమైన రూపగుణవైభవాన్ని తాను అనుభవించే భగవంతునిస్థితి నిత్యోదితదశ. అమ్మవారు శాంతోదితదశలో ఉండే స్వామిని చేరి, ఆనందిస్తుంది. ఆ దశలో స్వామీ ఆనందిస్తాడు. అందుకే అమ్మవారినిలయం శాంతిరూపం. శ్రీవారినిలయం ఆనందరూపంగా వెల్గొందుతున్నాయి.

ఇలా మనం నిత్యం కోరుకొనే భౌతికశాంతిసౌఖ్యాలుగాక శాశ్వత మైన, అచంచలమైన, పవిత్రమైన శాంతి, ఆనందనిలయాలు అమ్మవారి, శ్రీవారి గర్భాలయాలు. కనుక ఇరువుర్నీ తాత్త్వికదృష్టితో సేవిస్తే, భావిస్తే- ఈ శాంతి, ఆనందనిలయాలు మనహృదయాలే అవుతాయి. ఈ దశ భక్తకోటికి అను గ్రహించాలని శ్రీపద్మావతీశ్రీనివాసుల్ని అర్థిస్తాం. లోకానికి నిజమైనశాంతినీ, ఆనందాన్నీ ప్రసాదించడానికే ఈ దంపతులు శాంతిఆనందనిలయాలలో అర్చామూర్తులై అవతరించి, అశేషభక్తుల్ని తరింపజేస్తున్నారు.

**యా దేవీ సర్వభూతేషు శాంతిరూపేణ సంస్థితా।**
**నమ స్తస్యై నమ స్తస్యై నమ స్తస్యై నమో నమః॥**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.**



**ధ్వజారోహణం**

**అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడైన శ్రీవారిహృదయేశ్వరి పద్మావతీదేవికి గజధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు శ్రీకారం చుట్టుకుంటాయి. ధ్వజం ఆలయంలో జీవస్థానం. అందుకే "ధ్వజో జీవ స్సఉచ్యతే" అని ఆర్యోక్తి.**

# అమావాస్యలో.. పున్నమి!

- బ్రహ్మశ్రీ
చాగంటి కోటేశ్వరరావుశర్మ

శ్రీకృష్ణభగవానుడు తనంతతానుగా శక్తిమంతుడు. కృష్ణుడు లేనినాడు అష్టప్రకృతులకు కదలికలేదు. అతిచిన్న తనంలోనే ఎందరో రాక్షసులను పరిమార్చాడు. కృష్ణుడు నరకాసురుణ్ణి సంహరించడంలోకి వచ్చేటప్పటికి సత్య భామను తీసుకువెళ్లాడు. తనఅష్టభార్యలలో ఒక్కసత్య భామను తప్ప మిగిలినవారి నెవ్వరినీ తీసుకు వెళ్లలేదు. ఇలా రామాయణంలో దశరథమహారాజు కైకను యుద్ధ రంగానికి తీసుకువెళ్లారు. కైకమ్మను దశరథుడు యుద్ధానికి తీసుకువెడితే మనకు రామాయణం అంతా వచ్చింది. సత్య భామతో కృష్ణుడు యుద్ధానికి వెళ్లడంవల్ల మనకు దీపావళి పండుగ వచ్చింది. ఎప్పుడో ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు నరకాసురుణ్ణి వధించాడు. కాని ఇప్పటికీ కలియుగంలో మనం దీపావళిపండుగను చేసుకుంటూనే ఉన్నాం. పూతనా సంహారం, శకటాసురభంజనం తదితరరాక్షససంహారాలు జరిగినరోజుల్ని పరిగణనలోకి తీసుకుని మనం పండుగ లను జరుపుకోవడం లేదు. కానీ ఆనాటినుండి ఈనాటి వరకు దేవతలు ఈ దీపావళి పండుగను చేస్తున్నారు. అందు కనే మనంకూడా ఈ పండుగను చేస్తున్నాం. ఒక్క నరకా సురునివిషయంలో ఎందుకు అలా దీపావళిని చేస్తారు?

ఆవళి అనగా వరుస అని అర్థం. దీపావళి అనగా దీపాలవరుస అని అర్థం. ఒకదీపం పెట్టడం కాదు చాలాదీపాలు పెట్టాలి. వరుసలు వరుసలుగా దీపాలు కన పడతాయి కాబట్టి దీపావళి అంటారు. అలా దీపాలు వెలి గించడానికి, నరకాసురుడు చచ్చిపోవడానికి ఏమైనా సంబంధం ఉందా? నరకాసురుడికన్నా ఘోరమైన రాక్షసుడు రావణాసురుడు. కానీ, రావణాసురుడు చనిపోయిన రోజున మనం దీపాలు వెలిగించడంలేదు. మరి నరకాసురుడు చని పోయినరోజున దీపాలు ఎందుకు వెలిగిస్తున్నారు? దీని వెనుక ఉన్నరహస్యాన్ని మనం అర్థం చేసుకునేందుకు ప్రయత్నం చెయ్యాలి.

ఒకనాడు కృష్ణభగవానుడు కొలువుతీరి ఉండగా దేవతలు, ఇంద్రుడు, దుర్వాసమహర్షి వీళ్లందరు వచ్చారు. వచ్చి "మహానుభావా కృష్ణా! నరకాసురునిఆగడాలు రోజు రోజుకూ మితిమీరిపోతున్నాయి. నరకాసురుడు దేవతలకు తల్లి అయిన అదితికుండలాలు తస్కరించాడు. వరుణుడి ఛత్రాన్ని ఎత్తుకుపోయాడు. దేవతలందరు విహారం చేసే మణిపర్వతాన్ని ఎత్తుకుపోయాడు. వానిఆగడాలు అన్నీ ఇన్నీ కాదు. కృష్ణా! నీవే వాణ్ణి పరిమార్చాలి" అన్నారు. అపుడు కృష్ణుడు తాను "తప్పకుండా నరకాసురసంహారం చేస్తాను." అని చెప్పి, దేవతలనందరిని సాంత్వనపరిచాడు. తర్వాత తాను యుద్ధభూమికి బయలుదేరడంకోసమనిరథం ఎక్కుతున్నాడు. సరిగ్గా అదే సమయానికి సత్యభామ అక్కడికి వచ్చి, యుద్ధానికి తానూ వస్తానంది. సత్యభామ తాను కూడా యుద్ధభూమికి వస్తాననే సరికి కృష్ణపరమాత్మ అన్నారు–

"సత్యా! నీవు ఆడపిల్లవి. నీవెక్కడ, యుద్ధం ఎక్కడ! నేను రాక్షసులను పరిమార్చి, తిరిగి తొందరగా వచ్చేస్తాను. నీవు బెంగపెట్టుకో వద్దు. అందుకని నీవు నాతో రావద్దు" అన్నారు.

అపుడు సత్యభామ సీతమ్మతల్లిలా గంభీరంగా మాట్లాడలేదు. ఆమె గబగబా కృష్ణ పరమాత్మదగ్గరకు వచ్చి, ఆయన చేయిపట్టుకుని అలవోకగా తన చుబుకాన్ని ఆయన భుజానికి ఆన్చి, ఆయన చెవిలోకి మాత్రమే వినపడేటట్లుగా ఎంతో ప్రియంగా ఒక చక్కటిమాట చెప్పింది.

"ఆ యుద్ధభూమిలో ఉన్నవారు రాక్షసులే అయినా, అక్కడ దైత్యసమూహాలే ఉన్నా, నాకేమీ భయంలేదు. నీ భుజాలనబడే దుర్గాల చాటున నేను ఉంటాను. నీ భుజాల

వెనక నేను ఉంటే నన్నెవరేమి చేస్తారు? కాబట్టి నేను నీతో వచ్చి, నీ యుద్ధం చూడాలని అనుకుంటున్నాను. నీ మీద నాకు ఎంతో నమ్మకం ఉంది" అని తన రెండుచేతులు ముకుళించి నమస్కరించి, తానూ వస్తానని ప్రార్థన చేసింది. ఇంతప్రియంగా మాట్లాడినభార్యను కాదనలేనంత బలహీనతను భర్తయందు ప్రవేశపెట్టి, కృష్ణుడు తనవంక ప్రియంగా చూసేటట్లుగా కృష్ణుణ్ణి మార్చిందై సత్యభామ నిలబడి ఉంది. ఆమె ఎటువంటి చతురత కలిగిన స్త్రీయో చూడండి! కృష్ణ పరమాత్మ ఆమెను యుద్ధరంగానికి తీసుకు వెళ్లడానికి అంగీకరించాడు.

ఇద్దరూ గరుత్మంతుణ్ణి అధిరోహించారు. బయలు దేరి యుద్ధభూమికి వెళ్లారు.

ప్రాగ్జ్యోతిషపురానికి చేరుకున్నారు. అక్కడ నరకాసురుడు పరిపాలన చేస్తున్నాడు. ఆ నరకాసురుడికి నమ్మిన బంట్లు ముగ్గురు ఉన్నారు. ఒకడు **మురాసురుడు.** రెండవ వాడు **నిశుంభుడు.** మూడవవాడు **హయగ్రీవుడు.** ఇక్కడ హయగ్రీవుడు అంటే లక్ష్మీహయగ్రీవులఅవతారంలోని హయగ్రీవుడు కాదు. ఇక్కడ చెప్పబడిన హయగ్రీవుడు ఒక రాక్షసుడు. అక్కడ దుర్గాలు చాలా ఉన్నాయి. జలదుర్గం, గిరిదుర్గం ఇలా ఆరురకాలైన దుర్గాల్ని శాస్త్రం చెపుతుంది. అటువంటి అనేకదుర్గాల్ని నరకుడు నిర్మాణంచేశాడు. పరమాత్మ ఆ దుర్గాల్ని చూచాడు. ఒక్కసారి తన ఆయుధాలతో ఆ దుర్గాలనన్నిటిని నేల కూల్చేశాడు. పాంచజన్యం చేతిలో పట్టుకొని, పూరించాడు. అక్కడ ఉన్న జలదుర్గంలో పడుకుని నిద్రపోతున్న మురాసురుడు పైకి లేచాడు. వాడు ఒక పెద్దజడ వేసుకున్నాడు. వాడు ప్రాగ్జ్యోతిషపురాన్ని మురపాశాలతో కట్టి ఉంచుతాడు. కృష్ణపరమాత్మ తనచేతిఖడ్గంతో ఆ పాశాల్ని ఖండించాడు. మురాసురుడు తన అయిదు తలలతో పైకి వచ్చాడు. వానిజడ సాగిన అగ్నిహోత్రంలా ఉంది. అటువంటిజడతో వాడు నీటిలోనుండి పైకిలేచి కృష్ణునివంక చూచి, పరమాత్మతో యుద్ధానికి వచ్చాడు. పరమాత్మ తన గదాప్రహారంతో మురాసురునిశిరస్సు బ్రద్దలు చేశాడు. వాడు మరణించాడు.

మురాసురుడు మరణించగానే వానికుమారులు ఏడుగురు కృష్ణపరమాత్మమీదికి యుద్ధానికి రాగా, ఆ ఏడుగురినికూడ కృష్ణుడు నిర్జించాడు. ఈ వార్త నరకాసురుడికి చేరింది. అపుడు నరకాసురుడు బయలుదేరి, యుద్ధానికి వచ్చాడు.

ఇక్కడ నరకాసురుడు ఎవరికొడుకో, వానికి అంత బలం ఎక్కడనుండి వచ్చిందో మనం తెలుసుకోవాలి. తనతల్లి ఎవరో నరకాసురునికి తెలియదు. యథార్థానికి అతడు ఆదివరాహమూర్తికి, భూదేవికి జన్మించినవాడు.

## చిన్నశేషవాహనం



**సృష్టి, లయించిన తర్వాతకూడా శేషించేవాడు పరమాత్మ, ప్రకృతి శేషం పరమాత్మ శేషి. పరమాత్మకు పాన్పుగా నిరంతరం తనసేవలందించినశేషుడు భక్తి భావవిశేషుడు. వహించేది వాహనం కాబట్టి శయన తల్పుడైన శేషునివాహనం అన్నా ఫరవాలేదు.**

**శ్రీనివాసుడే తన ఎదలో నిలుపుకున్నఅమ్మ వారిని తమమదిలో నిలుపుకున్నవారిలోని విష భావాలు రసభావాలైపోతాయి. భగవంతుడు రస స్వరూపుడు కాబట్టే వేదం 'రసో వై సః' అని స్తుతించింది. కుండలినీ శక్తికి ప్రతీక, తనకు, తన పతికి శయన తల్పం అయిన ఆదిశేషునిమీద అమ్మవారు ఊరేగుతున్నారు. పతులవాహనాలలో సతులు సంచరించడం లోకసహజమే కదా!**

## పెద్దశేషవాహనం




నరకాసురుడు సామాన్యరాక్షసుడు కాదు. అతడు పధ్నాలుగులోకాల్నీ గెల్చినవాడు. అతనివెనకాల పెద్ద సైన్యం ఉంది. సైన్యాన్ని చూచి, సత్యభామ ఏమీ కంగారు పడలేదు. పైగా తానే స్వయంగా యుద్ధం చేస్తానని కృష్ణుడితో చెప్పి, గభాలున లేచి ముందుకు వచ్చి "నాథా, ధనుస్సును ఇలా ఇవ్వండి" అని అడిగింది. కృష్ణుడు తెల్లబోయాడు. ఆయన ఏమీ తెలియనివాడిలా ఒకనవ్వు నవ్వాడు. ఆయనకు తెలియనివి ఏమి ఉంటాయి?

రాక్షసుల తలలు ఖండించడానికి అనువైన సమస్త శక్తులను క్రోడీకరించుకున్న ఏ శార్ఙ్గమనే ధనుస్సును స్వామి పట్టుకుంటారో– ఆ ధనుస్సును స్వామి సత్యభామ చేతికి ఇచ్చారు. ఆ ధనుస్సును ఎడమచేతితో పట్టుకుని, వంచి వింటినారిని విప్పి, వంగి కుడిచేతితో కట్టింది. ఈ దృశ్యాన్ని చూచి, శ్రీకృష్ణపరమాత్మతో పాటు రాక్షసులు కూడా తెల్లబోయారు.

అది పరమాత్మ కరపీడనానికి అలవాటుపడిన ధనుస్సు. ఆ ధనుస్సును పట్టుకోగానే ఆవిడలో ఒక గొప్ప తేజస్సు కనపడింది. వెంటనే యుద్ధాన్ని ప్రారంభించి, ఒక్కొక్క బాణంతీసి అభిమంత్రించి విడిచిపెడుతోంది. ఆగ్నేయాస్త్రం, వారుణాస్త్రం మున్నగువాటిని అభిమంత్రించి, ఆ అల్లెత్రాటికి తగిలించి ఆకర్ణాంతంలాగి, ధైర్యంగా ధనుస్సును నిలబెట్టి గురిచూసి మొక్కవోని ధైర్యంతో బాణప్రయోగం చేయడం ప్రారంభించింది.

అప్పటికే చాలామంది రాక్షసులు ఖండితులయ్యారు. నరకాసురుడుమాత్రం ఇంకా తన ప్రాణాలతో నిలబడి ఉన్నాడు. అపుడు నరకాసురుడు "చేతకానివాడివై భార్య యుద్ధం చేస్తుంటే నీవు పక్కన కూర్చున్నావు. స్త్రీమీద యుద్ధమేమిటని మా రాక్షసవీరులు ఆమెమీద అస్త్రశస్త్రాలను ప్రయోగించ లేదు. పౌరుషం ఉన్నవాడివైతే ఇప్పుడు యుద్ధానికి రా!" అన్నాడు. ఆరిపోయేదీపానికి వెలుతురు ఎక్కువ చచ్చిపోయేవానికి అరపులు ఎక్కువ. ఈ మాటలు విన్న కృష్ణపరమాత్మ "నిన్ను నిర్జించడానికే కదా నేను వచ్చాను" అని తనచేతిలో ఉన్న సుదర్శనచక్రాన్ని ప్రయోగించారు. ప్రయోగించగానే సుదర్శనచక్రధారలచేత త్రుంపబడ్డ నరకాసురునిశిరస్సు తుళ్లి నేలమీదపడింది.

నరకాసురునివధ జరిగినవెంటనే సంతోషంతో దేవతలందరూ వారివారిలోకాల్లో దీపాలు వెలిగించారు. వాడు అమావాస్యనాడు చచ్చిపోయాడు. అందుకనే మనం 'దీపావళీఅమావాస్య' అంటాం. దీనివెనకాల ఉండే రహస్యాన్ని మనం జాగ్రత్తగా అర్థంచేసుకునేందుకు ప్రయత్నంచెయ్యాలి. **నిజానికి నరకాసురుడు అనేవాడు మనలోనే ఉంటాడు. నరకాసురుడు ఆదివరాహమూర్తికీ, భూదేవికీ జన్మించాడు. అనగా ప్రకృతిపురుషుల సంయోగ ఫలితమే నరకాసురుడు.** 'గర్భంలో ఉండగా వానికి పూర్వ జన్మస్మృతి ఉన్నది, జ్ఞానం ఉంది. ప్రసూతివాయువు తోసెయ్యగానే వాణ్ణి అజ్ఞానం పట్టుకుంటోంది. మొట్టమొదట నరకాసురుడు ప్రాగ్జ్యోతిషపురంలో ఉన్నాడు. భూదేవి అతని తల్లి. నరకాసురుడు తనకు అమ్మ ఎవరో తెలియడం లేదట అన్నాడు. అతడు ప్రాగ్జ్యోతిషపురాన్ని విడిచిపెట్టి మాహిష్మతీపురంలో ఎక్కువగాకాలం గడుపుతూ ఉండేవాడు.



ప్రాక్–జ్యోతి అనగా మొదటినుండి (పూర్వంనుండి) ఉన్న జ్యోతి అనగా ఇక్కడే ఉన్న ఆత్మవస్తువు. ఈ ఆత్మవస్తువును తెలుసుకోవడానికే మనం ఈ శరీరంలోనికి వచ్చాం. ఇందులో ఉండి ఈశ్వరునిఅనుగ్రహాన్ని పొందడానికి, ఈశ్వరదర్శనం పొందడానికి ఇందులోకి వచ్చాం. ఇందులోకి రాగానే వాడు ప్రాగ్జ్యోతిషపురానికి దూరంగా ఉండడం మొదలుపెట్టాడు. మాహిష్మతీపురానికి వెళ్లాడు. మాహిషి అనగా మహిషప్రవృత్తి– దున్నపోతులక్షణం. వాడు మురా సురుడు, నిశుంభుడు, హయగ్రీవుడు అనబడే ముగ్గురు స్నేహితులను పట్టుకున్నాడు. సత్త్వ రజస్ తమో గుణాలనే మూడుగుణాలతో స్నేహం ఏర్పాటు చేసుకున్నాడు. ఎప్పుడూ ఈ మూడుగుణాలలో తిరుగుతున్నాడు. ప్రాగ్జ్యోతిషపురం నుండి మాహిష్మతీపురానికి వచ్చేశాడు.

ఇప్పుడు చతుర్ముఖబ్రహ్మనుగురించి తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై "నీకు ఏం కావాలి?" అని అడిగారు. తనకు మరణం ఉండకూడదని అన్నాడు. "ఈమాట చాలామంది అడిగారు. అది ఇవ్వడం కుదరదు. మరొకవరం కోరుకొన మని" చెప్పారు. అతడు ఏమి అడుగుదామా అని ఆలోచిస్తున్నాడు. అపుడు బ్రహ్మ – "అమ్మచేతిలో చచ్చిపోయేలా నీకు వరం ఇస్తాను. పుచ్చు కుంటావా" అని అడిగారు. అంటే వాడు అనుకున్నాడు – "అమ్మకి పెంచడం తెలుసు తప్ప, చంపడం తెలియదుకదా! కాబట్టి నాకు చావు ఉండదు" అని భావించాడు. ఆ మేరకు బ్రహ్మ వద్దనుండి వరాన్ని పొందాడు. తాను అమ్మచేతిలో చనిపోతాడుకాబట్టి "తనతల్లి యెవరు?" అని వెతకడం మొదలుపెట్టాడు. తెలుసు కోలేకపోయాడు. మాహిష్మతీపురం (అజ్ఞానం)లో ఉన్నాడు. ప్రాగ్జ్యోతిషపురంలో ఉంటే భూమియే తనతల్లి అని తెలిసి ఉండేది. వాడు తెలుసుకోలేకపోయాడు. తెలుసుకోలేక అదితికుండలాలు అపహరించాడు. దితి అనగా ఖండం. అదితి అనగా ఖండం కానిది. అనగా ముక్క కానిది. ముక్క కానిది ఏది? ఆకాశం. ఆకాశాన్ని ముక్కలు చేయలేం. ఆకాశం ఎప్పుడూ ఏకత్వంతోనే ఉంటుంది. ఆకాశానికి రెండుకుండలాలు ప్రకాశిస్తూ ఉన్నాయి. అవే సూర్యచంద్రులు. సూర్యచంద్రులిద్దరూ కదులుతుంటారు. సూర్యచంద్రులు కదిలితే మనఆయుర్దాయం తగ్గిపోతుంది. సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయం, చంద్రా స్తమయం గడిచేకొద్దీ ఆయుర్దాయం తరిగిపోతూ ఉంటుంది.

రాజులను చంపి, ఆ రాజులపిల్లలను తీసుకు వచ్చేవాడు నరకాసురుడు. తాను బంధించి తెచ్చిన ఏ స్త్రీనీ అనుభవించలేదు. అలా పదహారువేలమందికన్యలను తీసుకువచ్చి, వాళ్లను కారాగారంలో పెట్టాడు. నరకాసురవధ అయిపోయిన తరువాత కృష్ణపరమాత్మ నరకాసురుని అంతః పురంలోనికి వెళ్లాడు. ఆ పదహారువేలమందీ కృష్ణపరమాత్మను చూచి, ఈయనను మనం భర్తగా పొందితే బాగుండును అనుకున్నారు. నాలుగుదంతాలఏనుగుల మీద, రెండు దంతాల ఏనుగులమీద వీళ్లందరిని ద్వారకానగరం



## హంసవాహనం


హంస స్వచ్ఛమైన స్వరూపానికి, స్వచ్ఛమైన స్వభావానికి ప్రతిబింబం. ధర్మాధర్మాలు పాలూ, నీళ్ళు లాగా కలగలసి పోయిన ఈ ప్రకృతిలో పాలనూ, నీటినీ వేరుపరచినట్లుగా ధర్మాన్ని, అధర్మాన్ని వేరుపరచి చూపగల హంసతత్త్వం ఉన్నవారు పరమహంసలు. వీణాపుస్తకపాణి అయిన సరస్వతీహృదయప్రదేశం సంగీతసాహిత్యాలకు జన్మభూమి కదా! పరిశుద్ధాత్ము లనే దరి చేర్చుకుంటానుసుమా! అన్నట్లు అమ్మవారు హంసమీద తరలిపోతున్నారు. మనం అమ్మప్రేమకు పాత్రులం కావాలనుకుంటే మనమనస్సులు పాలులా పరిశుద్ధం కావాలి!

పంపించివేసి, ఇంద్రుడిదగ్గరకు వెళ్లివచ్చిన తరువాత, ఈ పదహారువేలమందికీ పదహారువేలఅంతఃపురాలు కట్టించి, పదహారువేలమందిని ఏకముహూర్తంలో ఒకే కృష్ణుడుగా కనపడుతూ పదహారువేలరూపాలతో వివాహం చేసుకున్నాడు. అనగా అనంతంగా కనపడే ఈ విభూతులన్నీ ఈశ్వరునికి చెందినవే అని చెప్పడం! నరకుడు చతుర్థశీ కన్యను వివాహం చేసుకున్నాడు. బ్రహ్మవరంప్రకారం నరకాసురుడు తనతల్లిచేతిలోనే చచ్చిపోవాలి. నరకాసురుని తల్లి భూదేవి. ఆ భూదేవియే నరకాసురుని చంపివేయాలి. ఇప్పుడు ఆ భూదేవిఅంశగానే సత్యభామ వచ్చింది.

సత్యభామ పేరు వెనుక ఒక రహస్యం ఉంది. 'సత్య' అనగా మారనిది అని అర్థం. ఈ ప్రపంచంలో మారనిది ఏది? పరమేశ్వరుడు ఒక్కడుమాత్రమే మారడు. బ్రహ్మం ఒక్కటే మారనిది. మిగిలినవి అన్నీ మారిపోతూ ఉంటాయి. **ఈ ప్రపంచంలో ఉన్నవి అన్నీ మారతాయి. ఈశ్వరుడు ఒక్కడే మారడు. ఈశ్వరుణ్ణి ఆధారం చేసుకుని ఈ జగత్తు మారుతూ ఉంటుంది. మారనివాడు సత్యం అయితే-ఆ సత్యం 'భా'-అనగా కాంతి'మ' అనగా సంపద-సత్యం కాంతివల్ల వచ్చేసంపద. ఇది మనకు భూమిలో కనపడుతుంది.**

ఇప్పుడు గరుత్మంతుని మీద కృష్ణుని ప్రక్కన సత్యభామగా కనపడుతున్నది ఎవరు? ఈశ్వరుని సొత్తయిన భూసంపద. ఇప్పుడు నరకాసురుడు ఎవరిచేతిలో చచ్చిపోతున్నాడు? భూదేవిచేతిలోనే చచ్చిపోతున్నాడు. **ఇపుడు సత్యభామ అనగా ఎవరు? సాక్షాత్తు ఈశ్వరునిపత్ని అయిన భూమి- సంపద. సంపద రాశీభూతమై ఆయనప్రక్కన నిలబడింది. లక్ష్మీఅంశ అయితే రుక్మిణి, భూఅంశ అయితే సత్యభామ. అందుకని ఆమెకు మరొకపేరు ఉండదు. సత్యభామగానే ఉంటుంది.** అందుకని సత్యభామగా వచ్చి, బాణప్రయోగం చేసింది. **నరకాసురుడు అమావాస్యనాడు చచ్చిపోయాడు.**

**దేవతలు దివ్వెలు వెలిగించారు. భగదత్తుడు మరల ప్రాగ్జ్యోతిషపురానికి పట్టాభిషిక్తుడయ్యాడు. కాబట్టి ఇది దివ్యమైన లీల.** సత్యభామచేతిలోనే నరకాసురుడు మరణించాలి. శరీరం ఎప్పటికైనా భూమిలోనికే వెళ్లాలి. ఎవరి శరీరమైనా సరే, ఎంత గొప్పశరీరమైనా సరే తప్పనిసరిగా చివరన భూమిలోకే వెళ్లిపోవాలి. కాబట్టి తల్లిచేతిలో మరణం అంటే శాస్త్రరహస్యాన్ని తెలుసుకొనుట. శరీరస్థితిని తెలుసుకొనుట. ఆత్మతత్త్వాన్ని తెలుసుకొనుట. దీనిలోంచి వెలుగులు వచ్చాయి. అది దీపావళి. అందుకని దీపాలు వెలిగించారు అని **నరకాసురవధవెనుక మనజన్మవృత్తాంతాన్ని, మన ప్రస్థానాన్ని పెట్టి ప్రాగ్జ్యోతిషపురమని చెప్పి, దీపావళిపండగ అని పేరు పెట్టారు. ఇది ఎప్పటికీ చేయవలసిందే!**



## ముత్యాలపందిరివాహనం

**జగన్మాతకు అన్నిఆభరణాలకన్నా మౌక్తికాభరణాలమీద ప్రీతి మెండు. ఎందుకంటే సాగరంలోని చిప్పలబంధనంనుంచి విముక్తి చెందడంవల్లనే అది ముత్యమయింది కాబట్టి! భూరికుటుంబిని అయిన ఆమె, తనసంతానంకూడా, మాయామోహబద్ధమైన ఈ సంసారసాగరంనుండి, ఆత్మజ్ఞానంతో విముక్తులై, మోక్షసిద్ధిని అందుకోవా లని ఆకాంక్షిస్తుంది. మనిషికి అన్నింటిమీద ఏర్పడే, కేవలస్వభావమే కైవల్యం. అన్ని మోహాలనుండి విడివడడమే మోక్షం. ముక్తికి ముక్తం (ముత్యం)ప్రతీక! అమ్మవారు భవబంధాలనుండి విముక్తులైన ఆత్మలనన్నింటినీ స్వచ్ఛమైనముత్యాలుగా మార్చుకుని, తనచుట్టూ పందిరి కట్టుకుని పరవశిస్తున్నదా! అనిపిస్తుంది.**



# మాతృత్వ సిద్ధికి...

- శ్రీ కె.జానకిరామావధాని,
90320 44114

స్కందుడు రాశీభూతమైన జ్ఞానస్వరూపుడు. ఆయన చేతిలోని 'శక్తి' ఆయుధం సునిశితమైన మేధకు ప్రతీక. ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులనే మూడుశక్తుల సంయోగ స్వరూపంగా నిలిచి, అజ్ఞానం అనే తారకాసురుడిని సంహరించి, జ్ఞానజ్యోతులను ప్రకాశింపజేసిన విజ్ఞానమూర్తి ఆయన. గొప్పజ్ఞానంతో పాటు అపారమైన భుజశక్తికి కూడా స్కందుడు ప్రతీక. రాక్షససంహార విషయంలో దేవతలకే సేనానాయకుడిగా నిలిచి, వారిని ఆదుకున్న ధీశాలి సుబ్రహ్మణ్యుడు.

స్కందుడన్నపేరు సుబ్రహ్మణ్యస్వామికి ప్రసిద్ధమైంది. స్కన్నమైన (జారిన) వాడు స్కందుడు. శివుని ఆత్మజ్యోతినుండి ఆవిర్భవించిన ఆరుజ్యోతులస్వరూపమే సుబ్రహ్మణ్యుడు. ఆయనే శరవణభవుడు, కార్తికేయుడు. కుమారస్వామి.... ఇలా సుబ్రహ్మణ్యస్వామికి ఎన్నో పేర్లు వ్యాప్తిలో ఉన్నాయి. శివపార్వతులతనయుడిగా స్కందుడు ఆవిర్భవించినతిథి 'షష్ఠి'. శక్తికారకుడిగా పేరున్న ఆ స్వామి తారకాసురసంహారసందర్భంలో దేవతలకు సేనాధిపత్యం వహించి, రాక్షససంహారం చేసినరోజు మార్గశిర శుద్ధషష్ఠి. ఈ కారణాలవల్ల మార్గశిరశుద్ధషష్ఠి 'స్కందషష్ఠి'గా వ్యాప్తిలోకి వచ్చింది.

## సుబ్రహ్మణ్య వైభవం

సుబ్రహ్మణ్యుడు రూపంలో అందగాడు. శౌర్యంలో సాటిలేనివాడు. అందుకే దేవసేనాధిపతి అయ్యాడు. ఈయన వాహనం నెమలి. ఆయుధం శూలం. దీనిని విజయశూలమనీ, జ్ఞానశూలమనీ అంటారు. సుబ్రహ్మణ్యుడికి షణ్ముఖుడు అన్న పేరుంది. అంటే ఆరుముఖాలు కలవాడని అర్థం. ఈ ఆరుముఖాలు జ్ఞానం, వైరాగ్యం, శక్తి, యశస్సు, ఐశ్వర్యం, దైవత్వానికి ప్రతిరూపాలు.

కార్తికేయుడు మేధామూర్తి. వేదాలు ఇతణ్ణి యజ్ఞాగ్నిగా అభివర్ణించాయి. ఉపనిషత్తులు సనత్కుమారుడిగా కీర్తించాయి. శివుడిప్రణవనాదమైన 'ఓం'కార అర్థాన్ని వివరించి చెప్పినఘనతకూడా సుబ్రహ్మణ్యుడికే దక్కుతుంది. ఈ విధంగా ఆదిదేవుడికే గురుదేవుడు అయ్యాడు కుమారస్వామి. శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'సేనాధిపతులలో స్కందుడిని నేను' అని ప్రకటించటం స్కందుడి ప్రాశస్త్యాన్ని తెలియజేస్తుంది.

వేదాలలో షణ్ముఖీయమైనసంవత్సరస్వరూపంగా స్వామిని వర్ణించారు. కాలాగ్నిస్వరూపమే ఇది. కాలాగ్ని రుద్రుడైన శివునితేజమే ఈ సంవత్సరాగ్ని. ఆరుముఖాలను ఆరుఋతువులకు ప్రతీకగా, పన్నెండు చేతులను పన్నెండు మాసాలకు ప్రతీకలుగా చెప్పుకోవచ్చు. ఇదీ సంవత్సరాగ్ని రూపం. ఈ రూపం చిత్రాగ్ని అనే నెమలిపై ఆసీనమయ్యింది. వివిధవర్ణాలను వెదజల్లే కాంతిపుంజమే ఈ నెమలి. ఈ విధంగా అద్భుతమైన ఆధ్యాత్మికశక్తులకు సుబ్రహ్మణ్యఉపాసన కేంద్రంగా ఉంటుంది. సుబ్రహ్మణ్య ఉపాసనద్వారా మోక్షాన్ని అందుకున్న మహనీయులు ఎందరో ఉన్నారు.

## యోగస్వరూపుడు

మానవదేహంలో మూలాధారస్థానంలో కుండలినీ శక్తి మూడున్నరచుట్లు చుట్టుకుని నిద్రిస్తున్నపాములా ఉంటుంది. సాధకుడిలో ఆశక్తి జాగృతమై సహస్రారం వరకు ప్రయాణిస్తుందని యోగశాస్త్రం చెబుతోంది. సాధనలో మూలాధారంనుంచి ఆజ్ఞాచక్రంవరకు ఆరుస్థానాలు క్రమంగా వికాసం పొందితే ఆ పైన ఉన్న సహస్రారంలో పరమచైతన్యం అనుభవానికి వస్తుంది. పరమాత్మ సుబ్రహ్మణ్య రూపంలో అవతరించేక్రమంలో ఆరుముఖాలతో దర్శన మిస్తాడు. ఇవి ఆరుచక్రాలకు సంకేతం. కుండలినీశక్తి సర్పా కారంలో ఉంటుందని యోగశాస్త్రం చెబుతోంది. ఈ యోగా నికి అధిపతి కుమారస్వామి. ఈ విషయాన్ని సంకేత రూపంలో చెప్పటమే సుబ్రహ్మణ్యుడు సర్పరూపంలో ఉంటా డని వర్ణించటానికి కారణం.

షణ్ముఖుడు జ్యేష్ఠానక్షత్రంలో జన్మించాడు. ఈ నక్షత్రానికి అధిపతి బుధుడు. బుధుడు జ్ఞానమిచ్చేవాడు. జ్ఞానాన్ని సంస్కృతంలో సుబ్రహ్మ అంటారు. అందువల్ల ఈ స్వామి సుబ్రహ్మణ్యేశ్వరుడని ప్రసిద్ధి చెందాడు. ఈయన జన్మరాశి వృశ్చికం నుండి జన్మలగ్నమైన మేషంవరకు ఆరు రాశులు ఉన్నాయి. ఈ ఆరురాశులు మనశరీరంలోని షట్ చక్రాలు. వృశ్చికరాశిని తోకగా పరిగణిస్తే మేషరాశి పాము శిరస్సు అవుతుంది. ఈ పద్ధతిలో స్వామి కుండలినీ ప్రభువు అయ్యాడు. ఇవన్నీ జ్ఞానవైరాగ్యాలకు సంబంధించిన విషయాలు. సర్పం వీటికి సంబంధించింది. అందువల్లనే సర్పాలను సదాశివుడు ధరించి పన్నగభూషణుడని ప్రసిద్ధి చెందాడు. ఈ పన్నగాలు సుషుమ్నా నాడీరూపంలో ఉన్న షణ్ముఖుని విభూతిరూపాలు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యే శ్వరుణ్ణి సర్పరూపంలో పూజిస్తారు.

## ఆరక్షరాల దైవం

షణ్మతాలలో కుమారోపాసన ఒకటి. కంఠంలో రత్నాలు, మేనిలో చక్కదనం, చేతిలో జ్ఞానశక్తి ఆయుధం, ముఖాన చిరునవ్వు, కటియందు (నడుముభాగం) హస్తాన్ని ఉంచి, నెమలిపై ప్రకాశిస్తుండే స్వామి సుబ్రహ్మణ్యుడు. పరిపూర్ణమైన జ్ఞానస్వరూపుడు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా అనే మూడు శక్తులమయమైన శక్తిని ధరించిన కుమారస్వామి, శరణన్నవారిని కాపాడే దేవుడు. అమోఘమైన శివతేజం పృథ్వి, అగ్ని, జలం, షట్ కృత్తికల శక్తిని(నక్షత్రశక్తి) ధరించి, చివరకు బ్రహ్మతపోనిర్మితమైన అలౌకిక మహాగ్ని శరవణంలో (అగ్నితో కూడిన రెల్లుతుప్ప) బాలుడిగా రూపుదిద్దుకుంది. అందుకే స్వామి శరవణభవుడు.

శరవణభవ అనే పదంలో ఒక్కో అక్షరానికి ఒక్కో ప్రత్యేకమైన అర్థం ఉంది. శ-శమింపజేయువాడు, ర-రతి పుష్టిని ఇచ్చువాడు, వ-వంధ్యత్వం రూపుమాపువాడు, ణ-రణమున జయాన్నిచ్చేవాడు, భ- భవసాగరాన్ని దాటించే వాడు, వ- వందనీయుడు అని ఈ పదాలకు అర్థం.

బీజాక్షర పరంగా చూస్తే, శ-లక్ష్మీబీజం. దీనికి అధిదేవత శంకరుడు. ర-అగ్నిబీజం. దీనికి అధిదేవత అగ్ని. వ-అమృతబీజం. దీనికి అధిదేవత బలభద్రుడు. ణ-యక్ష బీజం. దీనికి అధిదేవత బలభద్రుడు. భ- అరుణబీజం. దీనికి అధిదేవత భద్రకాళీదేవి. వ- అమృతబీజం. దీనికి అధిదేవత చంద్రుడు.



# ఆనందాలకు ఆహ్వానాలు

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ఒక్కొక్కమాసానికి ఒక్కొక్క ప్రత్యేకత. కాలమంతా పరమేశ్వరస్వరూపమే అయినా, ఒక్కొక్క కాల భాగంలో ఒక్కొక్క దివ్యత్వం గోచరిస్తుంది. జ్యోతిర్గణాలప్రభావం ఆ యా కాలపరిమాణాలపై ఉంటుంది. అందుకే మన సంప్రదాయంలో ప్రతిఋతువుకీ ప్రాధాన్యం, ప్రతిమాసానికీ వైశిష్ట్యం.

పురాణవాఙ్మయంలో పన్నెండు మాసాలకు ప్రత్యేక మహిమలు చెప్పే చిరుపురాణాలున్నాయి.

కార్తికపురాణం, మాఘపురాణం– వంటివి. వేదాలలో యజ్ఞాద్యనుష్ఠానాలుకూడా వివిధఋతువుల్లో వివిధవిధానాలను ఏర్పరచాయి. వాటిని సామాన్యజనులకుకూడా ఆచరణ యోగ్యంగా మలచడానికి పురాణాలు పూనుకున్నాయి. కార్తికం, మాఘం, శ్రావణంవంటి మాసాలలో ప్రత్యేకధార్మికకార్యాలు విధించాయి.

**కార్తికమాసం అనగానే తెల్లవారుజామున స్నానాలు, ఉభయసంధ్యల్లో శివకేశవాదిఆలయాలలో దీపారాధనలు, నదులలో, తటాకాలలో దీపాలను విడిచిపెట్టడం. చక్కనిసందడి! ఇందులో దివ్యత్వంతో పాటు ఒక ఉత్సాహం, ఉల్లాసం వెల్లివిరుస్తాయి.** చిరుచలిలో బద్ధకాన్ని వదల్చుకొని, చేసే స్నానం, చిరుదీపాలు నీటిఅలల్లో తేలియాడుతుంటే ఉండే సౌందర్యం.... ప్రకృతిలో దివ్యత్వాన్ని ప్రతిష్ఠించి ప్రదర్శించే హైందవమతంలోని దివ్యకళాచాతురిని కొనియాడ వలసిందే!

కార్తికంలో దేశమంతా ప్రత్యేకంగా ఆధ్యాత్మిక చైతన్యంతో విలసిల్లుతుంది. ఎవరికి తగ్గ నియమాన్ని వారు పాటిస్తూ దైవాన్ని కొలుచుకుంటారు. కార్తికం దీపానికీ, మాఘం స్నానానికీ, వైశాఖం దానానికీ ప్రాధాన్యం.

కార్తికంలో వచ్చే చవితి, ఏకాదశి, ద్వాదశి, పూర్ణిమ, సోమవారాలు ప్రత్యేకపర్వాలు. కొందరు మాసమంతా నక్తవ్రతం చేస్తారు. శివ, కేశవ, దేవీభక్తులకు ఇది ప్రత్యేకసాధనా మాసం.

ఈ మాసంలో విష్ణువును దామోదరనామంతో పూజిస్తారు. మార్గశీర్షంలో కేశవనామంతో మొదలుకొని, వరుసగా పన్నెండునామాలతో ప్రతిమాసపు శుద్ధఏకాదశినాడు విష్ణువును ఆరాధించడం సంప్రదాయం. ఆ వరుసలో కార్తికశుద్ధఏకాదశి దామోదరునిది. అందుకే ఈ మాసానికే దామోదరమాసం అని పేరు.

కార్తికంలో బృందావనవ్రతం విశిష్టమైంది. ఈ మాసంలో బృందావనానికి ప్రతీకగా తులసిని పూజించడం కార్తికంలో ప్రతిప్రాంతంలో జరుగుతుంది. తులసి, ధాత్రి (ఉసిరిక) సమేతంగా విష్ణువును పూజించడం ఈ మాసంలో ఆచారం. వృక్షాలలోని దివ్యత్వాన్ని దర్శించేసంస్కృతిలోని ఘనతకు నిదర్శనం.

మరొక ప్రత్యేకత వనభోజనం. ఇది సామాజికసమైక్యతకు ఒక సంకేతం, నిజానికి దీనికికూడా ఒక సంప్రదాయపద్ధతి ఉంది. పవిత్రవృక్షాలున్న వనానికి చేరి తులసి, మారేడు, ఉసిరికవంటి వృక్షాల సన్నిధిలో దేవతారాధన చేసి, వండి నివేదించిన ఆహారపదార్థాలను భుజించడం ఆనవాయితీ.

ఇక కార్తికశుద్ధఏకాదశికి విశిష్టత ఉంది. దీనికి **'ఉత్థానఏకాదశి'** అని పేరు. ఈ రోజున ఏకాదశీవ్రతాన్ని చేసినవారికి విశిష్టఫలం చేకూరుతుందని శాస్త్రం. మార్గశీర్షంతో మొదలుపెట్టిన ఏకాదశీవ్రతానికి, ఈ కార్తికంతో సంవత్సరకాలం పూర్తవుతుంది.

అందుకే దీనికి ప్రాధాన్యం. దీనితర్వాత వచ్చే ద్వాదశికి ప్రాముఖ్యం ఉంది. దీనిని **'క్షీరాబ్ధి ద్వాదశి'** అంటారు.

భాగవతంలో అంబరీషునిచరిత్ర ఉంది. అంబరీషుడు ఈ ఏకాదశీవ్రతాన్ని ఆచరించినవైనం చక్కగా వివరించారు. పైగా బృందావనంలోనే దీనిని ఆచరించినట్లుగా వర్ణించారు. అయితే అప్పటికి కృష్ణావతారం జరగకపోయినా, అనాదిగా అది విష్ణుధామమే! ధ్రువుడుకూడా తొలిమన్వంతరంలోని కృతయుగంలో పవిత్రబృందావనంలోనే తపస్సు చేసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ఈ అనాదివిష్ణుక్షేత్రంలోనే శ్రీకృష్ణుడు అవతరించి, తన నారాయణత్వాన్ని లీలలుగా ప్రకటించాడు.

**కార్తికపూర్ణిమ మరొకఅద్భుతం.**

**శరత్పూర్ణిమ ఆధ్యాత్మిక, యోగసాధనలకు విశేషమైంది. ధ్యానం, అర్చన మొదలైనవి ఈ రోజున అద్భుతఫలాలనిస్తాయి. ఈ పూర్ణిమనాడు విశేషంగా దీపాలు వెలిగించడం ప్రత్యేకత. దీనిని 'దేవదీపావళి' అంటారు.**

ఆశ్వయుజపూర్ణిమ, కార్తికపూర్ణిమ– ఈ రెండూ శరత్పూర్ణిమలు. ఈ పూర్ణిమనాడే రాసలీలా మహోత్సవం జరిగింది.

యోగశుద్ధులైనజీవులు గోపికలు. వారిని పరమాత్ముడు అనుగ్రహించిన మోక్షప్రదానలీల రాసలీల. ఈ పూర్ణిమనాడు దేవీఆరాధనకూడా

## కార్తికమాసంలో చేయాల్సిన దానాలన్నీ కలిసినా దీపదానం మహిమకు సమానం కావు

ముఖ్యమైంది. సహస్రారచంద్రకళాస్వరూపిణి అయిన శ్రీలలితామహాత్రిపురసుందరిని ఈ పండుగనాడు ఆరాధించాలి.

కృత్తికానక్షత్రంనాడు పూర్ణిమ ఏర్పడే మాసం కార్తికం.

కృత్తిక అగ్నినక్షత్రం. అగ్నియందు ఈశ్వర స్వరూపాన్ని ఆవిష్కరించి, ఆరాధించడమే యజ్ఞం.

అందుకే వేదాలలో 'నక్షత్రేష్టి' అనేది– కృత్తికానక్షత్రంతోనే ప్రారంభ మవుతుంది.

ఆ యజ్ఞతత్త్వానికి సంకేతంగానే దీపారాధన' అనేది కార్తికంలో ప్రధానమయ్యింది. కార్తికంలో దీపార్చన, దీపదానంవంటివి– యజ్ఞ ఫలాలను ప్రసాదిస్తాయి,

కార్తికసోమవారంవంటివి శివప్రాధాన్యాన్ని చెబుతున్నాయి.

'కార్తికం' అనగానే మనకు శివుడే గుర్తు వస్తాడు. శివక్షేత్రాలలో గొప్పవైభవం కనిపిస్తుంది. కాశీవంటి ఉత్తరాదిశైవతీర్థాలుకూడా శివశోభను సంతరించుకుంటాయి.

కృత్తికానక్షత్రజాతుడూ, పవిత్రయజ్ఞాగ్ని స్వరూపుడూ అయిన సుబ్రహ్మణ్యుని ఆరాధనకు కూడా ఈ మాసం ప్రత్యేకం. **'కుమారదర్శనం'** పేరుతో కార్తికపూర్ణిమను వ్యవహరిస్తారు.

జ్యోతిర్లింగస్వరూపుడైన శివునికి ప్రతీకగా ప్రతిదీపమూ ఒక జ్యోతిర్లింగమై భాసిస్తూ, విశ్వవ్యాపకమైనఈశ్వరజ్యోతిని దర్శించి, ఉపాసించుమని ఉపదేశించేమాసమిది.



# నాదేముంది తల్లీ.. అంతానీదే!


– డా॥ కంపల్లె రవిచంద్రన్,
98487 20478


అలమేలుమంగాదేవి శ్రీవేంకటేశ్వరుని పట్ట మహిషి. ఈమె లక్ష్మీదేవీప్రతిరూపం. 'ప్రపత్తి' అంటే 'భక్తి పరులు చేసేశరణాగతి'. శ్రీవేంకటేశసుప్రభాతంలో 'శ్రీవేంక టేశ చరణౌశరణం ప్రపద్యే' అనే శ్లోకాలు మనకు సుపరిచి తాలే! అట్లే 'శ్రీవేంకటేశమహిషీం శ్రియమాశ్రయామః' అనే మకుటంతో శ్లోకాలున్నాయి.

యద్వల్లభః పురుష ఉత్తమ ఈశ్వరాఖ్యః
శయ్యాసనం ఫణిపతి ర్గరుడస్తు వాహః ।
యత్కింకరా విధిశివప్రముఖాస్సురాస్తాం
శ్రీవేంకటేశమహిషీం శ్రియమాశ్రయామః ॥

"ఎవరిభర్త ఈశ్వరుడు అని పిలువబడే పురుషోత్త ముడో, ఎవరికి శయ్య, ఆసనం ఫణీంద్రుడైన ఆదిశేషుడో, ఎవరివాహనం గరుత్మంతుడో, ఎవరికి బ్రహ్మాదిదేవతలు సేవకులో అట్టి శ్రీవేంకటేశ్వరునికి పట్టపురాణి, సాక్షాత్తు లక్ష్మీదేవి అయిన శ్రీపద్మావతీదేవిని శరణుపొందుతున్నాను."

పద్మావతీదేవీభర్త పురుషోత్తముడనడంతో ఆమె స్త్రీలలో ఉత్తమురాలు అనడం స్పష్టం. పద్మావతీదేవి సాక్షాత్తు శ్రీలక్ష్మీదేవియే కనుక– ఆ తల్లిని ప్రపత్తి పొందడానికి భక్తులు అన్నివిధాలా అర్హులు కాగలరు.

శ్రీమహావిష్ణువు శ్రీవేంకటేశ్వరుడు కాగా, లక్ష్మీదేవి పద్మావతీదేవియై అవతరించింది. ఇరువురిప్రయోజనం భక్త లోకరక్షణమే! తమను శరణు పొందినవారిని– వారివారి ఆపదలనుండి రక్షించి, వారికి కావాల్సిన ఐశ్వర్యాదులు అనుగ్రహించడమే!

అమ్మవారు మూర్తీభవించిన దయాగుణం కనుక ఆ తల్లిని ఆశ్రయించడానికి, ఆమెదయకు పాత్రులవడానికి అనుకూలం ఎక్కువ. మాతృహృదయం గనుక బిడ్డల కష్టాలు చూచి, ఆ తల్లి భరించలేదు. "అమ్మా! నీవే దిక్కు" అని శరణు కోరితే– 'నేనున్నాను. నీకేభయమూ వద్దు. ఇక నీ రక్షణబాధ్యత నాది.' అంటూ ధైర్యం చెప్పి, వెంటనే బిడ్డల కష్టాలన్నీ తొలగిస్తుంది. శ్రీమన్నారాయణునిదయాదృష్టే గాక, లక్ష్మీస్వరూపిణి అయిన పద్మావతీదేవియొక్క కృపా కటాక్షాలు, సృష్టి, స్థితి, లయం మొదలగుకార్యాలు నిర్వ హించడానికి కారణాలౌతున్నాయి. భగవంతునికటాక్షం సృష్టిస్థిత్యాదులకు సాక్షాత్తు కారణం కాగా, పద్మావతీదేవీ దృష్టి పరంపరాకారణం అవుతుంది. భగవానుడు సృష్టిని లక్ష్మీదేవికటాక్షానుసారం చేస్తున్నాడని తెలుస్తోంది. లయం కూడా సృష్టివలే అనుగ్రహకార్యమే! భగవద్దంపతులు ఏమి చేసినా లోకకల్యాణకారకాలే అవుతాయి.

లక్ష్మీరూపిణి అయిన పద్మావతీదేవిచేతిపద్మం సంపదలకు చిహ్నం. కేవలం సంపదలే కాదు, కైవల్యం, పరమపదప్రాప్తినీ ఇస్తుంది. ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థీ, జ్ఞాని అనే చతుర్విధ ప్రపన్నులనూ పద్మావతీదేవి అనుగ్రహి స్తుంది. పద్మావతీదేవి మోక్షప్రదానత్వం పురుషకార



దీపం కలిగిన ఇల్లు శ్రీలక్ష్మికి నెలవు

రూపంలో ఉంటుంది. అంటే స్వామివారికి చెప్పి, మోక్షాన్ని అనుగ్రహింపజేస్తుంది. భగవంతునిరూపాలన్నిటినీ ఆశ్రయించి, సదా కలిసే ఉంటుంది కనుక లక్ష్మీస్వరూపిణి అయిన శ్రీవేంకటేశ్వరునిపట్టమహిషి శ్రీపద్మావతీదేవిని ఆశ్రయించడం భక్తులకు సులభమైనవిధానం. ఫలం త్వరగా ప్రాప్తిస్తుంది. "విష్ణోః శ్రీః అనపాయినీ" శ్రీపద్మావతీదేవి శ్రీవేంకటేశ్వరుణ్ణి విడువకుండా సదా ఉంటుంది.

భగవంతునివలే పద్మావతీదేవి అమ్మవారు కూడా సకలకల్యాణగుణాలు కల్గిన తల్లియే! అయినా కొన్ని గుణాల్లో ఆమెకు ప్రత్యేకత ఉంది. అమ్మవారిలో క్షమ, దయాది గుణాలు విశేషంగా ఉంటాయి. ఆశ్రితులు ఎంతటి పాపాత్ములైనా తమతప్పును తెలుసుకుని, పశ్చాత్తాపం చెందితే చాలు ఆశ్రితుల్ని కరుణించి, వారికి ఆశ్రయం ఇచ్చేస్తుంది.

భగవంతుడే పరమవాత్సల్యం గలవాడు. కానీ, మాతృమూర్తి అయిన శ్రీపద్మావతీదేవి అంతకంటే వాత్సల్య గుణం కలది. ఆశ్రితుల్లో దోషాలను కూడా గమనించకుండా కరుణించే అమితమాతృగుణం, దయ కలది. అమ్మ జగన్మాత కనుక లోకంలోని వారందరూ తన బిడ్డలే! కనుక మంచివాళ్లు, చెడ్డవాళ్లు అనేభేదం లేకుండా అందరినీ సమానంగా చూచి, వాళ్లను కరుణించి, తన పురుషకారిణీత్వ పదవితో వాళ్లను స్వామికృపకు పాత్రులయ్యేట్టుగా చేస్తుంది. ఇదీ పద్మావతీఅమ్మవారివాత్సల్యగుణాధిక్యం!

పద్మావతీదేవీరూపదర్శనం బ్రహ్మాదులకూ అలభ్యం. కానీ, సామాన్యులకు మాత్రం పరమసౌలభ్యం. ఆమెను శరణుగోరితే చాలు, ఇక ఆశ్రితులు దేన్ని గురించీ చింతించే అవసరం ఉండదు. క్షమాగుణవిషయంలో సీతను ఉదాహరించడం సర్వసామాన్యం! సీతమ్మ తనను బాధించిన వారందరినీ క్షమించింది. రాముడు విభీషణుణ్ణి, కాకాసురుణ్ణి ఇలా ఒకరిద్దర్నిమాత్రం క్షమించాడు. కానీ, అమ్మవారి క్షమాగుణం ఈలోకంలో తప్పుచేయని వారెవరుంటారు? కనుక, తప్పు చేసినవాళ్లందరూ దుర్మార్గులు, నీచులు కాదు. వాళ్లను సంస్కరించి, వారిపై దయ చూపి, అనుగ్రహించి, వారిని మంచివాళ్లుగా చేయడంలో అమ్మవారు విశిష్టురాలు! కనుక ఆశ్రితులకు 'అమ్మవారిని ఆశ్రయిస్తే తమఆశయం సిద్ధిస్తుంది' అనే విశ్వాసం కల్గుతుంది ఇది చాలా ముఖ్యమైన అంశం, గుణం!

## సింహవాహనం



**కార్తికబ్రహ్మోత్సవాలలో పద్మావతీమాత మూడవ రోజు రాత్రి సింహవాహనంపై దర్శనమిస్తుంది. సింహం పరాక్రమానికీ, శీఘ్రగమనానికీ, వాహనశక్తికీ ప్రతీక. అమ్మవారికి సింహం వాహనంగా సమకూరినవేళ దుష్టశిక్షణ, శిష్టరక్షణ అవలీలగా చేస్తుంది. భగవతి పద్మావతి ఐశ్వర్యం, వీర్యం, యశస్సు, శ్రీ (ప్రభ), జ్ఞానం, వైరాగ్యం అనే ఆరుగుణాలనూ భక్తులకు ప్రసాదిస్తుంది. శ్రీవేంకటేశ్వర హృదయేశ్వరిని స్వామితో మమేకమైన శక్తిగా ధ్యానించడం సంప్రదాయం.**



## కల్పవృక్ష వాహనం

**కల్పవృక్షం పద్మావతీదేవికి బ్రహ్మోత్సవాలలో నాల్గవరోజు ఉదయం వాహనమవుతుంది. పాలకడలిని అమృతానికై మథించినవేళ లక్ష్మీదేవికి తోబుట్టువైంది కల్పవృక్షం. ఆకలిదప్పుల్ని తొలగించి, పూర్వజన్మస్మరణను ప్రసాదించే ఈ ఉదారదేవతావృక్షం అన్నికోరికలనూ తీరుస్తుంది. ఖడ్గాన్నీ, యోగదండాన్నీ ధరించే గోపకిశోరుడిలా గోసంపదను పరిరక్షించే మంగళ దేవత అలమేలుమంగ.**

అమ్మవారికనుబొమలకదలికల్నిబట్టి భగవంతుడు హెచ్చుతగ్గులుగా ఉన్న చరాచరజగత్తును నిర్మిస్తుంటాడు. అట్టి అన్నిలోకాలనూ రక్షించడంలో దీక్ష వహించిన శ్రీవేంకటేశ్వరునిపట్టమహిషిని శరణుకోరడం మన కర్తవ్యం! సృష్టినిర్మాణవిషయంలో అమ్మవారి కనుబొమల కదలికలు– ఆ జీవులకర్మాను గుణంగానే ఉంటాయి. సృష్టికార్యం స్వామి ఒక్కడే చేయగలడు. కానీ, ఆయన గృహస్థ ధర్మాన్ని పాలించి, ఆచరించేవాడు. అందుచేత– లక్ష్మీస్వరూపిణి అయిన పద్మావతీదేవి ఇలా పాల్గొనకపోతే స్వామి ఒంటరివాడౌతాడు. ఆమె లీలారసాన్ని అనుభవించేభాగ్యం లేకపోతుంది స్వామివారికి.

అమ్మ కరుణామయి. వాత్సల్యమూర్తి. అనురాగ వారిధి. ఆశ్రితకల్పవల్లి. అమ్మ అనంతకోటి ఆనందరాగాలకు పట్టుకొమ్మ. అమ్మ మమతలమందారసెలయేరు.

పద్మావతీఅమ్మవారు – అనటంలో "అమ్మ" అనే మాట ఉంది. సాక్షాత్తు లక్ష్మీదేవి. అమ్మవారు భూలోక కల్పవృక్షం. ఆ తల్లి చూపులు దయాకాంతిపుంజాలు. అమ్మవారి మనస్సు స్వచ్ఛమైన ముత్యం. ఆమెకు భక్తులపై గల ప్రేమ నిత్యసత్యం. ఆమె అనంతకాలస్వరూపిణి, పరబ్రహ్మ స్వరూపిణి.

కనుక, జగన్మాతను పరిపూర్ణభక్తిహృదయంతో ఆరాధించాలి. తద్వారా మన మనస్సులు ప్రక్షాళితమవుతాయి. అమ్మవారిని స్మరిస్తూ నిద్రలేవాలి. నిద్రించేముందూ అమ్మవారిని స్మరించాలి. అమ్మవారి వ్యక్తిత్వం దేశకాలాలకు అతీతం. సకల జీవరాసులనూ మనసారా దీవిస్తూంటుంది. భక్తులననుగ్రహించి, వారికి శాంతిసౌఖ్యాలు కల్గిస్తుంటుంది.


అమ్మవారిలోని 'అమ్మతనానికి' ఎల్లలు లేవు. అమ్మకు సాటి ప్రపంచంలో ఏదీ లేదు. ఆకాశానికి ఆకాశమే ఉపమానం. సముద్రానికి సముద్రమే పోలిక. వాగ్గేయకారులు చాలామంది తమ బాధలు అమ్మవారికి చెప్తూ "నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి" అని అమ్మవారినే అర్థించారు. అమ్మవారి ద్వారా అయ్యవారికృపకు సులువుగా పాత్రులు కాగలరు. త్యాగరాజు "సీతమ్మ మా అమ్మ" అంటూ సీతాదేవిని ప్రార్థించి, నుతించి అమ్మవారి వాత్సల్యానికి నోచుకొన్నారు. లక్ష్మీదేవి, పద్మావతి అమ్మవారు ఒక్కరే!

పద్మావతీఅమ్మ దర్శనం సకలశుభాలకు నిలయం. అమ్మ స్మరణం పురుషార్థసాధకం. అమ్మవారికి చేసే నమస్కారం మనస్సంస్కారానికి కుదురు. అందుకే ***'తల్లిని మించినదైవంలేదు'.***

ఇంతటి మహత్త్వశక్తిసామర్థ్యాలూ, వాత్సల్యగుణం, దయాపరత, ఆశ్రితరక్షణదీక్ష గల శ్రీపద్మావతీఅమ్మవారిని కార్తికబ్రహ్మోత్సవాలలో దర్శించి, ప్రార్థించి, నుతించి, నతించి, అమ్మకు శరణాగతులమై, ఆమె కృపకు పాత్రులమై, ఎలాంటి చీడపీడలు లేకుండా అందరం సుఖశాంతులతో వర్థిల్లుదాం!

# పొట్టనిండా.. పాలుపోసేము తండ్రీ!

-సారస్వతకళానిధి డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి,
93941 13848



భారతీయులదృష్టికి ప్రకృతిలోని సర్వజీవులూ, సర్వపదార్థాలూ పూజనీయాలే! అన్నీ దివ్యమూర్తులే! పరమాత్మ యొక్క వ్యక్తరూపమే ప్రకృతి. కనుక అన్నింటిలోనూ ఆయా ఉపాధులద్వారా పరమాత్మతత్త్వం వ్యక్తమౌతూంది. ఇంతటి మహత్త్వభావన విశాలవిశ్వంలో భారతీయులకే సాధ్యమైంది. అనుభవగోచరమైంది. పంచభూతాలనూ, సముద్రాలనూ, నదులనూ, పర్వతాలనూ, వృక్షాలనూ, గోవులనూ, సర్పాలనూ, విగ్రహాదుల్నీ ఆరాధించడం అతిప్రాచీన కాలంనుండీ వస్తున్నసంప్రదాయం.

ఈ విధమైనఆరాధనల్లో **'నాగపూజ'** విశేష ప్రాచుర్యాన్ని సంతరించుకుంది. నాగారాధన వేద కాలంనుండీ ఉంది. నాగేంద్రుడు శివునికి ఆభరణంగా, కేశవునికి శయ్యగా ఉన్నాడు. నాగులు బ్రహ్మదేవునికి పౌత్రులు (మనవళ్ళు). కనుక 'నాగరాజుల్ని' పూజిస్తే త్రిమూర్తుల్ని పూజించినఫలితం దక్కుతుంది.

అన్నిపండుగల్లాగా సంవత్సరంలో ఒక మారే జరిపేది కాక ఈ నాగపూజాపర్వదినం దేశప్రాంతాల్ని బట్టి, చాలామార్లు జరుపుతూ ఉండడం- నాగదేవతల గొప్పతనానికి దృష్టాంతం. శ్రావణశుద్ధ పంచమి- నాగపంచమి. కార్తిక శుద్ధచవితి (చతుర్థి) నాగులచవితి, కార్తికం, మార్గశిరం, భాద్రపదాల్లోని శుద్ధషష్ఠి 'సుబ్బరాయషష్ఠి' (సుబ్రహ్మణ్యషష్ఠి, స్కందషష్ఠి). ఇలా నాగపూజ జరపడం సంప్రదాయం. స్కందషష్ఠి సుబ్రహ్మణ్యస్వామికి సంబంధించిందే అయినా- కుమారస్వామిని సర్పరూపుడుగా భావించడం, ఆ రోజు పుట్టవద్దకు వెళ్లి, నాగపూజచేయడమూ ఉంది.

దీపావళి వెళ్లిననాల్గవరోజున అంటే కార్తికశుద్ధ (చతుర్థి) చవితినాడు 'నాగులచవితి' పండుగ వస్తుంది. శ్రీనాథుడు కాశీఖండంలో....

**"చలి ప్రవేశించు నాగుల చవితినాడు,**
**మెఱయు వేసవి రథసప్తమి దివసమున,**
**అచ్చసేతు ప్రవేశించు పెచ్చుపెరిగి**
**మార్గశిరపౌషమాసాల మధ్యవేళ"**

అని పేర్కొన్నారు. కార్తికశుద్ధచవితినాటినాగుల చవితితో చలి ప్రవేశిస్తుందన్నాడు. శ్రీనాథునికాలానికే 'నాగులచవితి' పండుగ ఆచరణలో ఉంది. ఈ పండుగ విశేషం కూర్మపురాణంలో కన్పిస్తుంది. ఈ రోజు నాగపూజ చేసినవాళ్లను విషాలు బాధించవు. 'విషాణి తస్య నశ్యంతి న తం హింసంతి పన్నగాః'- అన్నారు. స్కంద పురాణం లోనూ కార్తికశుద్ధచవితినాటి వ్రతవివరణ ఉంది. వరాహ పురాణంలో దీన్ని పంచమినాడు ఆచరించాలి, "పంచమ్యాం శుక్లపక్షస్య కార్తికేమాసి"- అని చెప్పబడింది.

సంవత్సరంలో దాదాపు చాలామాసాల్లో నాగపూజ చేయాలనే మనపూర్వుల నిర్ణయం!

**1) చైత్రశుద్ధపంచమి-** నాగపూజ చేయాలని స్మృతికౌస్తుభం.

**2) వైశాఖశుద్ధచవితి-** నాగచతుర్థి. ఈరోజు నాగపూజ చేస్తే సర్పభయం ఉండదు.

**3) శ్రావణపూర్ణిమనాడు-** సర్పబలి. ఉపాకర్మపూర్తి అయ్యాక, ఒకకుండలో పేలపిండిని పోసుకుని, దాన్ని ఉట్టిలో పెట్టుకుని, గరిటతో "సర్పదేవజనేభ్య స్వాహా" అంటూ హోమం చేయాలని స్మృతికౌస్తుభగ్రంథం సూచించింది.

**4) భాద్రపదశుద్ధపంచమి-** 'నాగదష్టోద్ధరణపంచమీవ్రతం' చెయ్యాలని భవిష్యోత్తరపురాణం చెప్పింది. భవిష్య పురాణం దీన్ని 'శాంతిపంచమీవ్రతం' అని పేర్కొనింది.

**5) మార్గశిరశుద్ధపంచమి-** నాగపూజ. ధర్మసింధువు, స్మృతి కౌస్తుభం చెప్పాయి.

**6) ఫాల్గుణశుద్ధపంచమి-** అనంతపంచమీవ్రతం- స్కాంద పురాణం- ప్రభాసఖండం.

**7) మాఘశుద్ధషష్ఠి-** స్కందషష్ఠి. ఇదీ ఒకవిధంగా నాగపూజే!

శ్రావణశుద్ధపంచమి, కార్తికశుద్ధచవితి, చేరితే మొత్తం సంవత్సరంలో తొమ్మిదిమార్లు నాగపూజ జరుగు తోంది. ఇంతేకాక, సుబ్రహ్మణ్యస్వామి ఇలువేల్పుగా ఉండే వాళ్లు ప్రతిఆదివారం పుట్టలో పాలుపోసి, పుట్టకు ప్రదక్షిణాలు చేసి, నాగరూపుడుగా తమస్వామిని పూజి స్తుంటారు. తమఇంట్లో ఏ శుభకార్యం జరిగినా, చిన్న పిల్లలకు ఏ విధమైన అనారోగ్యం కల్గినా- పుట్టనూ, నాగ దేవతనూ పూజిస్తుంటారు.

## కార్తిక నాగులచవితి

గ్రీష్మ, వర్ష ఋతువుల్లో నాగులు సామాన్యంగా బయటకు రావు. శరత్కాలం రాగానే అవి ప్రకృతిఆహ్లాదాన్ని పసి కట్టి, హాయిగా సంచరించేందుకు వస్తాయి. అందు లోనూ శరదృతువు మొదటిమాసం ఆశ్వయుజంలో అంతకు ముందటి వర్షప్రభావం ఉంటుంది. కనుక రెండవ మాసమైన కార్తికంలో అవి నిర్భయంగా సంచరిస్తుంటాయి. కనుక ఈ ఋతువుఉత్తరభాగంలో అంటే కార్తికంలో శివకేశవులకు ప్రీతికరమైనమాసం కనుక నాగపూజ చేస్తారు. ఈ రోజు తలస్నానం చేసి, ఉపవాసంతో ఉండి,

### హనుమద్వాహనం

**అలనాటి అయోధ్యారాముడే ఈ కలియుగవైకుంఠవాసు డని, ఆనాటి జానకిదేవే ఈనాటి అలమేలు మంగాంబిక అని, అప్పటిలాగే ఇప్పుడుకూడా, పరమాత్మ తనదేవేరితో కలసి, భక్తులను తరింపచేయా లని, అన్నమయ్య అభ్యర్థిస్తున్నాడు. అమ్మవారిని అయ్యవారిదగ్గరకు చేర్చడానికి, హనుమంతుడు ఇప్పుడు, సంద్రాన్ని దాటనక్కరలేదు, తిరుమలగిరీంద్రాన్ని దాటితే చాలు.**






కొత్తధాన్యాలు సజ్జలూ మొదలై నవి నానబెట్టి మొలకెత్తిన - అపక్వాహారం - నాగులకు నివే దించి, ముఖ్యంగా స్త్రీలు ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తారు. ఇలాంటి పదార్థాలు తినడంవల్ల స్త్రీలకు సంతానోత్పత్తికి అవసరమైన శక్తులు వృద్ధి అవుతాయి. పుట్టను చూడటం, తాకడం, పుట్టమన్ను వాసన పీల్చడంవల్లా, కొత్త ధాన్యాల అపక్వాహారం తినడం వల్లా, స్త్రీలకు నాడీ మండలంలోని శక్తులు వృద్ధి అవుతాయని పెద్దలు సూచించారు.

ఇందువల్లే మనదేశంలో సంతానం లేనివాళ్ళూ, పుట్టినసంతానం చనిపోతున్న వాళ్ళూ; నాగపూజలూ, నాగప్రతిష్ఠలూ, సేతు (సముద్ర) స్నానం చేసే ఆచారం ఏర్పడింది.

గ్రహస్థితినిబట్టి సంతానం లేకపోవడానికి గల కారణాలు తెలుసుకుని, ఆ దోషపరిహారానికై నాగపూజ చేయాలి. ఇందుకు నాగప్రతిష్ఠచేసి, బంగారుతో నాగ ప్రతిమను చేయించుకుని, పూజించాలి. గో, భూ, తిల, సువర్ణదానాలు చేయాలి.

ఈ విధంగా చేస్తే, నాగేంద్రునిఅనుగ్రహంవల్ల సంతానం కల్గి, వంశవృద్ధి అవుతుంది. (బృహత్పరాశరహోరా శాస్త్రం- పూర్వ జన్మశాపఫలాధ్యాయం. శ్లోకం 10 నుండి 20 వరకు)

భారతీయుల శిల్పచిత్రకళల్లో ప్రముఖస్థానం వహించిందీ నాగరూపాలే! పురాణాలప్రకారం ఈ భూ భారాన్ని ఆదిశేషుడు మోస్తున్నాడు. మన ఉనికికి కారణమైన వాడు నాగేంద్రుడైనఆదిశేషుడు. కనుక కృతజ్ఞతాసూచకం గానూ నాగపూజచేయడం మంచిది.

సర్పపూజ చేయడంవల్ల సాత్త్వికమైన మనస్సుతో పరమార్థవిచారణ చేయడానికి అవసరమైనశక్తి ఏర్పడు తుంది.

యోగశాస్త్రంలో, వేదాంతంలో, పూజావిధాన సామగ్రిలో, వైద్యంలో నాగరూప, నాగదేవతలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఇంతేల? మానవశరీరం, చేతులూ, కాళ్ళూ, వెన్నెముక. ఇవన్నీ నాగరూపాలే! నాగదేవతలకు ప్రతీకలే! భూమిపై ఉండే నాగులు కనుక, నాగులచవితి, నాగపంచమి, సుబ్బరాయషష్ఠి- ఇలా ఏదోవిధంగా సర్వదా నాగదేవతను భౌతికంగా, ఆధ్యాత్మికంగా, యోగపరంగా, విజ్ఞానపరంగా, సంగీతపరంగా- అనేకకోణాల్లో భావించి, నాగపూజ నిర్వహించడంలో భారతీయుల జ్ఞానవిజ్ఞాన దృష్టి ఎంత సమున్నతమైందో తెలుస్తోంది.

విశ్వశ్రేయస్సు కోరేమనఋషులూ. ధర్మశాస్త్రకర్తలూ ప్రతిపూజనూ, పర్వదినాన్నీ మనశ్రేయస్సుకోసమే విధించా రని తెలుసుకుని, శాస్త్రోక్తంగా ఆచరిస్తే తప్పక సత్ఫలితాలు ఉంటాయి.

# పుష్కరతుంగభద్ర

- శ్రీ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు,
9491946070

నదులను పవిత్రమైనవిగా భావించి పూజలు చేయడం, ఉత్సవాలను నిర్వహించడం అనాదికాలంనుంచి ఆచారం. నదులకు జరిగే ఉత్సవాలలో పుష్కరాలు ప్రధాన మైనవి.

పుష్కరం అంటే ఒకపవిత్రసమయం. పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చేది అని అర్థం. అంతేకాకుండా పుష్కరం అంటే ఉదకాన్నిచ్చేది, అలసినవాణ్ణి పోషించేది, సమృద్ధం, ఓషధీవిశేషం, మేఘరాజం, నీరువంటి అర్థాలు కూడా ఉన్నాయి. ఒక్కొక్క నదికి పన్నెండుసంవత్సరాలకు ఒక్కసారి పుష్కరాలు వస్తాయి.


దేవగురువైన బృహస్పతి మకరరాశిలో ప్రవేశించడం వల్ల తుంగభద్రానదికి పుష్కరాలు జరుగుతాయి. ఈ సంవత్సరం అంటే 2020 నవంబర్ 20వ తేది నుంచి డిసెంబర్ 1 వరకు తుంగభద్రకు పుష్కరపుణ్యదినాలు.

తుంగభద్రానదీప్రస్తావన మనకు పురాణాల్లో, ఇతిహాసాల్లో కన్పిస్తుంది. తుంగభద్రానది వరాహస్వామివల్ల జనించినట్లు పురాణకథనం. దుష్టశిక్షణ, శిష్టరక్షణకోసం శ్రీమహావిష్ణువు ధరించిన దశావతారాల్లో మూడవ అవతారం శ్రీవరాహావతారం. హిరణ్యాక్షుడు సృష్టికర్త అయిన బ్రహ్మదేవుణ్ణిగురించి తపస్సుచేసి, మెప్పించి అనేకవరాలు పొందాడు. వరగర్వంతో అతడు సకలలోక వాసులను హింసించసాగాడు. అంతటితో ఆగక హిరణ్యాక్షుడు ఒకసారి భూమిని తీసుకువెళ్లి, సముద్రగర్భంలో పాతాళలోకంలో దాచి ఉంచాడు. ఇలాంటి పరిస్థితుల్లో భూమండలాన్ని సముద్రగర్భంనుంచి వెలుపలకు తెచ్చేందుకు, హిరణ్యాక్షుణ్ణి అంతమొందించేందుకు శ్రీమహావిష్ణువు వరాహావతారాన్ని ధరించాడు.

తనవజ్రసమానమైనదంష్ట్ర(కోర)తో హిరణ్యాక్షుడిని చీల్చి అంతమొందించాడు. పాతాళంలో ఉన్న భూమిని తనకోరతో పైకి తీసుకుని వచ్చి, భూమండలంతోపాటు సకలలోకవాసులనూ రక్షించినవరాహమూర్తి అలసిపోయి పశ్చిమకనుమలలోనికి చేరి విశ్రమించసాగాడు. ఈవిధంగా వరాహస్వామి విశ్రమించినపర్వతప్రాంతానికి వరాహ పర్వతం అనే పేరు ఏర్పడింది.

హిరణ్యాక్షుడితో యుద్ధంచేసి అలసిపోయిన వరాహ స్వామివారిముఖముపై చెమటబిందువులు జనించాయి. వరాహస్వామిముఖంపైన పుట్టినస్వేదబిందువులు కోరల మీదుగా క్రిందకి జారాయి. కుడికోరనుంచి జారి, భూమి పైన పడినబిందువులు నదిగా మారి ప్రవహించసాగాయి. ఆ నది 'తుంగా' నదిగా పేరు పొందింది. అలాగే ఎడమ కోరనుంచి భూమిపైపడినస్వేదబిందువులు 'భద్ర' అనే నదిగా ప్రవహించసాగింది. ఈ రెండునదులు కొంతభాగం విడివిడిగా ప్రవహించి తర్వాత ఒకటై తుంగభద్రానదిగా మారాయి. 'తుంగ' అంటే ఎత్తు అని అర్థం కాగా 'భద్ర' అంటే క్షేమం, నిశ్చలం అని అర్థం.

కర్ణాటకరాష్ట్రంలోని చిక్‌మంగళూరుజిల్లా, పశ్చిమ కనుమలలోని వరాహపర్వతపంక్తులలో గంగమూల అనే





చోట సముద్రమట్టానికి సుమారు 1198 మీటర్ల ఎత్తులో తుంగ, భద్ర అనేనదులు విడివిడిగా జనించాయి. తుంగానది జన్మస్థానానికి కొద్ది ఎగువన భద్రానదియొక్క జన్మస్థానం ఉంది. గంగమూలలో జన్మించిన తుంగానది పర్వతప్రాంతాలను దాటి, వాయవ్యదిశగా ప్రయాణించి, తీర్థహళ్ళి చేరుతుంది. తీర్థహళ్ళిలో తుంగానదిలో అనేకస్నానఘట్టాలు ఉన్నాయి. తీర్థహల్లినుంచి ముందుకు సాగిన పవిత్ర తుంగానది శృంగేరి, షిమోగాల మీదుగా ప్రవహించి, కూడ్లిని చేరుతుంది. గంగామూలలోనే జన్మించిన భద్రానది కదరూ జిల్లాలోని బాబాబందూల్ పర్వతపంక్తులను ఆను కుని చాలాదూరం ప్రవహించి, భద్రావతిపట్టణం చేరు తుంది. అక్కడనుంచి ముందుకు సాగినభద్రానది కూడ్లిని చేరుతుంది. ఈవిధంగా గంగామూలలో జన్మించినప్పటి నుంచి కూడ్లివరకు తుంగానది 147 కిలోమీటర్లు, భద్రా నది 171 కిలోమీటర్ల దూరంవరకు విడి విడిగా ప్రవహించి, కూడ్లివద్ద ఒక్కటవుతాయి.

కర్ణాటక రాష్ట్రంలోని షిమోగా పట్టణానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలోని కూడ్లి అనేగ్రామం వద్ద ఒకటైన తుంగ, భద్ర నదులు తుంగభద్ర పేరుతో ముందుకు సాగుతాయి. అక్కడనుంచి హరిహరపట్నం, హంపిలను తాకుతూ చిత్రదుర్గ, బళ్ళారి, రాయచూరుజిల్లాల్లో ప్రవ హించిన తుంగభద్రనది ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కౌతాళం మండలంలోని నదిచాగి అనేగ్రామంవద్ద ఆంధ్రప్రదేశ్‌లో అడుగిడి, కర్నూలు జిల్లాలోని మంత్రా లయం, సుంకేశుల, పంచలింగాల, కర్నూలు మీదుగా ముందుకు సాగి, మహబూబ్‌నగర్ జిల్లా అలంపురం వద్ద తెలంగాణా రాష్ట్రంలో అడుగిడింది. తర్వాత 6 కిలోమీటర్లు ముందుకు సాగి గొందిమళ్ల వద్ద కృష్ణానదిలో విలీనం అవుతుంది. ఈ విధంగా తుంగభద్రానది 531 కిలోమీటర్ల మేర ప్రవహించి 71,417 చదరపు కిలోమీటర్ల పరివాహక ప్రాంతాన్ని కలిగి ఉంది.

సాధారణంగా నదులలో స్నానం ఆచరించడం, పూజలు, దానాలు చేయడం, పితృకర్మలువంటివి చేయడం ఆచారం. అటువంటికార్యక్రమాలు పుష్కరసమయంలో చేయడంవల్ల అధికఫలాలు కలుగుతాయని శాస్త్రాలు వెల్ల డిస్తూ ఉన్నాయి.






# ఇలలోనే కాదు.. కలలో కూడా..!


శ్రీమతి దరూరి శ్రీఆండాళ్ నాగ్

మాది హైదరాబాదు. మాకు మొదటినుంచి శ్రీవేంకటేశ్వరస్వామివారిపై అమితభక్తి. 2018వ సంవత్సరంలో స్వామివారిదివ్యలీల ఒకటి మాజీవితంలో జరిగింది.

మావారికి ఒకశుక్రవారంనాటిరాత్రి కలలో స్వామివారిప్రసాదం కనిపించిందట. ఆ స్వప్నంగురించి ఆయన నాతో ఏ మాత్రం ప్రస్తావించలేదు. రోజు వారిపూజాకార్యక్రమాలు ముగించుకుని ఆఫీసుకు బయలు దేరారు.

నాటిరాత్రి వచ్చిన కలగురించి ఆలోచిస్తూ, ఆఫీసుకి చేరేసరికి ఆయన టేబుల్‌పై ఆశ్చర్యకరంగా శ్రీవేంకటేశ్వరస్వామికి సంబంధించినపుస్తకాలు ఉన్నాయి. అవి ఎవరు పెట్టారని మావారికి అర్థం కాలేదు. మావారు తన స్వప్నంలో కనిపించిన ప్రసాదం శ్రీవారిపుస్తకప్రసాదరూపంలో లభించినందుకు ఎంతో సంతోషించారు.

ఆ పుస్తకాలు తన సహోద్యోగి మావారికి ఇవ్వడానికి తెచ్చాడట. ఆ విషయం తర్వాత తెలిసింది. ఆ రోజంతా ఈ సంఘటననే తలుచుకుంటూ ఆనందంతో ఉన్నారు- మావారు. సాయంకాలం ఇంటికి రాగానే ఆ సంతోషాన్ని నాతోనూ పంచుకున్నారు. తనకు రాత్రి స్వప్నంలో కనిపించిన స్వామివారి ప్రసాదం



ఆఫీసులో శ్రీవారిపుస్తకప్రసాదంగా లభించడం స్వామివారిలీల గాక మరేమిటని మేము ఇరువురం స్వామి వారికి నమస్కరించుకున్నాం.

ఈ విషయాన్ని మేము మా అమ్మాయితో పంచుకున్నాం. తను కూడా ప్రసాదం అంటే లడ్డూకదా అని సందేహం వెలిబుచ్చింది. తర్వాత మావారు సాయంకాలపూజాకార్యక్రమాలను ముగించుకుని పూజగది నుంచి బయటకు వస్తుండగా కాలింగ్ బెల్ మోగింది.

అప్పుడు మావారు మా పాపతో ఎవరో వచ్చారు, చూడమని చెప్పారు. అప్పుడు జరిగింది ఒక ఆశ్చర్యకరసంఘటన! మా పక్కింటి అమ్మాయి ఒక పెద్ద తిరుపతి లడ్డూను దేవాలయంలో మాదిరిగా మా పాప చేతిలో పెట్టేసరికి మా పాప ఆనందానికి, ఆశ్చర్యానికి అవధులు లేకుండా పోయాయి.

మా పాప మాదగ్గరకు వచ్చి, నాన్నగారు మీకు వచ్చిన కల నిజమైంది అని తనచేతిలోని లడ్డూను మా వారికి అందించింది. అంటే ఆ స్వామివారు మాపాపకు కలిగిన సందేహాన్ని కూడా లడ్డూప్రసాద రూపంలో నివృత్తి చేసినందుకు మేము చాలా ఆనందించాం. ఆ ప్రసాదాన్ని భక్తితో స్వీకరించాం. ఈ సంఘటన జరిగిన కొన్నిరోజులకే మాకు స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనే మహాభాగ్యం తిరుమల శ్రీవారిసన్నిధిలో లభించింది.



చీకటిని విమర్శించడంకన్నా చిన్నదీపం వెలిగించడం మిన్న

తిరుచానూరు

# శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవం

**2020 నవంబరు 11 నుండి 19 వరకు**

**11-11-2020 బుధవారం**
పగలు: తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం.
రాత్రి: చిన్నశేషవాహనం.

**12-11-2020 గురువారం**
పగలు: పెద్దశేషవాహనం.
రాత్రి: హంసవాహనం.

**13-11-2020 శుక్రవారం**
పగలు: ముత్యపుపందిరివాహనం.
రాత్రి: సింహవాహనం.

**14-11-2020 శనివారం**
పగలు: కల్పవృక్షవాహనం.
రాత్రి: హనుమద్వాహనం.

**15-11-2020 ఆదివారం**
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం.
రాత్రి: గజవాహనం.

**16-11-2020 సోమవారం**
పగలు: సర్వభూపాలవాహనం.
రాత్రి: గరుడవాహనం.

**17-11-2020 మంగళవారం**
పగలు: సూర్యప్రభవాహనం.
రాత్రి: చంద్రప్రభవాహనం.

**18-11-2020 బుధవారం**
పగలు: రథోత్సవం.
రాత్రి: అశ్వవాహనం.



**19-11-2020 గురువారం**
పగలు: చక్రస్నానం. పంచమీతీర్థం
రాత్రి: ధ్వజావరోహణం.

# తిరుమల తిరుపతి దేవస్థానములు



**తిరుమల శ్రీవారి ఆలయంలో ఇటీవల ఏకాంతంగా జరిగిన పార్వేట ఉత్సవదృశ్యం**



తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాదభవనం తిరుమలలో భక్తులతో మాట్లాడుతున్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కె.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఎ.ఎస్.,
అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్., గార్లు



తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కె.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఎ.ఎస్.,
ఇతర తి.తి.దే. ఉన్నతాధికారులతో
తిరుమలలోని పలుప్రాంతాల్ని తనిఖీ చేస్తున్న దృశ్యం



లోకకల్యాణంకోసం తి.తి.దే. చేపట్టిన షోడశదినసుందరకాండపారాయణ దీక్ష
ముగింపు సందర్భంగా జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఎ.ఎస్. గారు, ఇతర ఉన్నతాధికారులు



తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఎ.ఎస్.
ఇటీవల తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని దర్శించుకున్న దృశ్యం



నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా
తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఉత్సవమూర్తి
శ్రీమహాలక్ష్మి అలంకారంలో గజవాహనంపై
భక్తులకు సాక్షాత్కరించిన దృశ్యం



తిరుమల కల్యాణకట్టను పరిశీలిస్తున్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఎ.ఎస్.
అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వీ.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.



కేంద్రవిజిలెన్స్ కమీషన్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన
అవినీతి వ్యతిరేక, భద్రతా అవగాహన వారోత్సవాలలో భాగంగా తి.తి.దే. ఉద్యోగులతో
ప్రతిజ్ఞ చేయిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఎ.ఎస్.
అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వీ.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.
సంయుక్త కార్యనిర్వహణాధికార్లు శ్రీ పి.బసంత్ కుమార్, ఐ.ఎ.ఎస్., శ్రీమతి ఎస్.భార్గవి ఐ.ఎ.ఎస్. గార్లు



ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ స్పెషల్ కమీషనర్
శ్రీ పి.అర్జున్ రావు, ఐ.ఏ.ఎస్.,
తి.తి.దే. పాలకమండలి ఎక్స్-అఫిషియో సభ్యులుగా
ప్రమాణస్వీకారం చేసినప్పటి దృశ్యం



02-10-2020 తేదీన ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ కార్యదర్శి
శ్రీ ఎం.గిరిజాశంకర్, ఐ.ఏ.ఎస్.,
తి.తి.దే. పాలకమండలి ఎక్స్-అఫిషియో సభ్యునిగా
ప్రమాణస్వీకారం చేసినప్పటి దృశ్యం!





10-10-2020 తేదీన తి.తి.దే. నూతన కార్యనిర్వహణాధికారిగా డా॥ కే.ఎస్. జవహర్ రెడ్డి, ఐ.ఎ.ఎస్., గారు
బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీవారి ఆలయంలో ఉన్నతాధికారులతో.....

# శ్రీకేదారేశ్వర వ్రతకథ

– శ్రీమతి పి. విజయలక్ష్మి




శ్రీకేదారేశ్వరవ్రతం ఆశ్వయుజబహుళఅమావాస్య నాడు నిర్వహించాలని స్కాందపురాణం చెప్పింది. హిమాలయాల్లో ఒక పర్వతం కేదారక్షేత్రంగా ప్రసిద్ధి. శివునికి ఇష్టమైంది. కేదారమంటే వరిపంటకు అనువైనభూమి.

కేదారక్షేత్రాధిపతి కేదారేశుడు. కేదారశివలింగం ప్రసిద్ధం. ఈ కేదారేశ్వరుణ్ణి పూజించి, మనోరథసిద్ధి పొందడమే కాక, శివునిఅర్ధదేహంలో ఉండే అర్ధాంగిత్వాన్నీ పొందింది పార్వతి.

ఈ వ్రతవిశేషాలు సూతపౌరాణికుడు శౌనకాది మహామునులకు వివరించాడు.

"మునులారా! సర్వసంపదలిచ్చేది. మునుపు అనేక ఋషులచే ఆచరించబడిందీ, మహామహిమకలదీ అయిన కేదారేశ్వరవ్రతాన్ని లోకక్షేమాభివృద్ధులకై చెప్పుతున్నాను వినండి. పార్వతీదేవి ఈ వ్రతాన్ని ఆచరించి సకలసంపదలు పొందింది."

## వ్రతకథాక్రమం

భూలోకంలో ఈశానదిక్కున కైలాసమనే పర్వతం ఉంది. ఆ పర్వతవైభవం చాలా గొప్పది. అక్కడ మునులు ఉంటారు. ప్రమథగణాలతో కూడి శివుడక్కడ ఉంటాడు. అదే కేదారక్షేత్రం! అక్కడ ఎందరో వారినైపుణ్యాన్ని ప్రదర్శించి, శివునికి ఆనందం కల్గిస్తూ ఉంటారు. భృంగిరిటి చాలా చక్కగా నవ్వు కల్గించాడు. అందుకు సంతుష్టుడైన శివుడు అతణ్ణి మిక్కిలి అభిమానించాడు. అందరి మన్నలకు పాత్రుడయ్యాడు. ఒకమారు భృంగిరిటి పార్వతిని విడిచి, శివునికే ప్రదక్షిణం చేశాడు. పార్వతి ఇలా ఎందుకు చేశాడని శివుణ్ణి అడిగింది. శివుడు పార్వతీ! బ్రహ్మజ్ఞానసంపన్నులైన యోగులు నిన్ను మ్రొక్కరు. వారికి నీవల్ల పని లేదు" అన్నాడు.

పార్వతి కోపించి, తనశక్తిని శివునినుండి ఆకర్షించింది. శివుడు చిక్కిపోయాడు. పార్వతి గౌతమ వనానికి వెళ్ళి, గౌతమునిఆశ్రమం చేరింది. అప్పటికి గౌతమి యజ్ఞార్థసమిధలు మున్నగునవి తెచ్చుకోవడానికి వెళ్ళి, వస్తూ ఆశ్రమం అకాలశోభలతో ప్రకాశిస్తుండం చూచి, ఆలోచిస్తూ, పార్వతిని చూచి, అతిథిపూజచేసి, "ఇక్కడికి ఎందుకు వచ్చినావమ్మా?" అని అడిగాడు. ఆమె "మునివర్యా! సకలయోగులు పూజించే శివుని అర్ధాంగిత్వం

### వ్రతఫలం

**ఈ వ్రతం ఆచరించేవారికీ,**
**ఈ వ్రతమహిమ విన్న వారికీ**
**ఆయురారోగ్యసంపత్కీర్తులు ప్రాప్తిస్తాయి.**
**ఎవరు ఈ వ్రతాన్ని ఇరవైఒక్కమార్లు (సంవత్సరాలు)**
**చేస్తారో వారు ఇహంలో గొప్పఅదృష్టం,**
**కాంతి, ఆయస్సు కలవారై ఉండి,**
**పరంలో శివసాయుజ్యం పొందుతారు.**
**నాల్గువర్ణాలవారు, స్త్రీపురుషులు**
**నియమంతో ఉండి, ఈ వ్రతాన్ని**
**ఆచరించవచ్చు.**

నాకు ఎలా సిద్ధిస్తుంది?" అని విన్నవించింది. గౌతముడు పరిశీలించి, "అమ్మా! కేదారేశ్వరవ్రతాన్ని ఆచరించు" అన్నాడు.

## ఆచరణ విధానం

ఆశ్వయుజబహుళఅష్టమినాడు కంకణం కట్టుకొని, ఆ రాత్రి ఉపవాసం ఉండాలి. ఆనాటినుండి అమావాస్య వరకు ఈ వ్రతం ఎనిమిదిరోజులు చేయాలి.

## వ్రత ఆచరణ విధానం

ప్రతిరోజూ స్నానానంతరం పరిశుద్ధమైన ఏకాంత ప్రదేశంలో ధాన్యరాశిపోసి, దానిపై పూర్ణకుంభం పెట్టి, దాన్ని 21 నూలుపోగులతో చుట్టి, దానిమీద తెల్లనివస్త్రం చుట్టి, కలశంలో బంగారు లేదా వెండినాణాలుంచి, కల్పోక్త ప్రకారం పూజ చేసి, పిదప 21మంది బ్రాహ్మణుల్ని పూజించాలి. తర్వాత కలశంలో కేదారేశ్వరుణ్ణి ఆవాహనం చేసి, పూజించి, 21 అతిరసాలు, పాయసం, పండ్లు నివే దించి, అందరికీ దక్షిణలిచ్చి పూజ పూర్తి చేయాలి. అప్పుడు "కేదారేశ్వరుడు సంతోషించి, దేవతలతో పాటు వచ్చి, నీకు తన దేహంలో (ఎడమప్రక్క) అర్ధాంశం ఇస్తాడు" అని వివ రించాడు.

పార్వతీదేవి అట్లే కేదారేశ్వరవ్రతాన్ని చేసింది. వెంటనే శివుడు ప్రత్యక్షమై పార్వతిఆశయాన్ని సఫలం చేశాడు. అంతేగాక లోకుల మేలుగోరి, 'నా విషయంలోనే కాక ఈ వ్రతంచేసిన వాళ్లందరూ కూడా ఐశ్వర్యవంతులై, సుఖశాంతులతో ఉండేటట్టుగా వరం ప్రసాదించు" అని ప్రార్థించింది. శివుడు 'తథాస్తు' అన్నాడు.

అక్కడే ఉన్న చిత్రాంగదుడనే గంధర్వుడు నందీ శ్వరునిఅనుగ్రహం పొంది, భూలోకంలో ఈవ్రతాన్ని ప్రచారం చేయాలని తలంచి, ఉజ్జయనీపట్టణానికి వచ్చి, కేదారేశ్వరవ్రతం, తత్ఫలాలు వివరించాడు. ఆ దేశంలోని వజ్రదంతుడు ఈ వ్రతాన్ని ఆచరించి, చక్రవర్తి అయ్యాడు.

ఆ పట్టణంలో ఇద్దరు వైశ్యకన్య లుండేవారు. వారు ఈ వ్రతవిషయం తెలుసుకొని, తండ్రివద్దకువెళ్లి, "మేము కేదారేశ్వరవ్రతం చేస్తాం. మీరు ఆమోదించి, ఆశీర్వదించండి" అన్నారు. అతడు "నేను దరిద్రుణ్ణి, కనుక మీ ఆలోచన విరమించుకోండి" అన్నాడు. అందుకు వారు "నాయనా! నీవు ఏమీ ఇయ్యవద్దు. నీవు అనుమతిస్తే చాలు" అన్నారు. తండ్రి "సరే!" అన్నాడు. ఆ కన్యలభక్తికి మెచ్చి, శివుడే వారికి అవసరమైన పూజాద్రవ్యాలన్నీ అనుగ్రహించాడు. వారు ఒకమర్రిచెట్టుక్రింద ఈవ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వ హించారు. శివుడు సాక్షాత్కరించి, వారికి మంచిరూపం, తరుగనిసంపదలు ఇచ్చి వెళ్లాడు.

ఆ ఇద్దరిలో పెద్దామె అయిన 'పుణ్యవతి'ని ఉజ్జ యినీరాజు పెండ్లాడాడు. రెండవఅమ్మాయి 'భాగ్యవతి'ని చోళదేశంరాజు పెండ్లాడాడు. ఇద్దరూ సామ్రాజ్యసంపదలతో కాలం గడిపారు. భాగ్యవతి (చెల్లెలు) ఐశ్వర్యగర్వంతో



**పల్లకీ వాహనం**

**అలమేలుమంగమ్మ కార్తికబ్రహ్మోత్సవాలలో పల్లకి వాహనంలో ఐదవరోజు ఉదయం దర్శనమిస్తుంది. అమ్మవారు జగన్మోహిని, విశ్వరూపిణి, దేవదేవి. విరాడ్రూపిణి సూర్య చంద్రులు జడబిళ్లలుగా అమరు తున్నాయని చిలుకగానం చేస్తుంది. వెన్నెలబొమ్మ అలమేలుమంగమ్మ కూర్చున్న పల్లకిని ముద్దుగుమ్మలు మోసినట్లు అన్నమయ్య కీర్తించాడు.**

## గజవాహనం

జగతి- అంటే జన్మించి, గతించిపోయేది. గజము- అంటే గమనిస్తూ, జన్మిస్తూ ఉండేది. అంటే జననమరణచక్రంలో నిరంతరం పరిభ్రమిస్తూ ఉండే జీవతత్త్వం తామసికం. గోవు సత్త్వగుణానికి ప్రతీక. అశ్వం రజోగుణానికి ప్రతిబింబం. గజం తామసప్రవృత్తికి ప్రతి రూపం.

"కలదు కలం డనెడివాడు కలడో లేడో" - అనుకుంటే స్వామి రక్షించడు. "నీవే తప్ప ఇతః పరం బెరుగ" నని శరణాగతి చెందితే రక్షిస్తాడు.

తమ జాతికి చెందిన గజరాజుమొర నాలించి, రక్షించిన శ్రీపతిమీది, భక్తి ప్రపత్తులతో ఈ గజాలు ఆయనకు వాహన సేవలను అందిస్తున్నాయి. ఆయన సతీమణికీ వాహన సేవ లందిస్తున్నాయి.

అష్టలక్ష్ములతో అమ్మవారు 'గజలక్ష్మి'గా పూజలందుకుంటూ భక్తులను బలో పేతులను చేస్తుంటారు. అమ్మవారు జగన్మాత.



కేదారేశ్వరవ్రతాన్ని చేయలేదు. అందువల్ల భాగ్యవతిని కొడుకుతో కూడా ఆమెభర్త ఒక కారణంగా రాజ్యంనుండి తరిమేశాడు. భాగ్యవతి కొడుకుతో సహా అడవుల్లో తిరుగుతూ దుఃఖితురాలై, కొడుకును పిల్చి, "నాయనా! ఈ ఉజ్జయినీ దేశంరాజుభార్య నాకు అక్క. కనుక నీవు పెద్దమ్మవద్దకు వెళ్లి, మన దయనీయపరిస్థితి చెప్పి, ఆమెను అడిగి ధనం ఇప్పించుకొని, రా" అని చెప్పి పంపింది.

ఆ బాలుడు వెళ్లి చెప్పగా ఆమె విస్తారంగా ధనం ఇచ్చి పంపింది. ఇంతలో కేదారేశ్వరుడు దొంగవలే వచ్చి, ఆ ధనాన్ని గైకొని వెళ్లాడు. ఆ బాలుడు పెద్దమ్మవద్దకు వెళ్లి చెప్పగా, ఆమె మరల విస్తారంగా ధనం ఇచ్చి పంపింది. తెస్తుండగా ముందటివలే– స్వామి కన్పించకుండా వచ్చి ధనాన్ని దోచుకొన్నాడు. దీనుడై ఉన్న బాలునివద్దకు వచ్చి, "భాగ్యవతీకుమారా! దుఃఖపడవద్దు. నావ్రతాన్ని ఉల్లంఘించినవారికి ఈ ధనం తగదు"– అని చెప్పాడు. ఆ బాలుడు వెళ్లి, పెద్దమ్మ పుణ్యవతికి వృత్తాంతం అంతా చెప్పాడు. ఆమె ఆ బాలునిచేతనే కేదారేశ్వరవ్రతం చేయించి, "నాయనా! నీ తల్లితోకూడా ఈవ్రతాన్ని చేయించు" అని కావాల్సినంత ధనం ఇచ్చి పంపింది.

ఆ బాలుడు ఆ ధనంతో వస్తుండగా ముందు పోగొట్టుకొన్న ధనమంతా దారిలో పడి ఉండింది. ఆ ధనాన్ని తీసుకొని ఆ బాలుడు తల్లి వద్దకు వచ్చి, జరిగిన సంగతులు వివరించాడు. భాగ్యవతికూడా తాను ఉల్లంఘించిన కేదారేశ్వరవ్రతాన్ని భక్తితో చేసి, తన తప్పును క్షమించుమని స్వామిని ప్రార్థించింది. పిదప ఆ బాలుడు కేదారేశుని దయతో, చతురంగబలంతో కాంచీపురానికి రాగా, రాజైన తనతండ్రి ఎదురేగి, వారిని పిల్చుకుని వచ్చి, బహుకాలం అభివృద్ధి పొందాడు.

నాటినుండి భాగ్యవతి, చోళరాజు దంపతులు కేదారేశ్వరవ్రతాన్ని నియమంతో ఆచరిస్తూ వచ్చారు. సకలసంపదలతో రాజ్యపాలన ధర్మబద్ధంగా నిర్వహిస్తూ ఉండినారు.

### ఫలశ్రుతి

**ఈ వ్రతం గౌతమమహర్షి పార్వతికి ఉపదేశించింది. కనుక ఇహపరసుఖాలు కావాలనుకునేవారు ఈ వ్రతాన్ని ఆచరిస్తే- అన్నికోరికలు తీరుతాయి. చివరలో శివసాయుజ్యం పొందుతారు. ఈ వ్రతమహిమ విన్నవారికి, చదివినవారికి, పరమేశ్వరుడు. సకలసంపదలు అనుగ్రహిస్తాడు.**



# ఈ దేవుని దయ ఉంటే...

- శ్రీ మల్లాది హనుమంతరావు,
99493 40236

లోకంలో ఎవరైనా అకారణంగా కష్టాలపాలైనట్టు అనిపిస్తే, 'శనిప్రభావం' అని తల కొట్టుకోవటం కనిపిస్తుంది. అలాగే ఎవరైనా ఒకళ్లు ఎంత వదిలించుకొందామనుకొన్నా వదలకుండా వెంటబడి వేధిస్తుంటే 'శనిగ్రహంలా వేధిస్తున్నాడు!' అని ఆక్రోశం చెందడంకూడా తరచుగా జరిగే విషయమే!

నిజానికి ఇలా ఎవరికి ఏ చికాకు కలిగినా, ఆపద వచ్చినా, అందరూ ఆ శనీశ్వరుడిని నిందించటం, ఆయననీ, ఆయనశక్తినీ అపార్థం చేసుకుని, ఆయనమీద నిష్కారణంగా అపనిందవేయటమే!

జన్మతః, స్వభావపరంగా, వ్యక్తిత్వపరంగా శనీశ్వరుడు మహోన్నతుడు. గ్రహబలందృష్ట్యాకూడా ఆయన కేవలం దుష్టఫలితాలనే ఇస్తాడు అనటం పొరబాటు. కొన్ని రాశులలో, కొన్ని భావాలలో శనిగ్రహంవల్ల కలిగే అద్భుతమైన యోగాలు మరే గ్రహంవల్లా కలుగవు. ఎందరో మహనీయుల జాతకచక్రాలలో శనీశ్వరుడు మిరుమిట్లు గొలిపేలా ప్రకాశిస్తూ వాళ్లకు గొప్పయోగకారకుడై, వాళ్లు తమజీవితంలో సాధించిన సాఫల్యాలన్నింటికీ కారణభూతుడుగా కనిపిస్తాడు. ఆ మాటకొస్తే కొన్ని జాతకాలలో శుభప్రదులుగా, మరికొన్నింటిలో అశుభకారకులుగా ఉండటం అనేది అన్నిగ్రహాల విషయంలోనూ జరుగుతుంది. కానీ, పాపం శనీశ్వరుడికి మాత్రం నిష్కారణంగా చెడ్డపేరు!

ఆయనవిషయంలో లోకం భయపడటానికి కనిపించే కారణం ఆయన పేరులోనే ఉంది. ఆయన 'శనైః చరుడు' (నిదానంగా నడిచేవాడు). ఒక్కొక్కరాశిలో ఆయన ప్రయాణం రెండున్నర సంవత్సరాలు సాగుతుంది. కనుక, ఆయన ప్రభావంకూడా ఎక్కువకాలం పడుతుంది. అది మంచిప్రభావమై, మంచి ఫలితాలిస్తే లోకులు దాన్ని తలచుకోరు. అంతా వాళ్లప్రయోజకత్వం అనుకుంటారు. మనకర్మఫలం కారణంగా, సుదీర్ఘకాలం దుష్ఫలితాలు అనుభవించాల్సి వస్తే, దానికి శనీశ్వరుడిణ్ణి బాధ్యుడిని చేస్తే మనిషికి కొంత ఊరట!

నవగ్రహాల స్తోత్రం చేసేటప్పుడు మనం శనీశ్వరుడిని నీలాంజనసమ ఆభాసుడుగా (నల్లనికాటుకతో సమానమైన శరీరకాంతికలవాడు), రవిపుత్రుడిగా, యమాగ్రజుడిగా, ఛాయాదేవికడుపుపంటగా చెప్పుకుంటాం.

ఛాయా, మార్తాండుల సుపుత్రుడుగా శనీశ్వరుడు జన్మనెత్తింది- జ్యేష్ఠశుద్ధత్రయోదశి తిథినాడు. ఆ రోజు శనివారం కనుక శనివారం శనైశ్చరుడిపూజకు ప్రత్యేకంగా అనువైనవిశేషదినం. అలాగే త్రయోదశితిథి. ప్రతి సంవత్సరమూ, రెండుమూడుసార్లు త్రయోదశితిథి శనివారం నాడు వస్తుంది. ఆ రోజు శనిత్రయోదశి. శనీశ్వరుడిని ఆరోజు పూజించుకుంటే విశేషఫలితాలు లభిస్తాయి.

ఎవరికైనా జన్మరాశినుండి ఆరోరాశిలో గానీ, మూడోరాశిలో గానీ శని సంచరించేటప్పుడు శుభఫలితాలనిస్తాడు. ఒకటి, రెండు, నాలుగూ, పన్నెండురాశులలో చరించేటప్పుడు శుభఫలితాలనివ్వడు- అంటుంది జ్యోతిష

శాస్త్రం. అంతా బాగా జరిగేకాలం మనిషికేమీ నేర్పదు. అహంకారాన్నీ, భోగలాలసతనూ, అలసత్వాన్నీ పెంచుతుంది. కష్టకాలమే మనిషికి వైరాగ్యాన్నీ, పరిణతినీ, పరలోకస్పృహనూ, భగవద్భక్తినీ, మోక్షకాంక్షనూ, ఆటుపోట్లుకు తట్టుకునే స్థైర్యాన్నీ ఇస్తుంది. కనుక, కష్టకాలమే ఒక రకంగా మంచికాలం!

కష్టంలో ఉన్నా, సుఖంలో ఉన్నా కనిపెట్టి ఉండుమని శనైశ్చరుడిని ప్రార్థించగోరేవాళ్లకు శని త్రయోదశి ప్రదోషసమయాలలో శనిధ్యానం సువర్ణావకాశం. వాస్తవానికి శనైశ్చరుడు నిష్పాక్షికుడైన కర్మఫలప్రదాత. మనకష్టసుఖాలకు మనపూర్వకర్మలే కారణం. దుష్కర్మల ఫలం అనుభవించాల్సి వచ్చినప్పుడు గ్రహచారం అనుకూలంగా ఉండదు. దుఃఖదాయకమైన అనుభవాలు ఎదురౌతాయి. కానీ, ఆ దుఃఖాలను నిబ్బరంతో, సహనంతో, ఎదుర్కొగలిగితే అవి మరీ దుర్భరమనిపించవు.

గ్రహపూజలవల్ల కష్టకాలాలను ప్రశాంతంగా గడపవచ్చంటారు పెద్దలు. శనిగ్రహం ప్రతికూలంగా ఉన్న సమయంలో కలిగే బాధలను తేలికపరచాలంటే, ఆ శనీశ్వరుడి అనుగ్రహమే ఔషధం. శనిఅనుగ్రహసాధనకు శనిత్రయోదశినాడు ప్రత్యేకంగా చేసే శనిపూజలు చక్కని సాధనాలు.

నవగ్రహాలలో వేటి ప్రత్యేకతలు వాటివి. శనికున్న ప్రత్యేకతలు కొన్నిచెప్పుకోవాలంటే, ఆయన 'మందుడు'. నిదానంగా కదులుతాడు. నల్లనివాడు. శనివారాన్ని, కృష్ణవర్ణాన్ని ఇష్టపడతాడు. 8, 17, 26 ఈయనకు అనుకూలమైన సంఖ్యలు. పశ్చిమముఖుడు. మకర, కుంభరాశులకు అధిపతి.

విఘ్నాలకు విఘ్నేశ్వరుడిలాగా, విపత్పరంపరలకు శనీశ్వరుడే ప్రభువు. ధీరుడు. దీనార్తిహరుడు. కాలం కలిసి రాకపోతే, 'కళత్ర, పుత్రశత్రుత్వకారణుడు' కూడా అవుతాడు. ఆయనచూపుపడితే ఎవరికైనా దైన్యం కలుగుతుంది.

శనైశ్చరకవచస్తోత్రాన్ని శనిత్రయోదశిరోజు శ్రద్ధగా పఠిస్తే సర్వవిధాలైన గ్రహపీడలు ఉపశమిస్తాయి.

శనిపూజలో నువ్వులనూ, నువ్వులనూనెనూ ఎక్కువగా వాడతారు. శనిత్రయోదశిదినాలలో శని విగ్రహానికి నువ్వులనూనెతో తైలాభిషేకాలు చేయడం ఫలప్రదం.

శనీశ్వరుడికికూడా నిత్యపఠనీయమైన షోడశ నామాలున్నాయి. వీటిని నిత్యం పఠిస్తే – ముఖ్యంగా శనికి విశేషదినాలైన పర్వదినాలలో శ్రద్ధగా పఠిస్తే సర్వకార్యసిద్ధి పొందవచ్చు.




## సర్వభూపాలవాహనం

**శ్రీదేవి, భూదేవి, శ్రీహరిపట్టపుదేవేరులు, భూదేవికి నిజమైనపతి ఆశ్రీహరి ఒక్కడే. రాజులను కూడా భూపతులంటారు కాని, వారిది తాత్కాలికమైన పరిపాలనబాధ్యతమాత్రమే! భగవంతుడు సర్వభూపాలుడు!**

**సర్వభూపాలురూ కలిసి, విశ్వవిభుడైనహరి పట్టపురాణికి వాహకులై సేవలందించి, తరిస్తున్నారన్న భావనకు రూపకల్పనే ఈ వాహనసేవ. పిల్లలకు తల్లిదగ్గర చనవు ఎక్కువ. ఆ తల్లికీ పిల్లలమీద మక్కువ! అందుకే అన్నమయ్య "మామొరలను నీపతికి వినిపించి, దయతో మమ్ము ఆదుకోవడం నీకే తగునమ్మా!" అంటూ ఈ కీర్తనలో విన్నవించుకుంటున్నాడు.**

# గానకైంకర్యం

– డా॥ ముదివేడు ప్రభాకరరావు

శ్రీవైష్ణవభక్తిసంప్రదాయంలో భగవత్‌కైంకర్యాన్ని జీవితాంతం ఒకవ్రతంగా అనుష్ఠానంచేయడం ఒక విలక్షణమైనఅంశం! విశేషించి, మంగళకైశికీరాగంలో వైష్ణవభక్తులు ప్రతియేటా కార్తికమాసంలో శుద్ధద్వాదశి (క్షీరాబ్ధిద్వాదశి) నాటికి పూర్తయ్యే విధంగా నాలుగుమాసాలు నిష్ఠాగరిష్ఠులై మంగళకైశికీరాగంలో గానకైంకర్యం చేసి, వ్రతపరిసమాప్తి ద్వాదశినాటికి భగవత్సమర్పణం చేయడాన్నే **కైశికద్వాదశీవ్రతమని, మంగళకైశికీవ్రతమని పిలుస్తారు.** పైగా, క్షీరాబ్ధిద్వాదశి శ్రీమన్నారాయణునికి మిక్కిలి ఇష్టమైనరోజు. వ్రతపరిసమాప్తి కావలసినరోజుకూడా అదే! అందుకే, ఈ రోజే పరివ్రాజకులు, పీఠాధిపతులు చాతుర్మాస్యవ్రతాన్ని పూర్తిచేసి, వ్రతానుష్ఠాన ఫలాన్ని పొందే రోజు కావడం విశేషం! తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతియేటా జరిగే కార్తికశుద్ధద్వాదశి (క్షీరాబ్ధిద్వాదశి) ఉత్సవాన్నే కైశికద్వాదశీఆస్థానోత్సవం అంటారు.

**భూదేవీవరాహస్వామిసంభాషణలో, భూదేవి "ఏమార్గం చేత సంసారిచేతనులైనభక్తులు విష్ణుమూర్తిని సులభంగా చేరుకోగల"రని ప్రశ్నించినపుడు ఆయన ఒక ఉపాయాన్ని ఇలా చెప్పారు.**

గానరూపమైన కైంకర్యం, ఈ పురాణంద్వారా ప్రసాదించి, పూర్వకాలంలో ఒకడు ఈ గానరూపకైంకర్యాన్ని స్వీకరించి, ముక్తి పొందాడని తెలిపేవృత్తాంతం అనుగ్రహించబడింది.

"నాయొక్క అనంతకల్యాణగుణగణాలను సంపూర్ణంగా తెలిసినా, తెలియకపోయినా, అర్థమైనంతలో ఎవరు జాగరూకులై సంకీర్తనరూపంగా గానం చేస్తారో వారు నా భక్తులుగా స్థిరపడుతున్నారు." ఇది విన్న భూదేవి విష్ణుచిత్తులవారిఇంటిలో తులసీవనంలో (గోద=పూమాల) అవతరించి, 'తిరుప్పావై'వ్రతాన్ని అనుష్ఠించి, నెలరోజుల్లో ముప్పైపాశురాలను పాడి, భగవంతుడైన శ్రీరంగనాథుణ్ణి వివాహమాడి, ఆయనలోనే లీనమైంది.

**నంపాడువాన్ కథ:** పూర్వం ఒక దాసరి ఉండేవాడు. అతనిపేరు లోకంలో **"నంపాడువాన్"** (మనగాయకుడు) అని ప్రసిద్ధి. ఇది తమిళనామధేయం, అతడు విష్ణుభక్తుడై కుఱుంగుడిలోని వామనమూర్తిపై రోజూ ఓ పాట పాడేవాడు. ఇలా పదేండ్లుగా చేస్తున్నాడు. ఒక కార్తిక మాసపు శుక్లపక్షఏకాదశిరాత్రి వాద్యాన్ని పట్టుకొని,



## గరుడవాహనం

**బ్రహ్మోత్సవాలలో పద్మావతీదేవి ఆరవనాటిరాత్రి గరుడవాహనంపై ఊరేగుతుంది. గరుడుడు నిత్యసూరులలో అగ్రేసరుడు. 'వేదాత్మా విహగేశ్వరః' అని శ్రుతి ప్రబోధిస్తూంది. గరుడుని రెండురెక్కలు జ్ఞానవైరాగ్యాలకు చిహ్నాలుగా సంప్రదాయజ్ఞులు సన్నుతిస్తున్నారు. శ్రీవారికీ, అమ్మవారికీ నిత్యవాహనం గరుడాళ్వార్లు.**



దేవాలయాలలో మనం వెలిగించే దీపం వందసంవత్సరాల పుణ్యం

స్వామిని సేవించడానికి పోతుంటే, దారిలో ఒక బ్రహ్మ రాక్షసుడు దాసరిని పట్టుకొని బంధించాడు. ఆ రాక్షసుడు పదిరోజులనుండి నిరాహారిగా ఉన్నాడు. ఆకలితో ఉన్న ఆ రాక్షసుడు "భక్షిస్తా"నని చెప్పగా–

"అట్లే తిందువు గాని, ఒక చిన్నకోర్కెతీర్చితే– తాను ఆహారం కావడానికి ఎటువంటి అభ్యంతరం లే"దన్నాడు దాసరి.

"ఏమిటీ నీకోరిక!" అన్నాడు– రాక్షసుడు.

"ఈ దగ్గరలోని కుఱుంగుడిలో వెలసిన విష్ణువైన వామన మూర్తిమీద ఒకపాటపాడి రావడమే! అంతకంటే, వేరే పనేమీ లేదు." అన్నాడు– దాసరి. రాక్షసుడు మొదట ఒప్పుకోలేదు. దాసరి ఎన్నో విధాలుగా చెప్పిచూచి, చివరికి దేవునిమీద ఒట్టు పెట్టుకున్నాడు.

**"నేను గుడికి వెళ్ళి, పాటపాడి తిరిగి రాకపోతే, వాసు దేవుని విడిచి, వేరే ఇతరదేవతల్ని ఉపాసించేవారు ఎటువంటి దుర్గతుల పాలవుతారో ఆ దుర్గతికిపోతాను. నారాయణుని తక్కిన దేవతలలో తుల్యత్వం కల్పించినవారు ఏ పాపాన పడిపోతారో నేను తిరిగి రానిపక్షంలో ఆ పాపానపోతాను' అన్నాడు.**

దానితో చలించి, బ్రహ్మరాక్షసి దాసరిని బంధవిము క్తుణ్ణి చేసి పోయిరమ్మన్నాడు. దాసరి త్వరత్వరగా వెళ్ళి, కైశికీగానం చేసి, తిరిగి రాక్షసునివద్దకు వస్తుండగా, భగ వంతుడు దాసరిని పరీక్షించాలని భావించి, రాక్షసివద్దకు పోవద్దని సలహాయిస్తాడు. దానికి దాసరి తాను మాట తప్పనని చెప్పగా స్వామివారు 'నీవు ఏదైతే నిశ్చయించినావో దానికి మంగళమగుగాక!' అని ఆశీర్వదించాడు.

దాసరి రాక్షసునివద్దకు వచ్చి, తనశరీరాన్ని ఆహారంగా స్వీకరింపుమన్నాడు. దానికి రాక్షసుడు, ఓదాసరీ! నీవు నా శుభం కోరేవాడివైతే ఈ తెల్లవారుజామున పాడిన గానఫలాన్ని నాకు ధారబోయమన్నాడు. దానికి, దాసరి 'అది అసంభవం' అన్నాడు. పాటలో సగంఫలమైనా ఇవ్వు అన్నాడు. దానికీ 'ససేమిరా' అన్నాడు– దాసరి. పోనీ, చిట్ట చివరిపాదంయొక్కఫలాన్నైనా ఇమ్మని ప్రాధేయపడ్డాడు. అంత దాసరి నీకీ జన్మ ఎలా వచ్చిందో చెప్పుమని అన్నాడు.



అతడు తాను చరకగోత్రంలో జన్మించిన సోమశర్మ అనే బ్రాహ్మణు డననీ, యజ్ఞమధ్యంలో శూలదోష హతుడైన కారణంచే ఇటువంటి జన్మ వచ్చిందని చెబుతాడు.

అది విన్న నంపాదువాన్– 'నీవు కోరినట్లే పశ్చిమగీతమైన కైశికీగాన ఫలమిచ్చి నిన్ను పాపం నుండి విముక్తుణ్ణి చేస్తున్నాను.' అని దాని ఫలం ధారపోయగా బ్రహ్మరాక్షసి సోమశర్మగా స్వస్వరూపాన్ని ధరిం చాడు. ఇది కైశిక పురాణంలోని కథ! ఈ పురాణకథాప్రయోజనం కైశికీ గాన మాహాత్మ్యం చెప్పడం!

బాలప్రబోధం

# బాలకమలాలకు ఆధ్యాత్మికతే ఆదిత్యుడు

– డా।। కలువగుంట రామమూర్తి,
92474 99120

బాల్యం పరమాత్మ ప్రసాదించినవరం. పిల్లల మానసాలు మానససరోవరాలు. పసిహృదయాలు కల్లా కపటం తెలియని తెల్లనికాగితాలు. వాళ్లవదనాలు– కళలు తరగని చంద్రబింబాలు. మసకబారనిదర్పణాలు. పెరుగుతున్న మొక్కలు. విచ్చుకుంటున్నరెక్కలు. విస్తరిస్తున్న దిక్కులు. పిల్లలు ఎదుగుతున్నఎదలకు ప్రతీకలు. ఆ మొగ్గలు జ్ఞాన కిరణాలతో వికసించాలి! భావిభారతపౌరులు కానున్న పిల్లలకు ఆధ్యాత్మికజ్ఞానాన్ని పసితనంనుంచే ప్రబోధించడం అత్యంతఆవశ్యకం.

**ఈనాటి బాలలే**
**రేపటిపౌరులు, పాలకులు, ఏలికలు,**
**సేవకులు, రక్షకులు,**
**శిక్షకులు, దేశకీర్తి ప్రతిష్ఠలు.**

ఆత్మప్రబోధాన్ని వినడమే ఆధ్యాత్మికత అంటే – మనుష్యులు మనుష్యుల్లాగా జీవించడం. పశువులుగా, రాక్షసులుగా మారిపోకుండా మనుగడ సాగించడం. సంస్కారం అనే మాటకు సంస్కరించుకోవడం అని అర్థం. ప్రకృతిసిద్ధంగా ఉన్న కొన్ని బలహీనతలు, సంకుచిత స్వార్థభావాలు పిల్లలకు సంక్రమించకుండా చూచుకోవడం. ఒక్కమాటలో చెప్పాలంటే అన్నిఅనర్థాలకు మూలకారణమైన అజ్ఞానాన్ని తొలగించుకోవడం–జ్ఞానజ్యోతుల్ని వెలిగించుకోవడం ***"తమసో మా జ్యోతిర్గమయ। అసతో మా సద్గమయ। మృత్యో ర్మా అమృతం గమయ।"*** అని ధ్యానిస్తూ శాంతిని సముపార్జించుకోవడం అదే ఆధ్యాత్మికత!

***'మాతృదేవో భవ! పితృదేవో భవ! ఆచార్యదేవో భవ!'***– అనే ప్రాథమికజ్ఞానం పిల్లలకు అలవడాలి. తద్వారా తల్లిదండ్రులు, గురువులు బోధించే సుగుణాలు పిల్లలకు మార్గదర్శకాలౌతాయి. ఉత్తముడికి, అధముడికి ఉన్న భేదం భావాలనుబట్టే ఏర్పడుతుంది. ఉన్నతమైన, సున్నితమైన భావాలు ఒంటబట్టినప్పుడు ఆ పిల్లలు ఉత్తమపౌరులుగా తయారవుతారు. భావాన్నిబట్టే బాహ్యపరిస్థితులు రూపొందుతాయి.

***"ఆత్మవత్ సర్వభూతాని"*** – నిన్ను నువ్వు ఎలా ప్రేమించుకుంటావో అలాగే సాటివారిని, సర్వప్రాణుల్ని ప్రేమించు– ఈ సుగుణం పిల్లలకు కలిగించగలగాలి. దాంతో మానవత్వం వర్ధిల్లుతుంది.

***'అహింసః పరమో ధర్మః'*** అన్న సుగుణం అలవడితే ప్రేమతత్త్వం పరిఢవిల్లుతుంది. అశ్రుపాతాలు, రక్తపాతాలు, ఆర్తనాదాలు, హాహాకారాలు సమాజంనుండి దూరమైపోతాయి.

***'వసుధైకకుటుంబం'***– ఈ భూమండలం అంతా ఒకే కుటుంబం. భూమిమీద మనుగడ సాగిస్తున్న వారంతా మనకుటుంబసభ్యులే! అనే ఆలోచన దృఢపడినప్పుడు ఇతరులమీద ఏర్పడే అసూయాద్వేషాలు పిల్లల్లో అంతరించిపోతాయి.




ఒకసారి వ్యాసభగవానుణ్ణి సామాన్యు డొకడు "స్వామీ! వేదాలు, పురాణాలు, శాస్త్రాలు, ఇతిహాసాలు, ఇతర కావ్యాలలోని లక్షలాదిశ్లోకాలను చదివి అర్థం చేసు కునే జ్ఞానం లేదు. మానవజీవితపరమార్థాన్ని ఒక్కశ్లోకంలో వివరించండి" అని ప్రార్థిస్తాడు. కరుణాంతరంగుడైన ఆ మహా కవి ఒక్కశ్లోకంకూడా అవసరం లేదు. నీకు అర్ధశ్లోకంలో బోధిస్తాను అంటూ-


శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః,
పరోపకారః పుణ్యాయ- పాపాయ పరపీడనమ్।

- అని ప్రబోధిస్తాడు. *"పరోపకారం పుణ్యం. పరాపకారం పాపం."* దీన్ని అనుసరించు. ఇంకేవీ చదువ నక్కరలేదు- అంటాడు. ఈ సత్యాన్ని పిల్లలహృదయాలలో స్థిరపడేలా చేయాలి.

*'దైవప్రీతి-పాపభీతి'* పిల్లలకు ఏర్పడాలి. మనల్ని నిరంతరం పరమాత్మ పరిశీలిస్తున్నాడు. మనం చేసే పాపా లకు ప్రతిఫలం మన జీవితంలోనే మనం అనుభవించాల్సి వస్తుంది. లోకంలోని అభాగ్యులంతా తాము చేసుకున్న పాపాలఫలితాల్ని శిక్షలుగా అనుభవిస్తున్నవారే! అనే పరిజ్ఞానం పిల్లల్లో వృద్ధి పొందాలి.

అన్నిటికంటే ముఖ్యమైంది, అత్యంతసత్యమైంది అయిన ఆధ్యాత్మికరహస్యం ఏమిటంటే సర్వాంతర్యామి అయిన పరమాత్మ చరాచరప్రకృతిలో అణువణువులో నిండి ఉన్నాడని, ప్రతిప్రాణిలోను జీవశక్తిగా కొనసాగుతున్నా డని, తెలుసుకున్నప్పుడు ప్రతిమనిషిలోనూ అంతర్యామిగా ఆత్మ రూపంలో పరమాత్మ నివసిస్తున్నాడన్న





## సూర్యప్రభవాహనం

**సూర్యప్రభవాహనసేవలో అమ్మవారిదర్శనం ఆరోగ్యం, ఐశ్వర్యం, సత్సంతానం, సుజ్ఞానం మొదలైన ఫలాలను పరిపూర్ణంగా ప్రసాదిస్తుంది. అనంతకోటి కిరణాలతో సకలజీవరాశిని రక్షించే సూర్యునిలాగా, అమ్మవారు అనంతవరప్రదాత్రియై, సర్వలోకశరణ్యయై సూర్యప్రభవాహనంపై శోభిల్లుతూంది.**

ఆధ్యాత్మికసత్యం పిల్లలకే కాదు, పెద్దలకుకూడా స్థిరంగా ఏర్పడుతుంది. అక్షరం రాని అనాగరకుడుకూడా ఒక పనిని చేయడానికి తలపెట్టినప్పుడు 'అంతర్యామి అయిన ఆత్మ- ఇది తప్పు ఇది ఒప్పు ఇది పాపం ఇది పుణ్యం ఇది అధర్మం- ఇది ధర్మం' అంటూ హెచ్చరిస్తూనే ఉంటుంది. ప్రబోధిస్తూనే ఉంటుంది. దీన్ని పెడచెవిని పెట్టడమే ఆత్మసాక్షికి విరుద్ధంగా ప్రవర్తించడం!

ఈ ఆత్మప్రబోధాన్ని పిల్లలు తు.చ. తప్పకుండా పాటించగలిగేలా చేయాలి. ప్రతిమనిషిహృదయంలోనూ చిత్రంగా, గుప్తంగా ఉన్న 'చిత్తగుప్తుడు'. మనం చేసే ప్రతి పనిని చిత్రాలతో పాటు గుప్తంగా చిత్రీకరిస్తూ ఉంటాడు. ఈ ఆధ్యాత్మికజ్ఞానాన్ని, ఋషులప్రబోధాన్ని పిల్లలూ, పెద్దలు ప్రగాఢంగా విశ్వసించగలిగినప్పుడు సమాజంలో శాంతి భద్రతలు విరాజిల్లుతాయి. లోకకల్యాణం సిద్ధిస్తుంది.

# తిరుపతి యాత్ర పూర్తి కావాలంటే...

– డా॥ ఈమని శివనాగిరెడ్డి, 98485 98446



అలర్మేల్‌మంగాపురం చూడందే తిరుపతియాత్ర పూర్తి కాదంటారు. అలర్ అంటే 'పువ్వు' అనీ, మేల్ అంటే 'మీద ఉన్న' అనీ, మంగ అంటే 'మగువ' అనీ, అలర్మేల్ అంటే, పువ్వుమీద ఆసీనురాలైన యువతి అనీ, ఆమె ఎవరో కాదు సాక్షాత్తు లక్ష్మీదేవి అని పెద్దలంటారు. పద్మాన్ని ఆసనంగా చేసుకొంది గాబట్టి ఆమెకు పద్మావతి అని పేరు వచ్చింది. ఆకాశరాజు కూతురుగా జన్మించిన పద్మావతిని శ్రీనివాసుడు పెళ్లి చేసుకొన్నా డనీ, పెళ్లైన తర్వాత, వారికి కనిపించిన అగస్త్యమహాముని, కొత్తదంపతులు ఆరునెలల పాటు కొండ ఎక్కరాదనే నియమం పెట్టడంవల్ల, ఆ దంపతులు శ్రీనివాసమంగాపురంలో ఆ ఆర్నెల్లూ కాలం గడిపారనీ, అందుచేత శ్రీవారిని కల్యాణవేంకటేశ్వరుడంటారనీ, రాను రానూ ఆ ప్రదేశం శ్రీనివాసమంగాపురంగా పిలువబడిందనే ఐతిహ్యం ప్రచారంలో ఉంది. తొలుత పద్మావతికి ఇక్కడే ఆలయముండేదనీ, తర్వాత తిరుచానూరులో కొలువైనందున తిరుచానూరుకు అలమేలుమంగాపురమనే, పేరువచ్చింది.

కీ.శ. 8వ శతాబ్ది నాటికి, తిరుపతికి 3 కి.మీ. దూరంలో సువర్ణముఖీనదీతీరాన గల ఈ ఊరికి శుకమహర్షి తపస్సు చేయడం వల్ల తిరుశుకనూరనీ, క్రీ.శ. 16–15 శతాబ్దాలమధ్యశాసనాల్లో చిరుచ్చుగనూరు అనీ, తిరుచ్చొగనూ రని పేర్కొనబడింది.

శ్రీపద్మావతీదేవి, కరివేపాకు తెచ్చుకోవటానికి, తిరుచానూరుకు వచ్చి, ఇక్కడనే శిలగా మారిపోయిందనీ, ఆ శిలపై కట్టిన దేవాలయమే పద్మావతిదేవిఆలయంగా పేరొందిందనే కథ ప్రచారమైంది. ఎన్నికథలు, గాథలు ప్రచారమైనా, తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణీ, తిరుపతి గోవిందరాజస్వామినీ దర్శించుకొన్నభక్తులు తిరుచానూరులోని పద్మావతిఅమ్మవారిని దర్శించుకోకపోతే, వారి తిరుపతియాత్ర పరిపూర్ణం కాదన్న పెద్దలమాటతో, తిరుమల తిరుపతియాత్రికులు అలమేలుమంగాపురంలోని పద్మావతీదేవిఅమ్మవారిని విధిగా దర్శించుకొనే ఆచారం అనాదిగా వస్తూంది.

ఒకప్పుడు శ్రీవారిధాన్యాగారంగా పేరొందిన ప్రస్తుత పద్మావతీదేవాలయం విశాలప్రాంగణంలో నిర్మించబడింది. ముందుగా ఐదంతస్తుల రాజగోపురంలోకి ప్రవేశించినభక్తులకు చల్లగాలులు ఆహ్వానం పలుకుతాయి. సాగి, లోనికి వెళ్లగా ఎదురుగా వరదరాజస్వామి, శ్రీకృష్ణ, బలరామాలయాలు, కుడివైపున మహావిష్ణుఆలయం, ఎడమవైపున పద్మావతిదేవిఆలయం దర్శనమిస్తాయి. శ్రీకృష్ణాలయం, గర్భాలయం, అర్ధమండపం, మహామండపాలతో అలరారుతుండగా, పద్మావతీఅమ్మవారిఆలయంకూడా గర్భాలయ, అర్ధమండప, ధ్వజస్తంభ, బలిపీఠాలతో, వాహనాలయంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడింది. కొలువైన అలర్మేల్‌మంగతాయారు, పద్మావతిదేవి, పద్మపీఠంపై, పద్మాసనంలో చేతుల్లో పద్మాలు ధరించి, సర్వాలంకారశోభితగా భక్తులకోరికలను తీరుస్తూంది.

ఆలయంలో ఇంకా శ్రీదేవీ, భూదేవులకుకూడా ప్రత్యేకాలయాలుండి, ఆధ్యాత్మికశోభ సంతరించుకొంది. చుట్టూ విశాలమైన, ఎత్తైనప్రాకారం, వెనుకవైపు కోనేరు, మధ్యలో నీరాళి మండపం నిర్మించబడినాయి. తొలుత శ్రీవారివక్షఃస్థలంపై కొలువు

దీరిన లక్ష్మీదేవి, అటు తరువాత శ్రీవారిఆలయంవంటశాలలో స్థిరనివాసమేర్పరచుకొందని అన్నమయ్య 'వాలినరాజసముతో వంటశాలలోనే, మేలిమిగ గూచున్న దలమేలుమంగ' అనీ, 'కంటి శుక్రవారము గడియలేడింట, అంటి అలమేల్మంగ అండ నుండే స్వామిని' అని తిరుమలలోని అలమేలుమంగ (పద్మావతి అమ్మవారిని)ను అర్చించటం గమనించాల్సినవిషయం.

కార్తికశుక్లపక్ష పంచమీశుక్రవారం, ఉత్తరాషాఢ నక్షత్ర శుభదినాన పుట్టిన పద్మావతీదేవికి, శ్రీపాంచరాత్రాగమశాస్త్ర సంప్రదాయంరీత్యా అలమేల్మంగాపురంలో పద్మావతీదేవీబ్రహ్మో త్సవం పరమవైభవోపేతంగా జరుగుతుంది. భగవత్ప్రార్థన, అంకురార్పణం, ధ్వజారోహణం మొదలుగా గల 21 క్రియలున్న బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవం తరువాత హవిర్నివేదనం, క్షమా ప్రార్థనంతో ముగుస్తాయి. జగన్మాత అయినపద్మావతీదేవికి చాంద్రమానప్రయుక్త జ్యేష్ఠమాసపూర్ణిమకు పంచాహ్నికం (ఐదు రోజులపాటు)గా తెప్పోత్సవం అంగరంగవైభవంగా జరుగు తుంది. శ్రీప్రశ్నసంహితలో– 'శైశిరే గ్రీష్మకాలే వా శుక్లపక్షే శుభే దినే' వాసరే పూర్ణిమాయాం వా కర్తవ్యస్తు ప్లవోత్సవః' అని చెప్పడంవల్ల తిరుచానూరుకోనేరులోని తీర్థమండపాన్ని కదలీస్తంభచందనతోరణవితానచిత్రవస్త్రపుష్పమాలలతో అలం కరించి, 'తత్ర పూజాం విశేషేణ కృత్వా దేశికసత్తమః, నివేదయే త్తతోఽన్నాద్యం' అనే శాస్త్రోక్తిరీత్యా విశేషపూజలు నిర్వహించిన తరువాత పానకనారికేళ సలిలాలను, ఏలాలవంగజాజీఫలాది భక్ష్యభోజ్యాదిహవిస్సులను నివేదించి, శిల్పిచేత శాస్త్రసమ్మతంగా నిర్మించిన, అలంకరింపబడిన తెప్పను పుణ్యాహజలంతో శుద్ధి చేసిన తరువాత, కోనేరులోని నీటిని అభిమంత్రించి, తెప్పలో భూమినీ, విమానంలో శేషుణ్ణీ ఆవాహనం చేసి, వరుణదేవుణ్ణీ ఆహ్వానించి, పద్మావతిఅమ్మవారితెప్పోత్సవాన్ని జ్యేష్ఠపూర్ణిమ నాడు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిచక్రస్నానం సంద ర్భంగా వేలసంఖ్యలో తిరుచానూరు పుష్కరిణిలో స్నానం చేస్తారు.

తిరుచానూరు పద్మావతిఅమ్మవారిబ్రహ్మోత్సవాల సందర్భంగా మరో విశేషప్రక్రియ జరుగుతుంది. తిరుమలనుండి అమ్మవారికి తులసి, పచ్చిపసుపుముద్ద, పట్టుపీతాంబరాలు, ప్రసాదాలు తీసుకొని, తిరుపతిపురవీథుల్లో త్రిప్పి, తిరుచా నూరుకు తెచ్చే ఆచారం ఇప్పటికీ కొనసాగుతుంది.

పద్మావతిఅమ్మవారి ఆలయానికి సంబంధించిన ఒక శాసనంలో అమ్మవారు సాక్ష్యమిచ్చిన సందర్భం ఒకటుంది. తాళ్లపాక చిన్నన్న 'అన్నమయ్యచరిత్ర' వ్రాసినపుడు అతడే రాశాడని చెప్పుకొంటున్న ఒకశాసన నకలు ఒక తాళపత్రంలో ఉందని, దాన్ని 1940లో చిన్నన్నవారసుడైన సూర్యనారాయణ దేవస్థానం అధీనంలో శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయంలో నడు స్తున్న శ్రీవేంకటేశ్వరప్రాచ్యలిఖితభాండాగారం మరియు పరి శోధనసంస్థకు అందించాడనీ తిరుమల చరితామృతాన్ని వ్రాసిన పి.వి.ఆర్.కె.ప్రసాద్‌గారు ఉటంకించారు.

ఆ తాళపత్రగ్రంథంలో నేతనేసే సాలీలు, జాంద్రవారు తామే అలమేలుమంగవారసుల మన్న విషయంలో, వారిద్దరిమధ్య ఒక వివాద మేర్పడింది. రెండువర్గాలవారు పండితుడైన తాళ్ల పాక చిన్నన్నకు మొరపెట్టుకొని, తీర్పు ఇవ్వమని ప్రాధేయపడి నారు. చిన్నన్న పద్మావతీదేవిని ప్రార్థించి, సమస్యకు పరిష్కారం చెప్పమని వేడుకోగా, సాలీలే నాకు వారసులని చెప్పిందని, ఆమెఆదేశానుసారం సాలీలే అమ్మవారివంశీకులనే నిర్ణయాన్ని ప్రకటించాడు.

ఆనాటినుంచి వీరిని పద్మసాలీలని పిలుస్తున్నా రని వినికిడి. తీర్పునకు సంతోషించిన పద్మసాలీలు, తాళ్లపాక చిన్నన్నకు 20000 వరహాలు కానుకగా ఇచ్చి, ఆ డబ్బుతో ఆళ్లగట్టులో స్థలంకొని, శ్రీనివాసునికి ఒక ఆలయాన్ని నిర్మించ మని వేడుకొన్నారనీ, వారికోర్కెమేరకు తొండవాడసమీపంలో ప్రస్తుత రహదారిప్రక్కనున్న మొండిగోపురమున్నచోట ఆ ఆలయం ఉండేదనీ, దాన్ని తిమ్మప్ప ఆలయమని పిలుస్తారనీ, ఆ ఆలయం ఖర్చునిమిత్తం, పద్మసాలీలు, ప్రతిమగ్గానికి ఒక బంగారురూక వసూలు చేసి, కులపెద్దలు ప్రతిసంవత్సరం ఇవ్వాలనికూడా తీర్మానం చేశారు.

ఆ కులంలో వివాహం జరిగినపుడు, చిన్నన్నకు ఒక రూక చొప్పున ఇవ్వాలని, ఈ ఒప్పందం చిన్నన్నవారసులకు, కులపెద్దలవారసులకూ ఆ చంద్రతారార్కం కొనసాగుతుందనీ వ్రాసినరాగిరేకు క్రీ.శ.1543లో వ్రాయబడిందని పివీఆర్కే ప్రసాద్ తిరుమల చరితామృతంలో పేర్కొన్నారు.

ఇంత మహిమాన్వితమైన అమ్మవారిని భక్తులు తప్పక తిరుమల శ్రీవారితో పాటు సందర్శించి తరించండి!!

# ఇంట్లో...
# ఇక కనకవర్షమే!


- డా॥ మేడికుర్తి ఓబులేసు

శ్రీ శంకరులవారు భిక్షకై వెళ్లినప్పుడు ఒక పేదరాలి ఇంటిముందు నిల్చారు. శంకరుల్ని చూచి, ఆ గృహిణి ఏం చేయాలో తోచక బాధపడుతూంది. ఆమె దీనావస్థను గమనించిన ఆచార్యులవారు, ఆమెను పిల్చి, "అమ్మా! ఇంట్లో ఎక్కడో ఉసిరిక కాయ ఉంటుంది చూడు. ఆ కాయనే నాకు భిక్షంగా సమర్పించు" అన్నారు. ఆమె పరమభక్తితో వెదకింది. ఉసిరికకాయ లభించింది. ఆనందంతో, భక్తితో శంకరుల వారిభిక్షాపాత్రలో సమర్పించింది.

ఆమె భక్తితత్పరతను మెచ్చి, ఆచార్యులవారు శ్రీమహాలక్ష్మీదేవిని స్తుతించారు. వెంటనే, ఆ గృహిణిఇల్లంతా బంగారుఉసిరికలు వర్షధారలుగాపడ్డాయి. ఆమె ఆనందానికి హద్దుల్లేవు. (ఉసిరికలు) కనకధారలు ఆమెఇంట లక్ష్మీదేవి కురిపించి నందున ఈ స్తోత్రం **"శ్రీకనకధార స్తుతి"**గా ప్రసిద్ధికెక్కింది.

శ్రీలక్ష్మీదేవియే శ్రీపద్మావతీదేవి కనుక అమ్మవారికార్తికబ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ కనకధారాస్తుతిద్వారా మనకు అనుభవానికి వచ్చే శ్రీలక్ష్మీ తత్త్వాన్నీ, ప్రభావాన్నీ గ్రహించి, అమ్మవారి కృపకు పాత్రులమవుదాం!

శ్రీలక్ష్మీదేవి నిరంతరం శ్రీమన్నారాయణునివక్షఃస్థలంలో ఉంటుంది. శ్రీహరివద్దకు వచ్చేభక్తుల్ని స్వామివారిదయాపాత్రుల్ని చేయడంలో అవసరమైన సహాయ మంతా చేసి, స్వామివారి వద్దకు పంపి, వాళ్లు మనోరథసిద్ధితో, ఆనందంతో వెళ్లే టట్టుగా చేస్తుంది. అందుకే అమ్మవారికి 'పురుషకారిణి' అని పేరు. (పురుషకారం అంటే ప్రయత్నం అని అర్థం) ఆమె శ్రీవారిహృదయాన్ని అలంకరించడంవల్ల శ్రీవారిహృదయమే పద్మావతీదేవి. విశ్వంలోని సమస్తసంపదలకూ, ఐశ్వర్యాలకు ఆమే స్థానమైంది. ఆ తల్లికృపాకటాక్షాలు ఎవరిపై ప్రసరిస్తాయో వాళ్లు సమస్తశుభాలూ పొందుతారు. అమ్మవారి క్రీగంటిచూపులకే స్వామివారు పులకాంకితుడౌతాడు ఆ తల్లిచూపుల్లో అనురాగం, సిగ్గు, ముగ్ధత్వం మేళవించబడి ఉంటాయి.



అమ్మవారిదృష్టి ఒక్కసారి ఏ కొంచెంగా అయినా భక్తులపై ప్రసరిస్తే చాలు అందరూ క్షేమంగా, సంతోష హృదయులై ఉంటారు. ఆమెదృష్టి కల్యాణప్రదం! ఆమె త్రిలోకజనని. అందరిచేత ఆశ్రయించబడుతుంది. కనుక 'శ్రీ' అయ్యింది. శ్రీపద్మావతీదేవి శ్రీమన్నారాయణునికి ఆనంద కారిణి అయింది. లక్ష్మియే త్రిమూర్త్యాత్మిక. లక్ష్మి శ్రీహరికి నిత్యానపాయిని.

అందుకే నారాయణునివల్లభ, శార్ఙ్గాయుధుని పత్ని, దామోదరునిభార్య, నందాత్మజుడైన శ్రీకృష్ణునిప్రియ భార్య ఇలా ప్రస్తుతించబడుతుంది. ఆమె క్షీరసాగరకన్యక. ఈమెకు చంద్రుడు, అమృతం తోబుట్టువులు.

అమ్మవారు బంగారుతామరపీఠంపై అధివసించి ఉంటుంది. ఆమె భూమండలానికే నాయకురాలు. దయా గుణప్రపూర్ణ. ఆ తల్లి స్థిరనివాసం శ్రీమహావిష్ణువక్షః స్థలం. ఆమె సర్వదేవతార్చితురాలు. జగత్తుసృష్టికి కారణు రాలు. లక్ష్మి అంటే– సర్వాన్నీ దర్శించేది కనుక విశ్వాన్ని అనుగ్రహిస్తూంటుంది. సకలసంపదలూ కల్గించి, సామ్రాజ్య భోగాలుకూడా ప్రసాదిస్తుంది. సమస్తపాపాలు పోగొట్టి భక్తుల్ని శుద్ధాత్ములుగా చేసి, నారాయణునిదయాపాత్రుల్ని చేస్తుంది. అమ్మను త్రికరణశుద్ధిగా ఉపాసిస్తే సకల సంపదలూ సిద్ధిస్తాయి.


అమ్మవారిని ప్రాతఃకాలంలో స్తుతించాలి. దిగ్గజాలు బంగారుకుండలతో గ్రహించిన ఆకాశగంగాజలంతో అమ్మ వారికి ఇరువైపుల ఉండి, తొండాలతో పవిత్రసుగంధ జలంతో అభిషేకిస్తున్న రూపాన్ని భావించి, పూజించాలి.

అమ్మవారికి, లక్ష్మి, పద్మాలయ, పద్మా, కమల, శ్రీ, హరిప్రియ, ఇందిర, లోకమాత, మా, రమ, మంగళదేవత, భార్గవి, లోకజనని, క్షీరసాగరకన్యక మొదలైన పేర్లు ఉన్నాయి.

శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాల దివ్య సమయంలో శ్రీకనకధారాస్తుతిని భక్తిశ్రద్ధలతో పారాయణం చేసేవారికి అమ్మదయ సంపూర్ణగా లభిస్తుంది. ఈ దివ్య స్తోత్రాన్ని ప్రతిరోజూ భక్తితో స్తుతించేవారు సద్గుణవంతులై, అధికభాగ్యవంతులై, శాంతిసౌఖ్యాలతో అభ్యుదయభావ నులై, కుబేరసమానులై ధన్యులౌతారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం– మూడుసమయాల్లో పఠిస్తే 'అధికస్య అధికం ఫలం' ఎంతఎక్కువగా– అంటే ఎన్నిమార్లు ఎక్కువగా పఠిస్తే అంతఎక్కువ ఫలం సిద్ధిస్తుంది.

సాక్షాత్తు లక్ష్మీదేవి, మనల్ని రక్షించడానికి తిరుచా నూరులో శ్రీపద్మావతీదేవిగా అవతరించింది. ఇది పరమ సత్యం! మనభక్తిశ్రద్ధల్లో లోపం ఉండవచ్చు గానీ, అమ్మ దయలోమాత్రం పూర్ణత్వమే ఉంటుంది. ఆమె 'వాత్సల్యాది గుణోజ్జ్వల' కదా!

## చంద్రప్రభవాహనం



**సూర్యచంద్రులు స్వామివారికి రెండుకన్నులు. అంతేకాదు "చంద్రమా మనసో జాతః" అంటూ ఋషులు చంద్రుడు ఆపరమాత్మమనస్సునుంచి జన్మించినా డని అభివర్ణించారు.**

**అమ్మకు తమ్ముడుమామ. శ్రీదేవికి తోబట్టువుగా పుట్టాడు- చంద్రుడు. జగన్మాత మనందరినీ కన్నతల్లి! ఆమె తమ్ముడైనచంద్రుడు "అందరికీ చందమామ" అయ్యాడు. అందుకే క్షీరాబ్ధికన్యక అమ్మవారు తన తోబుట్టువు అయిన చంద్రునిప్రభలతో ఊరేగడం సోదరప్రేమకు నిదర్శనం- అంతేకాకుండా సృష్టిలోని ద్వైధీభావానికి ప్రతీక అయిన, చీకటివెలుగులరంగేళి రాయడు ఆచంద్రుడు. జీవితంలో క్షయవృద్ధులు, సుఖ దుఃఖాలు, ఉత్థానపతనాలు ఉంటాయనీ, వాటిల్ని పరమాత్మతోటిసంశ్లేషతో అధిగమిస్తుండాలని బోధించే తత్త్వం ఈ వాహనసేవలోని అంతరార్థం!**

శ్రీపద్మావతీదేవీకృపాకటాక్షసిద్ధి రస్తు

# వెలుగెందుకు కావాలి?

- బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

దీపావళికథ వినటానికి మనోహరంగానే ఉంటుంది. కానీ అంతరార్థమేమిటి? నరకాసురుడు చస్తే మనకందరికీ దీపావళేమిటి? దీపావళి అంటే దీపపంక్తి. అది మానవలోకానికే కాదు. మూడులోకాలకూ వెలుగు నిచ్చేది. వెలుగెందుకు కావాలి అసలు. చీకటి కమ్ముకొంటే, చీకటేమిటి? అసలైనచీకటి మనలో పేరుకొన్నఅజ్ఞానం. అది అందరికీ ఉంది. గుణత్రయానికి సంకేతమేగదా ఈ త్రివిధసృష్టి, కాబట్టి అంతో ఇంతో అజ్ఞానమందరికి సహజం. ఈ అజ్ఞాన మనే అంధకారానికి సంకేతమే నరకుడు.

ముక్తి లభించేవరకూ చావనితత్త్వమేదో అది జీవభావం. జీవుడు నరుడైతే జీవుడికున్న అజ్ఞానం నరకుడు. ఇది సురకాదు. అసుర. స్వరూపంతో రాజిల్లేది సుర. అంటే జ్ఞానం. అది లేకుంటే అసుర. అజ్ఞానమున్ననరుడు అసురుడు కాక సురుడెలా కాగలడు? అంటే మన బోటి జీవులే నరకాసురులు. ప్రాగ్జ్యోతిషమే మననివాసస్థానం. ప్రాక్కంటే ప్రాచీనం. పురాతనంనుంచీ ఉంది- మనలో ఆత్మ చైతన్యజ్యోతి. అందులోనే ఉన్నాం మన మసలు. అప్పుడే కాదు ఇప్పుడూ- అయితే గుర్తించలేకపోతున్నాం. అందుకే నరకాసురులం.

మనజన్మ ఎలాంటిది? సనాతనమైన పరమాత్మ అంశోద్భవులమే మనం. అయితే దివ్యమైన ఆ చైతన్యజ్యోతికి భూసంపర్కమేర్పడింది. ఈ దివ్యభౌమసంబంధమే మనం నరకులం కావటానికి కారణం. దివ్యం మనలో ఉన్న చైతన్య కళ. అయితే భౌమం మన కేర్పడ్డ ఈ అచేతనమైన శరీరాది సంఘాతం. ఈ ఉపాధిప్రచోదనతో ఎంత బుద్ధిబలంతో ఎన్నిశక్తులు సాధించినా అసురవాసనలు వదలవు. అవి రజస్తమనస్సులను ప్రబలం చేసి, సత్వానికి దూరం చేస్తాయి వీణ్ణి. దేవతలను, మహర్షులను నరకుడు బాధించాడంటే సత్వగుణాన్ని కోలుపోయాడనే అర్థం. పోతే అదితికుండ లాల నపహరించాడు వాడు. దితి కానిదేదో అది అదితి. దితి అంటే ఖండం. అపూర్ణం. అదితి అంటే అప్పటికి పూర్ణమైంది ఆకాశతత్త్వం. దానికున్న కుండలాలేవో కావు.



తేజోమయులైన సూర్యచంద్రులు. సూర్యచంద్రులంటే మనః ప్రాణాలూ లేదా జ్ఞానక్రియాశక్తులు. అది అసురబలంతో కాజేసినా అవి వాడికి దక్కవు. ఉపయోగపడవు.

కనుకనే, ఆ అసురభావాన్ని శిక్షించదలచాడు పర మాత్మ. అసురుణ్ణి కాదు. అసురభావాన్ని. అంటే మాన వుడిలో పేరుకొని ఉన్న రజస్తమోగుణాలను, ఎవరు నిర్మూ లించాలది పరమాత్మే. ఆయన శుద్ధసత్త్వోపాధి అయిన ఈశ్వరుడు. కృష్ణరూపంలో ఉన్నాడు- ద్వారకలో. ద్వారక ఈ శరీరమే. నవద్వారమైన పురమిది. ఇందులో ఉన్న అంతారాత్మే కృష్ణుడు.

కర్షతీతి కృష్ణః-లాగిపారేస్తాడు ఈ అసురసంపదను. దేనితో సత్యభామాసహాయంతో. సత్యమైన భా సత్యభా. అనశ్వరమైన చైతన్యదీప్తి. అదే పరమాత్మకు నిత్యసిద్ధమైన ఐశ్వర్యం. సంపద. ఆ యోగమాయాప్రభావంతో దండెత్తి వస్తాడు ఈ నరకుడి మీదికి. వీడిలో పాతుకొని పోయిన అసురగణాలను తుడిచివేస్తాడు. దాంతో పరిశుద్ధుడై నరకుడు సహదేవుడౌతాడు. "దేవేన సహవర్తతే ఇతి సహదేవః"- దైవసంపదనంటిపెట్టుకొన్నవాడని భావం. అలా పట్టుకొంటే వాడికీ భూసంబంధమైన వాసనలు నశించి, వెంటనే తన ప్రాగ్జ్యోతిషం గుర్తుకు వస్తుంది. మరలా తన చిత్స్వరూపాన్నే తానందుకొని స్వరాజ్య సుఖమనుభవిస్తాడు.

స్వప్రకాశశీలమైన తన ఆత్మచైతన్యమే దీపం. ఎడ తెగకుండా అది అనుసంధానమౌతూపోతే అది దీపావళి. అనాదికాలప్రవృత్తమైన అజ్ఞానతమస్సును పారదోలే తారావళి. త్రిగుణాత్మకమైన సృష్టికంతా జవాబు చెప్పే త్రిలోక హారావళి. అమావాస్యనాడే రావాలది- మనకు.

**అమా అంటే 'దాంతో పాటు', వాస్య అంటే 'వసించటం'. చంద్రుడు సూర్యుడిలో చేరి, సూర్యుడితో పాటు వసించే రోజు కాబట్టి అమావాస్య అన్నారు- దాన్ని. అది లౌకికమైతే లోకోత్తరమైన అమావాస్య ఇది. సూర్యుడు స్వయంప్రకాశమైన పరమాత్మచైతన్యం. చంద్రుడు జీవుడే. ఉపాధి ఆయనమనస్సు. ఈ మనస్సు ఆ పరమాత్మ చైతన్యంలో లయమై జీవుడికి జీవభావం పోయి, దైవ భావం సిద్ధించటమే నిజమైన అమావాస్య. కనుకనే అది అంధకారం కాదు. జ్ఞానప్రదీపకాంతిలో మునిగి దీపావళిగా మారింది.**

జాగ్రదాది దశలు మూడింటినీ దాటి తురీయమైన చతుర్దశి నందుకుంటే గాని అమావాస్యను చూడలేం. దాన్ని చూస్తేగాని దీపకాంతికి నోచుకోలేం. కనుకనే చతుర్దశినాడు మనలో ఉన్న నరకాసురుణ్ణి వధించాలి- మనం. అమావాస్య నాడు జ్ఞానదీపాన్ని వెలిగించాలి. అందుకు ఆ యోగీశ్వరేశ్వరుడైన పరమాత్మ తోడుపడాలి.

## రథోత్సవం

**మనోరథాన్నిబట్టే రథం పయనిస్తుంది. పయనాన్నిబట్టే గమ్యం ఎదురవుతుంది. రథం పయనించేది రాజమార్గాలలోనే కానీ అరాచక మార్గాలలో కాదు. ఘంటాపథాలలో సాగేరథాలు మాత్రమే రసరాజధానులను చేరుకోగలుగుతాయి. కంటక పథాలలోకి, సంకటపథాలలోకి మన తనువనేరథాన్ని అశ్వాలు లాగి వేస్తున్నాయంటే - సారథి సారహీనుడైనట్లే! వాడికి సూచన లిచ్చేందుకు రథిస్థానంలో భగవంతుడు లేనట్లే! భూగోళం అమ్మకు రథం అమ్మవారు దానిపై ఊరేగేపెండ్లికూతురు.**

**శరీరానికి మనం అలంకరించుకునే వన్నీ రథానికున్నపసిడికుండలు, పట్టుకుచ్చులులాంటివి. ఎదలో మాధవుని నిలుపుకున్న రథాలమనోరథాలు మాత్రమే శుభమయ పథాలవెంట పయనించగలుగుతాయి.**



# సామాజిక వనంలో కార్తిక జన భోజనాలు

– శ్రీమతి పూర్ణిమాస్వాతి గోపరాజు

**చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో బంధుమిత్రులతో కనీసం కుటుంబసభ్యులతో కలసి వనభోజనాలకు వెళ్లి, స్నేహంగా, ప్రేమగా, సమైకృతాభావంతో జరుపుకుంటే... ఆత్మీయానుబంధాలు పెనవేసుకుంటాయి. మానవసంబంధాలు బలపడతాయి.**

కార్తికమాసంలో ప్రతిఇల్లూ ఓ గుడిగా, ప్రతిగుడీ ఓ పుణ్యక్షేత్రంగా మారిపోతుంది. అంతేకాదు, ఏడాదిలో ఎప్పుడు కుదిరినా కుదరకున్నా బంధువులను, ఆప్తమిత్రులను కలిసి వారితో సమయం గడిపేందుకు కార్తిక వనభోజనాలు మంచి ఆటవిడుపు. పూర్వం సూతమహర్షి ఆధ్వర్యంలో నైమిశారణ్యంలో మునులందరూ వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

పూర్వం ఆ మహర్షులు ఆచరించిన కార్తికవనభోజనాల కార్యక్రమాన్ని ఇప్పటికీ మనందరం ఏర్పాటు చేసుకుంటున్నాం. నలుగురితో కలిసి మెలిసి సంతోషంగా వేడుకలు జరుపుకొంటూ ఆనందిస్తున్నాం. ప్రత్యేకించి ఆదివారాలు, ఇతర సెలవుదినాల్లో కార్తికవనభోజనాలు సమీపఉద్యాన వనాలలో, తోటల్లో, నదీప్రాంతాల్లో, సముద్రతీరప్రాంతాల్లో జరుపుకుంటారు.

వనభోజనాలు మనలోని కళాప్రావీణ్యప్రదర్శనకు వేదికలు. భోజనాలకే పరిమితం కాకుండా, అందరూ కలిసి, ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ, కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా, ఆనందంగా గడిపేందుకు ఇది ఒక చక్కటివేదిక.

**మంచు కురిసేసమయంలో ఉసిరిచెట్టు క్రింద శ్రీమహావిష్ణువును పూజించి, వండిన ఆహారాన్ని ఆ చెట్టు క్రిందే ఆరగిస్తే-కార్తికమాసంలో గొప్ప పుణ్యఫలం దక్కుతుంది.**



## కార్తికమాసంలోనే ఎందుకంటే..?

**కార్తికమాసపురోజుల్లో బయట గడిపేందుకు వాతావరణం అనువుగా ఉంటుంది. వర్షాలు అప్పటికి తగ్గుముఖం పడతాయి. కాబట్టి క్రిమికీటకాలబెడదకూడా అంతగా ఉండదు. చెట్లన్నీ పచ్చగా కళకళలాడుతూ ఉంటాయి. అలాంటి ఆరుబయలు ప్రదేశంలో అందరూ కలిసి, అక్కడే వంటలు వండుకుని తినడం మరీ మంచిది. కుదరనిపక్షంలో అందరిఇళ్లనుంచి తెచ్చిన వంటకాలను ఒకరితో ఒకరు పంచుకుని తినడంకూడా స్నేహపరిమళాలు ఆస్వాదించడానికి అనువుగా ఉంటుంది. అందరూ కుటుంబాలతో సహా వెళ్లడం, చెట్లకింద రకరకాలవంటలు వండుకుని తినడం ఒక దివ్యఅనుభవం. మానవ సంబంధాలను మెరుగుపరచేమాసం కార్తికం!**

## సామాజిక కోణం

**వనభోజనాలు సంప్రదాయమే కాదు- అందులో సామాజికకోణమూ ఉంది. స్నేహాన్ని, సమైక్యతను పెంచేదే ఈ కోణం. అంతస్తుల తారతమ్యాలు లేని సమైక్యతాభావం ఈ సహపంక్తిభోజనాల్లో వెల్లివిరుస్తుంది. ప్రకృతిని, పర్యావరణాన్ని రక్షించే క్రమంలో వనభోజనాలు జనభోజనాలుగా వర్ధిల్లుతాయి.**

మన పూర్వికులు ప్రకృతినే పూజించేవారు. వారిదృష్టిలో తమకు ఆహారాన్నీ, నీడనూ, నారబట్టలనూ అందించేవృక్షాలు గొప్పదేవతలు. ఫలం, పుష్పం, పత్రం లేకుండా మన పూజలు సంపూర్ణం కావు. సంస్కృతి ముందుకు సాగినా భారతీయులు ఆనాటి మూలాలను మరచిపోలేదు. మనిషి ఎంతగా ఎదిగినా ప్రకృతికి లోబడక తప్ప దని భారతీయులకు తెలుసు. అందుకే వృక్షాలనుకూడా దేవతార్చనలో భాగం చేశారు. అలాంటి వృక్షాలలో ప్రధానమైన ఉసిరికకు కార్తికమాసంలో ప్రాధాన్యతనిచ్చారు. ఈ మాసంలో ఉసిరికచెట్టును సాక్షాత్తూ విష్ణుమూర్తిగా భావించి పూజించాలి.

ఆరుబయల్లో అందరూ కలిసి వంటలు వండు కోవడానికైనా, ఔషధ భరితమైన ఉసిరివంటిచెట్లగాలిని పీల్చు కోవడానికైనా వనభోజనాలు సరైన సందర్భాలు. ఎక్కడపడితే అక్కడ వన భోజనాలు అంత ఆరోగ్యకరం కాదు కాబట్టి ఉసిరికచెట్టు ఉన్నవనం ముఖ్యం అన్నారు-పెద్దలు.

వినోదం, ఆరోగ్యం, ఆధ్యాత్మికం, సామాజికం... ఇలా ఏ కోణం లోంచి చూచినా వనభోజనాలకు సాటి మరో సందర్భం కన్పించదు.



# పుడమినేలు దేవతలిద్దరికీ పుష్పయాగం




పుష్పయాగమనేది అనేకవిధ సుగంధపుష్పాలతో భగవంతుణ్ణీ, భగవతినీ పూజించడమే! ఇది అగ్నిముఖంగా... ఆహుతులతో కూడిన యాగం కాదు. ఇదొక శాంతియాగం. దోషపరిహారార్థం చేసేక్రియ.

ఉత్సవాలలో ధ్వజారోహణంనుండి అవభృథస్నానం దాకా జరిగిన కార్యకలాపాల్లో చిన్న చిన్నలోపాలూ, దోషాలూ చోటు చేసుకుంటుంటాయి.

పుష్పయాగం-పుష్పమంటే 'వికసించేది' అని వ్యుత్పత్తి. విక సించడం ఆనందలక్షణం. ఇట్టి లక్షణం గల్గిన సువాసన గల పుష్పాలతో - భగవంతుణ్ణి విశేషంగా పూజించడం పుష్ప యాగం. నిత్యారాధనలోనూ పుష్పపూజలు ఉన్నా-అవి ఒక్కొక్కటిగా సమర్పిస్తారు. పుష్పయాగంలో అలాకాక రాశులుగా సమర్పిస్తారు. ఇది పుష్పయాగం. అది పుష్పపూజ. దేవాలయాల్లో దేవదేవుణ్ణి సేవించడంలో ఎన్నోరకాల పూజలు చేస్తున్నాం. పత్రాలు, పూలు, సుగంధమంగళద్రవ్యాలు సమర్పిస్తున్నాం. ఆ ప్రక్రియల్లో భాగంగానే పుష్పయాగాన్నీ ఒక విశిష్ట ప్రయోజనంకై వైష్ణవ దేవాలయాల్లో చేస్తారు. స్వామిని పాదాల నుండి క్రమంగా కంఠంవరకూ పూలతో విశేషంగా అలంకరించడం- అంటే రాశిగా పోసి, స్వామివారి లేదా అమ్మవారి ముఖంమాత్రం కన్పించేంతవరకు పూలు సమర్పించడం ఇందలి విశేషం. ఈ సమయంలో ఆగమానుసారం- వేద సూక్తాలూ, ఉపనిషత్తులూ పఠిస్తారు.

పుష్పయాగం చేస్తే అశ్వమేధ యాగం చేసినంత ఫలం కల్గుతుంది. పుత్రసంతానం లేనివారికి పుత్రులు కలుగుతారు. తన తరాలవారూ, తన తర్వాతి పదితరాలవారూ, తనతరం వాళ్లు మొత్తం 21 తరాలవాళ్లు విష్ణుదేవుని అనుగ్రహ పాత్రులై తరిస్తారు. ఈతి బాధలనుండి విముక్తులవుతారు. దేశం సుభిక్షంగా ఉంటుంది.



# పరమపావనం

-శ్రీ ఆముదాల మురళి

శేషాద్రిశిఖరంపై వెలసిన శ్రీమద్వేంకటరమణుని పట్టపుదేవేరి పద్మావతిఅమ్మవారు. తిరుపతిక్షేత్రానికి సమీపంలోని తిరుచానూరులో అమ్మవారు వెలసి, భక్తుల పాలిట కొంగుబంగారమై ఆదుకొంటున్నది.

శ్రీపద్మావతిఅమ్మవారు తిరుచానూరులో ఉన్న 'పద్మసరోవరం'లో తమిళ- (వృశ్చిక) కార్తికమాసం శుద్ధపంచమి నాడు (తెలుగువారికైతే మార్గశిర-శుద్ధ పంచమి) అవతరించింది. ఆమె పద్మంలో పుట్టింది కనుక పద్మావతిగా ప్రసిద్ధికెక్కింది. ఆమెను **'అలర్‌మేల్‌మంగై'** అంటారు. అలర్ అంటే పుష్పమని అర్థం. అమ్మవారు పుష్పోద్భవ కనుక ఆమెహృదయం కోమలమైనది. తనబిడ్డలకష్టాన్ని గుర్తించి, స్వామివారికి నివేదిస్తుంది. స్వామి అనుగ్రహిస్తాడు.

అమ్మవారు ఆవిర్భవించిన తమిళకార్తికమాసంలో బ్రహ్మదేవుడు స్వామివారికిలాగే అమ్మవారికి ఉత్సవాలు నిర్వహిస్తాడు. అందువల్ల వాటికి కార్తికబ్రహ్మోత్సవా లని పేరు.

శ్రీనివాసునిబ్రహ్మోత్సవాలు కన్యామాసంలో వైఖానస ఆగమంప్రకారం జరుగుతాయి. అమ్మవారికి కార్తికమాసంలో పాంచరాత్రాగమంప్రకారం జరుగుతాయి.

అమ్మవారిబ్రహ్మోత్సవాలకు 33 కోట్లమంది దేవతలతో పాటు శ్రీనివాసుడుకూడా తిరుమలను వీడి వస్తాడు. స్వామివారికి ఈ ఉత్సవాలంటే మిక్కిలి ప్రీతి. ఈ ఉత్సవాల్లో పాల్గొన్నవారికి సకలశుభాలూ కలుగుతాయని స్వామి వరం కూడా ప్రసాదించాడు.

బ్రహ్మదేవుడు సకలజీవులసృష్టికి కావలసినశక్తిని బ్రహ్మోత్సవాలు నిర్వహించి, మాతృసేవద్వారా పొందుతాడు. ఆయా దేవతలు వారి వారి దైవత్వాన్ని సుస్థిరపరచుకోవడానికి ఈ ఉత్సవాలకు విచ్చేస్తారు. పద్మావతీఅమ్మవారిజన్మతిథి పంచమి, ఉత్తరాషాఢనక్షత్రం. తమిళకార్తికశుక్లపంచమినాడు 'పంచమీతీర్థం' పేరుతో కార్తికబ్రహ్మోత్సవాల అవభృథస్నానం జరుగుతుంది. బ్రహ్మోత్సవాలలో మకుటాయమైన ఈ ఘట్టానికి ఎనిమిదిరోజులుముందు అంకురార్పణం, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమౌతాయి. శ్రీవారి ధ్వజంలో గరుడలాంఛనం ఉంటే- అమ్మవారిధ్వజం గజచిహ్నం కలిగి ఉంటుంది. గజం లక్ష్మీనివాసస్థానం.

వ్యాసమహర్షిపుత్రుడైనశుకమహర్షి సర్వసంగపరిత్యాగి. తండ్రిద్వారా బ్రహ్మజ్ఞానియై మిక్కిలివైరాగ్యంతో గోదోహనకాలంకూడా ఎక్కడ నిలువకుండా అవధూతగా సంచరించిన మహాత్ముడు. ఆయన స్థిరంగా ఉండి, తపస్సు చేసిన పవిత్రస్థలం శ్రీశుకనూరు. అదే కాలక్రమంలో తిరుచానూరుగా ప్రసిద్ధికెక్కింది. అంతటి తపశ్శక్తిగలప్రదేశమైన

తిరుచానూరులో అడుగిడినంతనే సకలక్లేశాలు పటాపంచలై పోతాయి. అట్టిక్షేత్రం అమ్మవారిజన్మస్థలం కావడం, అది బ్రహ్మోత్సవాలు జరిగేకాలం కావడంతో మరింత శక్తి మంతమౌతుంది. లౌకికభోగాలను కోరేవారికి భోగసిద్ధి, పారమార్థికస్థితిని కోరేవారికి యోగసిద్ధి కలుగుతుంది.

స్వామివారు వకుళాపుత్రుడై ఆకాశరాజుకుమార్తె పద్మావతిని వివాహమాడడం జగన్నాటకంలో ఒకభాగం మాత్రమే! నాటకాన్ని రక్తికట్టించడం స్వామికి వెన్నతో పెట్టినవిద్య. అందుకే ఏకాంతసేవ తర్వాత ప్రతిరాత్రి స్వామి తిరుచానూరుకు వస్తాడు. బ్రహ్మోత్సవసమయంలో తొమ్మిదిరోజులు తిరుచానూరులోనే మకాం వేస్తాడు. తల్లి దండ్రులనిద్దరిని ఒకేచోట చూచి, బ్రహ్మ మురిసిపోతాడు. ఆ ఆనందంతో ఉత్సవాలవైభవం మిన్నందుకొంటుంది.

వివిధఅలంకరణలతో అమ్మవారు వివిధవాహ నాలపై ఊరేగుతుంది. శ్రీనివాసుడు భక్తులలో భక్తుడుగా, దేవతలలో అధిదైవతంగా, శిబికావాహకుల్లో వాహకుడుగా కలిసిపోయి, అమ్మవారివైభవాన్ని వీక్షిస్తాడు.

స్వామివారు ఎక్కడ దాగున్నారో నని అమ్మవారు అన్నివైపులా, అందరినీ చూపులతో జల్లెడపడుతుంది. భక్తుల కది చాలు అమ్మవారికటాక్షంవల్ల జన్మజరామరణ దుఃఖాలు పటాపంచలౌతాయి. బ్రహ్మోత్సవాలవేళ శ్రీవారి నుండి అమ్మవారికి సారె అందుతుంది. పల్లకిలో ఊరేగి, పద్మసరోవరమంటపంలో కొలువుదీరి, అభిషేక, తిరుమంజన సేవలను అమ్మవారు అందుకొంటుంది. ముత్తైదువులు పసుపుదారాలు ధరించి, చక్రత్తాళ్వారుతోసహా పద్మసరో వరంలో మునుగుతారు. ఈ వైభవాన్నంతా చూస్తే కళ్లు చేసినపాపాలు, వింటే చెవులు చేసినపాపాలు, స్మరిస్తే మనసుచేసినపాపాలు, పాల్గొంటే శరీరంద్వారా చేసిన పాపాలు నశిస్తాయి. ఇది శ్రీవేంకటాద్రీశునిరమణి పద్మా వతీదేవీపంచమీతీర్థవైభవం.

## వైకుంఠపాళి

### :: 59- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 చి | | 2 జం | బు | 3 కు | మా | 4 రు | డు | |
| త్రా | | బూ | | బే | | చి | | 5 పా |
| 6 దే | వి | | 7 మా | రు | తి | | 8 వా | ణి |
| వి | | 9 సాం | | డు | | 10 న | | ని |
| | 11 అం | బు | ధి | | 12 కు | రు | వు | |
| 13 జ | | డు | | 14 కా | | డు | | 15 సైం |
| 16 యం | త్రం | | 17 కౌ | శి | కం | | 18 వ్య | థ |
| తు | | 19 హా | | | | 20 వా | | వు |
| డు | | 21 సం | వ | ర | ణు | డు | | డు |



## అశ్వవాహనం

**కార్తికబ్రహ్మోత్సవాలలో పద్మావతీదేవి ఎనిమిదవ రోజురాత్రి అశ్వవాహనంపై ఊరేగుతుంది. అశ్వం వేగంగా పరిగెత్తే అందమైన జంతువు. అందుకే ఉపనిష త్తులు ఇంద్రియాలను గుర్రాలుగా అభివర్ణిస్తున్నాయి. అలమేలుమంగ అన్నికోరికలను తీర్చడంలో ఒకే ఒక ఉపాయంగా, సౌభాగ్యంగా ఆర్షవాఙ్మయం తెలియ జేస్తుంది. దారిద్ర్యదుఃఖాన్ని పాగొట్టే అలమేలుమంగ ఆశ్రితుల హృదయంలోని శోకాన్ని తొలగించే లోక మాత. లోకనాథుడైన శ్రీనివాసునికి నిత్యానపాయిని అలమేలుమంగ.**

# యోగ్యుడైన భర్త, ఫలప్రదమైన సంసారం కావాలంటే...

*– శ్రీ డి.వి.ఆర్. భాస్కర్, 99121 99394*

పెళ్లీడుకొచ్చిన ప్రతియువతి కాబోయే భర్త గురించి, వైవాహికజీవితంగురించి కలలు కనడం సహజం. ఆ కలలు నెరవేరాలని ఎన్నోవ్రతాలు, నోములు చేస్తుంటారు. ఏటా జరుపుకునే అట్లతద్దినోము అందులో ముఖ్యమైంది. ఆశ్వయుజమాసంలో విజయదశమి తర్వాత వచ్చే తదియనాడు ఈ పండుగ జరుపుకుంటారు.

త్రిలోకసంచారి నారదుడిప్రోద్బలంతో శివుణ్ణి తనపతిగా పొందడానికి పార్వతిదేవి మొదట చేసిన విశిష్టమైనవ్రతమే ఈ అట్లతద్ది.

స్త్రీలు సౌభాగ్యంకోసం చేసుకునే ఈ పర్వదినాన 'అట్లతద్దె ఆరట్లు.. ముద్దపప్పు మూడట్లు' అంటూ ఆడపడుచులకు బంధువులకు, ఇరుగుపొరుగులకు వాయనాలివ్వడం పరిపాటి. సాయంసమయంలో వాయనాలు, నైవేద్యాలు పూర్తిచేసి, గోపూజకు వెళ్లి, అటునుంచి చెరువులు, ఏటి కాలువల్లో దీపాలను వదలి, చెట్లకు ఊయలకట్టి ఊగుతారు.

ఐదేళ్లు దాటిన బాలికలనుంచి పండుముత్తైదువుల వరకు దీన్ని చేసుకుంటారు. అవివాహితయువతలు మంచిభర్త రావాలని పూజిస్తే, వివాహితులు మంచిభర్త దొరికినందుకు, అతడు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటారు. సాధారణంగా వివాహమైన తర్వాత పదేళ్లపాటు తప్పనిసరిగా ఈ పూజను చేసి, సమాప్తం అయిందనడానికి గుర్తుగా ఉద్యాపనచేస్తారు.

అంటే చివరిసారి పూజచేసి ముత్తైదువుల్ని పిలిచి వాయినాలిచ్చి కన్నులపండువగా ముగిస్తారు. ఇందులో చంద్రారాధన ప్రధానమైన పూజ, చంద్రకళల్లో కొలువై ఉన్న శక్తి అనుగ్రహం చేత స్త్రీసౌభాగ్యం పెరుగుతుంది. కుటుంబంలో సుఖశాంతులు వర్ధిల్లుతాయని శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

ఈ పండుగలో అట్లను అమ్మవారికి నైవేద్యంగా పెట్టడంలో ఒక అంతరార్థం ఉంది. నవగ్రహాలలో కుజుడుకీ అట్లంటే మహాప్రీతి. అట్లను ఆయనకు నైవేద్యంగాపెడితే కుజదోషపరిహారమై సంసారంలో ఎలాంటి ఆటంకాలు రావని నమ్మకం. రజోదయానికి కారకుడు కాబట్టి ఋతు చక్రం సక్రమంగా ఉంచి ఋతుసమస్యలు రాకుండా కాపాడుతాడు. దీంతో గర్భధారణలో ఎలాంటి ఇబ్బందులు

## అట్ల తద్దె రోజున ఉమాదేవిని పూజిస్తే..?

**శక్తిస్వరూపిణి అయిన అమ్మవారిని మహిళలు భక్తిశ్రద్ధలతో పూజిస్తుంటారు. విశేషమైన పర్వదినాల్లో అధికంగా పూజిస్తుంటారు. సకలసౌభాగ్యాలు ప్రాసాదించేదేవి, జీవితాన్ని ఆనందింపజేయుదేవి అమ్మవారేనని మహిళలు భావిస్తుంటారు. ముఖ్యంగా అట్లతద్దెరోజున అమ్మవారిని ఎక్కువగా శక్తి స్వరూపిణి అయిన అమ్మవారినిగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజిస్తుంటారు. విశేషమైన పర్వదినాల్లో అధికంగా పూజిస్తుంటారు.**

**సకలసౌభాగ్యాలు ప్రాసాదించే దేవి, జీవితాన్ని ఆనందింపజేయుదేవి అమ్మవారేనని మహిళలు భావిస్తుంటారు. ముఖ్యంగా అట్లతద్దె రోజున అమ్మవారిని ఎక్కువగా ఆరాధిస్తుంటారు.**

ఉండవు. మినప్పప్పు, బియ్యంపిండి కలిపి అట్లను తయారు చేస్తారు. మినుములు రాహువుకు, బియ్యం చంద్రుడికి సంబంధించిన ధాన్యాలు. గర్భదోషాలు తొలగిపోవాలంటే ఈ అట్లనే వాయనంగా ఇవ్వాలి. గర్భస్రావం రాకుండా, సుఖప్రసవం అయ్యేందుకు దోహదపడుతుందికూడా! అందుకే ముత్తైదువులకు అట్లను వాయనంగా ఇస్తారు. అట్లతద్దిలోని 'అట్ల'కు ఇంతటి శాస్త్రీయవిజ్ఞానం నిక్షిప్తం చేయబడింది.

అట్లతద్దికి ముందురోజు స్త్రీలంతా చేతులకు, పాదాలకు గోరింటాకు పెట్టుకుని ఎవరిచేయి బాగా పండిందని ఉత్సాహంగా చూచుకుంటారు. ఎవరిచేయి ఎర్రగా పండితే వారికి అదృష్టం బాగుంటుందని వారి విశ్వాసం.

అట్లతద్దినాడు తెల్లవారుజామున నిద్రలేస్తారు. అన్నం, గోంగూరపచ్చడి, పెరుగుతో కడుపునిండా తింటారు. 'అట్లతద్దోయ్, ఆరట్లోయ్ ముద్దపప్పు మూడట్లోయ్' అంటూ అరుస్తూ ఇరుగు పొరుగు స్నేహితులందరితో కలిసి, ఆటలు ఆడతారు. ఇందులో పెద్దలుకూడా ఉత్సాహంగా పాల్గొంటారు. వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటారు. ధైర్యంగా వీధుల్లోకి వచ్చి, ఆడుకోవడానికి ఇదే అదను కాబట్టి పిల్లలతో బాటు తల్లులుకూడా బాల్యజీవితాల్లోకి వెళ్లి ఆనందం పొందుతారు.

అట్లతద్దిరోజున తెల్లవారుజామున ఇంటిని శుద్ధి చేసుకుని, ఉపవాసం ఉండి, ఇంటిలో తూర్పుదిక్కున మండపాన్ని ఏర్పాటు చేసి, గౌరీదేవిని పూజించాలి. ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి, వినాయకపూజ తర్వాత, గౌరీస్తోత్రం, శ్లోకాలు పఠిస్తారు. సాయంత్రం చంద్రదర్శనం అనంతరం తిరిగి గౌరీపూజచేసి, 10 అట్లు నైవేద్యంగాపెట్టి, ముత్తైదువులను అలంకరించి పదిఅట్లు, పదిపండ్లు వాయనంగా సమర్పించి, అట్లతద్దినోముకథ చెప్పుకుని, అక్షతలు వేసుకోవాలి. ముత్తైదువులకు నల్లపూసలు, లక్కకోళ్లు, రవికగుడ్డలు, దక్షిణతాంబూలాలు ఇచ్చి, భోజనాలు పెట్టి, తామూ భోజనం చేయాలి.



**పదేళ్లు ఈవ్రతాన్ని నిర్వహించి, ఉద్యాపనం చెప్పకున్న స్త్రీలకు సంసారంలో సర్వసుఖాలు లభిస్తాయి. సృష్టిస్థితిలయాలకు కారకులైన బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరుల భార్యలు సరస్వతి, లక్ష్మి, పార్వతులకు నెలపొడవునా కొలువులు సాగేమాసం ఆశ్వయుజం. అమ్మవారికి ఆటపాటలంటే ఇష్టం. కాబట్టి ఇంకా రజస్వలలు కాని ఆడపిల్లలు ఆడినా పాడినా వాళ్లంతా అమ్మవారిసేవ చేస్తున్నట్టే అని చెప్తున్నాయి పురాణాలు.**

ఈ నోమునే 'ఉయ్యాలపండుగ' అనీ, 'గోరింటాకు పండుగ' అనీ అంటారు. ఈ పండుగ చేయడంవల్ల గౌరీదేవిఅనుగ్రహం లభించి, అవివాహితయువతులకు గుణవంతుడు, అందగాడైనవ్యక్తి భర్తగా లభిస్తాడని, పెళ్లయినవారికి సంతానం కలుగుతుం దని, ఐదోతనం లభించడంతోపాటు, పుణ్యం లభిస్తాయని నమ్మకం.

## గ్రంథసమీక్ష

# అభిజ్ఞానశాకుంతలం

రచన - ఆచార్య బేతవోలు రామబ్రహ్మం,
పుటలు-348, వెల- రూ.288/-,
ప్రతులకు - ఎస్.ఆర్.పబ్లికేషన్స్, డి.ఆర్.ఆర్.వీథి,
ఇన్నర్ రింగ్ రోడ్ (అంబాపురం),
విజయవాడ (రూరల్). పిన్‌కోడ్- 520 012.
ఫోన్ : 98498 75959 / 94938 75959
ప్రచురణ - ఎస్.ఆర్.పబ్లికేషన్స్, విజయవాడ

నాటకం అనగానే అభిజ్ఞాన శాకుంతలం అనే పేరు అసంకల్పితంగా మననోటినుంచి వచ్చేంత గొప్పగా ఆ నాటకాన్ని తీర్చిదిద్ది, నాటకరంగానికి మహోపకారం చేశాడు కాళిదాసమహాకవి.

మహాభారతంలోని శకుంతల కథకు రమ్యమైనకల్పనలు జోడించి కాళిదాసు ఏడుఅంకాలుగా ఈ నాటకాన్ని రచించాడు. ఇది కేవలం ప్రణయగాథ కాదు. గొప్పసందేశం ఇందులో దాగుంది. తండ్రీకూతుళ్ల అనురాగం, దాంపత్యధర్మం, ప్రకృతితో మనిషి అనుబంధం తదితరఉదాత్తమైన అంశాలెన్నో ఈ నాటకంలో ఉన్నాయి. ఈ శాకుంతలనాటకాన్ని తేటతెలుగులోకి అనువాదం చేశారు– విఖ్యాతసాహితీమూర్తి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం. సంస్కృతమూలాన్ని యథాతథంగా ఇస్తూ ప్రతిపదానికీ తేలికైన సరళవ్యవహారభాషలో అర్థం, తాత్పర్యసహితంగా వివరణ ఇవ్వటం పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. అవసరమైనచోట ప్రత్యేక వివరణ ఇవ్వటంతో పాఠకులకు నాటకం ఏకబిగిన చదవాలనే ఆసక్తి కలిగిస్తుంది. అనుభవజ్ఞులైన రచయిత కావటంతో వ్యాకరణపరంగా, వివరణపరంగా ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. ప్రారంభంలో మొత్తం నాటకసారాంశాన్ని కథగా అందించటం మరింతగా ఆకట్టుకుంటుంది. ఆనాటి సాహిత్యాన్ని చదవాలనే జిజ్ఞాస కలిగిన నేటితరం పాఠకులకు ఈ పుస్తకం చక్కటి కరదీపిక కాగలదు.

# నృసింహపురాణం

రచన - డా॥ రేమిల్ల వేంకటరామకృష్ణశాస్త్రి,
పుటలు-592, వెల- రూ.603/-,
ప్రతులకు - శ్రీరాఘవేంద్ర పబ్లిషర్స్,
11-25-119, మెయిన్ బజారు, విజయవాడ-1.
సెల్ : 98491 81712, 0866-2421052
ప్రచురణ - ఎస్.ఆర్.పబ్లికేషన్స్, విజయవాడ

ప్రహ్లాదుడు భక్తుల్లో అగ్రగణ్యుడు. పుట్టుకతోనే హరిభక్తిని అణువణువునా నింపుకున్న భక్తశిఖామణి. అంతటి మహనీయుడిచరిత్రను ప్రబంధంగా తీర్చిదిద్ది, తెలుగుసాహిత్యానికి తరగనికీర్తిని సాధించినవాడు– ఎర్రనమహాకవి. కవిత్రయంలో చివరివాడిగా ప్రసిద్ధిపొందినా, చేసిన స్వతంత్ర రచన 'నృసింహపురాణం'. బ్రహ్మాండ, విష్ణుపురాణాల్లో ఉన్నప్రహ్లాదుడి కథను ఆలంబనగా చేసుకుని, తనదైన శైలిలో ఆ కథను అందమైన ప్రబంధంగా తీర్చిదిద్దాడు. హిరణ్యకశిపుడి జననంతో కథ ప్రారంభమవుతుంది. అతడిరాక్షసప్రవృత్తి, దానివల్ల లోకంపడుతున్న బాధలు, ప్రహ్లాదుడి జననం, విద్యాభ్యాసం, అతడిహరిభక్తి, నరసింహావతారఆవిర్భావం, హిరణ్యకశిపునివధ ప్రధానాంశాలుగా ప్రబంధం సాగుతుంది. చివరగా అహోబలక్షేత్రవర్ణనతో ప్రబంధం ముగుస్తుంది. ఇందులోని పద్యాలన్నీ చక్కటి కథాగమనంతో నడుస్తూ, తీరైన రసపోషణతో పాఠకులను ఇట్టే ఆకట్టుకుంటాయి. ఎర్రన పద్యప్రబంధానికి తేటతెలుగులో వ్యాఖ్యానం రాసి, నేటితరం సాహిత్యప్రియులకు ప్రబంధాన్ని మరింత చేరువచేశారు వ్యాఖ్యానరచయిత రామకృష్ణశాస్త్రి. మూలపద్యంతో పాటు ప్రతిపదార్థం, భావంతో పాటు సందర్భోచితవిశేషాలను ఎర్రన కవి హృదయాన్ని ఆవిష్కరిస్తూ రాసినతీరు ఆకట్టుకుంటుంది. తేలికైన సరళవ్యవహారభాషలో సాగిన ఈ రచన యువతరాన్నికూడా సాహిత్యఅధ్యయనంపట్ల ఆకర్షితులను చేస్తుంది.

- డా॥ కప్పగంతు రామకృష్ణ

# నవంబరు, 2020 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** స్వల్పఅస్వస్థత, అనారోగ్యం, అస్తిమితం. ఒక్క గురుబలమే అనేకానేకదుష్ఫలితాలకు దీటుగా నిలుస్తుంది.



**వృషభం–** భాగస్వాములనుండి తప్పుకుని, స్వయంగా ఉపాధి చూచుకుంటారు. వ్యవసాయ దారులకు అధికదిగుబడులవల్ల లాభాలు.



**మిథునం–** ఎప్పటినుంచో అనుకుంటున్న ఆలోచనలు చక్కటిప్రణాళికతో కలసివస్తాయి. దగ్గరలో గాని, దూరప్రాంతాలలో భూమి కొనుగోలు చేస్తారు. వాహనసౌఖ్యం కలుగుతుంది. శుక్రునిచతుర్థ స్థానసంచారకాలంలో ఉన్నతవిద్యలు అనుకూలిస్తాయి.



**కర్కాటకం–** పరపీడ, అవమానాలు అనుభవించాల్సి వస్తుంది. దూరప్రయాణాలవల్ల ధన వ్యయం. వర్తకవ్యాపారాలలో ధనలాభం, ఎంతో కాలంగా ఉన్నసమస్యలకు శాశ్వతపరిష్కారం లభించును.



**సింహం–** చిత్తచాంచల్యం, ప్రయాణాలలో అవరోధాలు. కానీ వృత్తివ్యాపారాల్లో ధన సౌఖ్యం.



**కన్య–** సుఖసంతోషాలు, సాధుజనులను సేవించుట, సజ్జనగోష్ఠి మొదలైనవి సంభవిస్తాయి. నరఘోష, పరపీడలు తొలగుతాయి. భోగ భాగ్యాలనుభవిస్తారు.



**తుల–** ఉద్యోగవిషయాల్లో కష్టనష్టాలు, చేసిన పని అంతగా అనుకూలించకపోవుట, శారీరకబాధల వల్ల వైద్యులతో సంప్రదించడం, ఔషధసేవనం.



**వృశ్చికం–**స్థానభ్రంశం, చేసింది అనుభవించక తప్పదు. బంధనయోగం, నీచకార్యాచరణ, ధన సంపాదన బాధిస్తుంది. ఈశ్వరారాధన ఉపశమనాన్నిస్తుంది.



**ధనుస్సు–** ఈ నెలనుండి గురునిఏకాదశ సంచారం. నూతనదృక్పథాలను ఏర్పరచుకుని నూతనసంస్థలను స్థాపించి, పురోగమనంలో నడుపుతారు. సంతానంకోసం ఆలోచిస్తారు.




**మకరం –** ఈ మాసం అత్యద్భుతఫలితాలతో దూసుకుపోతారు. సంతోషం, ఋణవిముక్తి, యశోవృద్ధి, బంధుమిత్రులతో సత్సంబంధాలు నెలకొంటాయి.



**కుంభం–** తలచినకార్యాలు గట్టెక్కుతాయి. భూక్రయవిక్రయాల్లో మధ్యవర్తిత్వం వహించటం వల్ల లాభం. కార్యసిద్ధి.



**మీనం–** కుటుంబసుఖసంతోషాలకోసం ధన వ్యయం. వాహనం, కొత్తపనిముట్లు కొనుగోలు చేస్తారు. భూగృహస్థిరాస్తులమార్పువల్ల ఆదాయం కలసివస్తుంది.



**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

# సప్తగిరి

(సచిత్ర మాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2.** కావలసిన భాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3.** సంవత్సర/జీవిత చందా :

రూ.60/- ☐ రూ.500/- ☐

**4.** చందా పునరుద్ధరణ :

(అ) చందా నెంబరు :

(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. :

తేది :

(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# 59 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు

### అడ్డం

2)శూర్పణఖకొడుకు(5); 6)ప్రహ్లాదునిభార్య(2); 7)హనుమంతుడు(3); 8)సరస్వతి(2); 11)సముద్రం(3); 12)కురువంశమూలపురుషుడు(3); 16)దోషనివారణకు ఇది వేయించుకుంటారు(2); 17)గోమతీనదికి మరొకపేరు(3); 18)బాధ(2); 21)సూర్యునిఅల్లుడు(5)

### నిలువు

1)కుబేరునిభార్య(4); 2)మేరుపర్వతానికి దక్షిణానగల ద్వీపం పేరు(2); 3)ఉత్తరదిక్కుకు అధిపతి(4); 4)ఉప్పును ఇలాకూడా అంటారు.(2); 5)సంస్కృతవ్యాకరణాన్ని మొదటగా చెప్పినవాడు(3); 9)జాంబవతికుమారుడు(3); 10)మానవుడు(3); 13)ఇంద్రునికొడుకు(3); 14)పుణ్యక్షేత్రం(4); 15)ధృతరాష్ట్రుని అల్లుడు(4); 19)నవ్వు(2); 20)వీడు కాదు(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు


Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

తిరుమల తిరుపతి దేవస్థానములు



## 16-10-2020 నుండి 24-10-2020 వరకు జరిగిన శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవ దృశ్యమాలిక !

















SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY
Published by Tirumala Tirupati Devasthanams printing on 25-10-2020.
Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020



తిరుచానూరు
శ్రీ పద్మావతీ అమ్మవారి
పుష్పయాగమహోత్సవం
( 20-11-2020 )